

'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 89

మంగళవారం 20-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భవానికి కాంస్యం

ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన తొలి భారత ఫెన్సర్ -12లో



ఇండిగో రికార్డ్ ఆర్డర్

ఎయిర్‌బస్ నుంచి 500 విమానాల కొనుగోలు. 2030–35 మధ్య డెలివరీ -13లో



రా చీఫ్‌గా రవి సిన్హా నియామకం

'రా' అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి రవి సిన్హా(59) నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది.

- వివరాలు 6లో



2 రోజులు తేలికపాటి వానలు

'నైరుతి' విస్తరించనున్న నేపథ్యంలో రాష్ట్రంలో రెండు రోజులపాటు వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

- వివరాలు 14లో



ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హతం

ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్‌అధిపతి హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఆదివారం రాత్రి కెనడాలో కాల్చిచంపారు.

- వివరాలు 6లో



తంపులమారి చైనా

చైనా పీపుల్స్ రిపబ్లిక్ దేశంగా ఏర్పడిన నాటి నుంచి సరిహద్దుల విషయంలో భారత్‌తో గిల్లికజ్జాలు పెట్టుకుంటోంది.

- వివరాలు 6లో

మళ్లీ వచ్చేది మేమే!

బీఆర్‌ఎస్ గెలుపుపై అనుమానమే అవసరం లేదు: సీఎం కేసీఆర్

- పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును త్వరలో పూర్తిచేస్తాం
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లకు గోదావరి నీళ్లు మళ్లిస్తాం
- మహేశ్వరం, చేవెళ్ల, వికారాబాద్‌కు సాగునీరు ఇస్తాం
- ఇన్నాళ్లూ కోర్టుల్లో కేసులు వేస్తూ పాలమూరును అడ్డుకున్నది కాంగ్రెస్సే
- ఈసారి హరితహారంలో పండ్ల మొక్కల పంపిణీ
- ఇందుకోసం రూ.100 కోట్లను ఖర్చు చేయనున్నాం
- ఫారెస్ట్ అధికారుల కోసం 20 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడి
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తుమ్మలూరులో మొక్కలు నాటిన సీఎం



తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు సబిత, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని.. ఈ విషయంలో ఎలాంటి అనుమానం అవసరం లేదని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులను త్వరలో పూర్తిచేసి.. నాలుగైదు మాసాల్లోనే రిజర్వాయర్లను నీటితో నింపుతామని ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలను తరలిస్తామని.. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాలకు కాళేశ్వరం జలాలను తరలిస్తామని తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు అర్బన్‌ఫారెస్ట్‌లో సీఎం కేసీఆర్ హరితహారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

''కాళేశ్వరంతోపాటే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కూడా పూర్తి కావాల్సి ఉంది. కానీ కాంగ్రెస్ వాళ్లు అడ్డు తగిలి కోర్టుల్లో కేసులు వేసి పనులు ఆగేలా చేశారు. ఎన్నో అడ్డంకులు సృష్టించినా ప్రభుత్వం పనులు కొనసాగించి ఇప్పటికే

మిగతా 2వ పేజీలో ▶

వలస నేతల 'ఉక్కపోత'!

త్వరలో ఈటల, రాజగోపాల్ సారథ్యంలో కీలక భేటీ?

- బీఆర్‌ఎస్‌పై బీజేపీ తాజా వైఖరిపై నేతల్లో అనుమానాలు
- వీరి సేవలు సరిగా వినియోగించుకోక పోవడంపై అనుచరుల్లో అసంతృప్తి... కేసీఆర్‌పై పోరాడే పార్టీలోకి వెళ్లాలని క్యాడర్ నుంచి ఒత్తిడి
- గత కొన్నిరోజులుగా కోమటిరెడ్డి, ఈటల వరుస భేటీలు
- బీఆర్‌ఎస్ వ్యతిరేకులందరితో రాజగోపాల్ సమాలోచన
- కీలక భేటీలో వ్యక్తమయ్యే అభిప్రాయం మేరకు రాజకీయ కార్యాచరణ!





సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) విషయంలో బీజేపీ తాజా వైఖరి ఆ పార్టీ నేతలను ఒకింత అసంతృప్తి, ఆందోళనకు గురిచేస్తోంది. తెలంగాణలో పాలన తీరు.. కేసీఆర్, ఆయన కుటుంబంపై అవినీతి ఆరోపణల విషయంలో మెతకగా వ్యవహరించాలన్న సంకేతాల అంశం బీజేపీలో రాజకీయ ప్రకంపనలకు కారణమయ్యే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్‌లో కీలక నేతగా ఎదిగి, హుజూరాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించిన ఈటల రాజేందర్, కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మునుగోడు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపు అంచుల వరకు వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల సేవలను బీజేపీ విస్తృత స్థాయిలో వినియోగించుకోలేక పోతోందన్న ఆవేదనను వారి అనుచరులు వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ విషయంలో మారిన పార్టీ వైఖరితో పాటు సమర్థులైన నాయకులను సరైన పద్ధతిలో వాడుకోలేకపోతోందన్న విషయంలో ఈ ఇద్దరి నాయకులపై క్యాడర్ నుండి తీవ్ర ఒత్తిడి వస్తోందని సమాచారం. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ఓటమి తర్వాత కేసీఆర్, ఆయన ప్రభుత్వం, ఇప్పటికే వెలుగులోకి వచ్చిన కేసుల విషయంలో వేగం తగ్గిందని, ఇది బీజేపీ క్యాడర్‌ను నిరుత్సాహానికి గురి చేయడంతో పాటు వారిలో అనుమానాలకు కారణమవుతోందని అంటున్నారు. ఇన్నాళ్లు కేసీఆర్, ఆయన కుటుంబంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన తాము ఇప్పుడెలా

మిగతా 2వ పేజీలో ▶

వర్షాభావం ఎదురైనా.. నీళ్లు ఇద్దాం!

రైతులకు సాగునీటి సరఫరా కోసం ముందస్తు చర్యలు

- ఎంత ఖర్చయినా ఫర్వాలేదు ఏర్పాట్లు చేయండి... తాగు, సాగునీటిపై సమీక్షలో అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశం
- కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీకి 35 టీఎంసీలు తరలించాలి
- తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడండి

సాక్షి, హైదరాబాద్: రుతుపవనాల ఆలస్యంతో వర్షాభావ పరిస్థితులు ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో.. రాష్ట్రంలో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ రాకుండా చూడాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులు కొనసాగితే.. రైతులకు సాగు నీటిని సరఫరా చేసేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని.. అందుకు ఎంత ఖర్చయినా ఫర్వాలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల కోసం ఏర్పాట్లు చేయాలని, అన్ని రిజర్వాయర్లను నింపాలని

మిగతా 2వ పేజీలో ▶

26 నుంచి రైతుబంధు

వానాకాలం పంటల కోసం జూన్ 26 నుంచి రైతుబంధు సొమ్ము పంపిణీని ప్రారంభించాలని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. పోడు భూముల పట్టాల పంపిణీ పూర్తయ్యాక పట్టాలు పొందిన గిరిజన రైతులకు రైతుబంధు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇక 'సివిల్ సప్లైస్' రైస్‌మిల్లులు

ప్రతి జిల్లాలో అత్యాధునిక మిల్లుల ఏర్పాటుకు సీఎం కేసీఆర్ నిర్ణయం 2లో

ప్రభుత్వ ఉద్యోగులకు 'దశాబ్ది' కానుక

డీఏ 2.73 శాతం పెంచిన సర్కారు

- 2022 జనవరి నుంచి వర్తింపు... ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త అందించింది. దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని ఉద్యోగుల డీఏ, పెన్షనర్ల డీఆర్‌ను పెంచింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం జీవో 50, జీవో 51లను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్ల బేసిక్ పే పైన 2.73 శాతం చొప్పున డీఏ/డీఆర్‌ను ప్రభుత్వం పెంచింది. పెంచిన డీఏ/డీఆర్ జనవరి 2022 నుంచి అమల్లోకి రానుంది. ఈ ఏడాది జూన్ నెలకు

మిగతా 2వ పేజీలో ▶

అక్టోబర్‌లో అసెంబ్లీ షెడ్యూల్!

ఆ నెల 5–15 తేదీల మధ్య విడుదల కావొచ్చని రెవెన్యూ వర్గాల అంచనా

- మరో 4 రాష్ట్రాలతో కలిపి నిర్వహించే అవకాశం
- ఆర్వో, ఏఆర్వో, ఇతర పోలింగ్ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లపై కసరత్తు షురూ
- డిప్యూటీ కలెక్టర్లకు తోడుగా అదనపు కలెక్టర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లకు రిటర్నింగ్ ఆఫీసర్ బాధ్యతలు
- మార్చి 5–15 మధ్య లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోసం రెవెన్యూ శాఖ సమాయత్తం అవుతోంది. ఈ ఏడాది అక్టోబర్ 5–15 తేదీల మధ్యలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని, అందుకు తగినట్టుగా కార్యాచరణ మొదలైందని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులు (ఆర్వో), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్వో)తోపాటు క్షేత్రస్థాయిలో ఎంత మంది సిబ్బంది అవసరమనే దానిపై కసరత్తు జరుగుతోందని తెలిపాయి. ఆర్వోలుగా డిప్యూటీ కలెక్టర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లతోపాటు ఈసారి జిల్లాల అదనపు కలెక్టర్లకు

మిగతా 10వ పేజీలో ▶



బోగీపై తెగిపడిన బ్రాకెట్ ఇన్సులేటర్లు

రైలుపై తెగిపడిన బ్రాకెట్ ఇన్సులేటర్లు

- పెద్ద శబ్దం.. బోగీలపై వ్యాపించిన మంటలు
- మధిర సమీపంలో నిలిచిన శాతవాహన ఎక్స్‌ప్రెస్

14లో

ఎస్సీ హాస్టల్లో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న రక్షిత

- ఆర్మూర్‌లోని కళాశాలలో చదువుతున్న విద్యార్థిని
- మరో రెండురోజుల్లో డిగ్రీ పూర్తవుతుందనగా బలవన్మరణం

- వివరాలు 5లో



రక్షిత (ఫైల్)

బంగాళాఖాతంలో కలిసేది బీఆర్‌ఎస్సే

5 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది: భట్టి

- తెలంగాణ ప్రజల కోసమే నా పాదయాత్ర
- నల్లగొండకు కృష్ణా జలాలను తరలించాలన్నదే లక్ష్యం
- గుత్తా సుఖేందర్‌రెడ్డి ఈ విషయం తెలుసుకోవాలని వ్యాఖ్య
- పీపుల్స్ మార్చ్ యాత్రలో భాగంగా నకిరేకల్‌లో కార్నర్ మీటింగ్



నకిరేకల్‌లో మాట్లాడుతున్న భట్టి

నకిరేకల్: ''కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలపడం కేసీఆర్ వల్ల కాదు కదా.. ఆయన తాత వల్ల కూడా కాదు. కేసీఆర్ లాంటి వాళ్లు చాలా మంది వచ్చి వెళ్లారు. కాంగ్రెస్ మాత్రం 120 ఏళ్లుగా ప్రజల మధ్య పటిష్టంగా ఉంది. అధికారంతో విర్రవీగుతున్న కేసీఆర్ పాలనను ప్రజలు బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైంది..'' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాబోయే ఐదు నెలల్లో కాంగ్రెస్

మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్


నీట్ మెడికల్ పీజీ స్టేట్ ర్యాంక్‌లు విడుదల



నీట్ పీజీ మెడికల్, నీట్ ఎండీఎస్ రాష్ట్రస్థాయి ర్యాంకులు విడుదలయ్యాయి. ఫలితాలు విడుదలైన మూడు నెలల తర్వాత రాష్ట్రస్థాయి డేటాను జాతీయ మెడికల్ కమిషన్ విడుదల చేసింది. ఇది మెరిట్ జాబితా కాదని కాళోజీ వర్సిటీ తెలిపింది.

- వివరాలు 14లో

అత్యంత కీలక పోస్టులూ భర్తీ చేయరా?: హైకోర్టు



తెలంగాణ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడిని ఎప్పుడు నియమిస్తారో చెప్పాలని, అత్యంత కీలక పోస్టులూ భర్తీ చేయకుంటే ఎలా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది.

- వివరాలు 14లో

పోడు పట్టాలు రెడీ!



రాష్ట్రంలో పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 24వ తేదీన ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకోసం గిరిజన సంక్షేమశాఖ, అటవీ శాఖలు ఏర్పాట్లు పూర్తి చేశాయి.

- వివరాలు 5లో

ఎన్‌హెచ్ 65ని ఆరు లేన్లుగా మార్చండి



ఎన్‌హెచ్ 65ని ఆరు లేన్లుగా మార్చాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. సోమవారం ఢిల్లీలో ఆయనను కలిసి భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ సమస్యలపై చర్చించారు.

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



మిగతా విషయాల్లో విభేదించినా, ఈ విషయంలో మాత్రం ఏకీభవిస్తున్నాడట సార్!

క్లుప్తంగా...

ఎన్‌హెచ్ 65ని ఆరు లేన్లుగా మార్చండి

కేంద్రమంత్రి గడ్కరీకి ఎంపీ కోమటిరెడ్డి విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్–విజయవాడను కలిపే జాతీయ రహదారి 65ని ఆరు లేన్లుగా మార్చాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసిన సందర్భంగా భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ సమస్యలపై ఎంపీ కోమటిరెడ్డి చర్చించారు. జాతీయ రహదారి 65పై వాహనాల రద్దీ పెరగడంతో నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి దృష్టికి కోమటిరెడ్డి తీసుకెళ్లారు. ఈ రహదారిపై గుర్తించిన 17 బ్లాక్‌స్పాట్ల మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేయాలని అభ్యర్థించారు. ఎన్‌హెచ్ 65ను ఆరు లేన్లుగా మార్చే పనులను రాబోయే 2 నెలల్లోగా ప్రారంభిస్తామని గడ్కరీ హామీ ఇచ్చారని ఎంపీ కోమటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

జూలై 12న ఆర్ఎంసీ భేటీ!

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసేందుకు కృష్ణా బోర్డు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. వచ్చే నెల 12న రిజర్వాయర్ల నిర్వహణ కమిటీ (ఆర్ఎంసీ) సమావేశం నిర్వహించాలని కేఆర్ఎంబీ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు పేర్కొంది. జలవిద్యుదుత్పత్తితో పాటు సాగునీటి అవసరాలకు నీటి తరలింపులు, వరద జలాల లెక్కింపు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు వివరించింది.

ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలి

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బాధితురాలు షేజల్ నిరాహార దీక్ష




సాక్షి, న్యూఢిల్లీ: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు షేజల్ సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో షేజల్ నిరాహార దీక్ష చేపట్టారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు న్యాయ దీక్ష కొనసాగుతుందని తెలిపారు. 'ఆరిజిన్ డైరీ ప్లాంటు'నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని చూపించి..తమ వద్ద రూ.30 లక్షలు తీసుకుని మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను లైంగికంగా వేధించిన కామ పిశాచి చిన్నయ్యను అరెస్ట్ చేయాలని షేజల్ డిమాండ్ చేశారు.

డాక్టర్ ఎన్.గోపికి 'జయశంకర్ విశిష్ట సాహితీ పురస్కారం'

సాక్షి, హైదరాబాద్: సాహిత్యంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వారికి భారత జాగృతి ఇచ్చే ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విశిష్ట సాహితీ పురస్కారానికి ఆచార్య ఎన్.గోపి ఎంపికయ్యారు. ఈ నెల 21న అబిడ్స్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగే కార్యక్రమంలో భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అవార్డును ప్రదానం చేస్తారు. అవార్డుతో పాటు రూ.1,01,116 నగదు, స్వర్ణ కంకణం బహూకరిస్తారు. విశిష్ట సాహితీ పురస్కారాన్ని ప్రారంభిస్తున్న తొలి ఏడాదే పురస్కారాన్ని ఎన్.గోపి అందుకుంటున్నారు. ఆచార్య ఎన్.గోపి తెలుగు యూనివర్సిటీకి వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించడంతో పాటు కాకతీయ, ద్రవిడ యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీగా పని చేశారు. ఇప్పటివరకు ఆయన 56 పుస్తకాలు రచించారు. అందులో 26 కవితా సంకలనాలు, 7 వ్యాస సంకలనాలు, 5 అనువాదాలు, ఇతరాలు ఉన్నాయి. గోపి రచనలు అన్ని భారతీయ భాషల్లోకి, పలు విదేశీ భాషల్లోకి అనువాదం అయ్యాయి.

బీసీ బంధును వెంటనే అమలు చేయాలి: ఆర్.కృష్ణయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న వీహెచ్, ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): సీఎం కేసీఆర్ ప్రకటించిన బీసీ బంధు పథకం వెంటనే అమలు చేసి, ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో జరిగిన బీసీ యువజన సంఘం సమావేశంలో ఆర్.కృష్ణయ్య ప్రసంగించారు. ప్రభుత్వం లక్ష రూపాయల పథకాన్ని కేవలం 14 కులాలకే పరిమితం చేయకుండా, బీసీ జాబితాలోని 130 కులాలకూ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలో 62 లక్షల బీసీ కుటుంబాలుంటే, బీసీ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు బడ్జెట్ విడుదల చేశారని, ఇది ఏ మూలకు సరిపోదని తెలిపారు. రద్దు చేసిన జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ పోస్టులను, తొమ్మిదేళ్లుగా ఖాళీగా ఉన్న బీసీ కార్పొరేషన్లకు ఎండీ పోస్టులను, ఐదేళ్లుగా ఖాళీగా ఉన్న బీసీ కమిషనర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత వీహెచ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇక 'సివిల్ సప్లైస్' రైస్‌మిల్లులు

- ప్రతి జిల్లాలో అత్యాధునిక మిల్లుల ఏర్పాటుకు సీఎం కేసీఆర్ నిర్ణయం
- జపాన్‌కు చెందిన సటాకే కార్పొరేషన్ సంస్థ ప్రతినిధులతో చర్చలు
- రూ.2 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా.. త్వరలోనే శంకుస్థాపన
- మిల్లులకు అనుబంధంగా రైస్‌బ్రాన్ నూనె ఉత్పత్తి కర్మాగారాలు
- ధాన్యం నిల్వ కోసం గోదాముల నిర్మాణం కూడా..
- రాష్ట్ర రైతులను లాభాలు ఆర్జించే స్థాయికి చేరుస్తామన్న సీఎం



సాక్షి, హైదరాబాద్: వరి ధాన్యాన్ని బియ్యం, నూనె, పలు ఇతర రకాల ఉత్పత్తులుగా మార్చే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను జిల్లాల వారీగా ఏర్పాటు చేస్తామని.. తెలంగాణ రైతులను లాభాన్ని ఆర్జించే స్థాయికి చేరుస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో గంటకు 60 టన్నులు, 120 టన్నుల ధాన్యాన్ని మర ఆడించే అత్యాధునిక రైస్‌మిల్లులను.. వాటికి అనుబంధంగా రైస్‌బ్రాన్ నూనె ఉత్పత్తి కర్మాగారాలను, ధాన్యం నిల్వ కోసం గోదాములను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వరి ధాన్యాన్ని ప్రాసెసింగ్ చేసే ప్రపంచ ప్రఖ్యాత రైస్‌మిల్ కంపెనీ జపాన్‌కు చెందిన సటాకే కార్పొరేషన్ ప్రతినిధులతో సోమవారం సచివాలయంలో సీఎం కేసీఆర్ చర్చలు జరిపారు. అనంతరం మంత్రి గంగుల కమలాకర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి ఇతర ఉన్నతాధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు.

మిల్లింగ్ సామర్థ్యం పెరిగేలా..

"రాష్ట్రం వరి ధాన్యం మిల్లింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సి ఉంది. ప్రస్తుతం సీఎంఆర్ మిల్లింగ్ ద్వారా ధాన్యాన్ని బియ్యంగా మార్చే రైస్‌మిల్లుల సామర్థ్యం 75 లక్షల టన్నులకు మించి లేదు. దీనితో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితి నుంచి రైతును గట్టెక్కించేలా అత్యాధునిక రైస్‌మిల్లులను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.." అని సీఎం కేసీఆర్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో రైతులకు కానుకగా విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నామని.. దాదాపు రూ.2వేల కోట్లకుపైగా ఖర్చుతో వీటి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించి నిర్దిష్ట ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి గంగుల, అధికారులను కేసీఆర్ ఆదేశించారు.

రైతులకు ప్రయోజనకరంగా..

రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేయాలనే దార్శనికతతో.. సాగునీరు, ఉచిత్ విద్యుత్, రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఏ కారణంతోనూ పంట వ్యర్థం కాకుండా, తరుగు లేకుండా, రైతులకు ధర తగ్గడం వంటి నష్టాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. రైతుల పంటకు మంచి ధర పలికేలా చేయడం, ధాన్యాన్ని పలు రకాల ఉత్పత్తులుగా మార్చడం లక్ష్యంగా జిల్లాల వారీగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే వరి ధాన్యం ఉత్పత్తి 3 కోట్ల టన్నులకు చేరిందన్నారు. పాలమూరు, బ్రాహ్మణవెల్లెంల, డిండి, గౌరవెల్లి, సీతారామ, మల్కపేట, అచ్చంపేట ఉమామహేశ్వర వంటి ప్రాజెక్టులు పూర్తయితే వరి ఉత్పత్తి మరింత భారీగా పెరుగుతుందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 'దశాబ్ది' కానుక

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించి తాజాగా పెరిగిన డీఏ/డీఆర్‌ను జూలై నెల వేతనంతో కలిపి అందిస్తారు. గతేడాది జనవరి 1 నుంచి మే 31 వరకు ఇవ్వాల్సిన బకాయిలకు సంబంధించి ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేస్తామని ఆర్థిక శాఖ పేర్కొంది. ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపుతో రాష్ట్రవ్యాప్తంగా 7.28 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్ర ప్రభుత్వంపై నెలకు రూ.81.18 కోట్లు, సంవత్సరానికి రూ.974.16 కోట్ల అదనపు భారం పడనుంది. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది మే వరకు బకాయిలు రూ.1,380.09 కోట్ల చెల్లింపుపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది.

డీఏ పెరిగిందిలా..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు: 20.02% నుంచి 22.75%కు పెంపు

యూజీసీ/ఏఐసీటీఈ/ ఎస్ఎన్ జేపీసీ పేస్కేల్స్ (2016): 31% నుంచి 34%కు పెంపు

యూజీసీ/ఏఐసీటీఈ/ ఎఫ్ఎన్ జేపీసీ పేస్కేల్స్ (2006): 196% నుంచి 203%కు పెంపు

ఫుల్ టైమ్/కంటింజెంట్:148.068 శాతానికి పెంపు

పార్ట్ టైం/ వీఆర్ఏలు: నెలకు రూ.100 చొప్పున పెరుగుదల

(**నోట్:** డీఆర్ నిబంధన పరిధిలోనికి రాని పెన్షనర్లకు ఎలాంటి సవరణ ఉండదని, డీఆర్ సవరించిన పెన్షనర్లకు తదుపరి రూపాయిని కటాఫ్‌గా నిర్ణయిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.)



'హరితహాసం' కార్టూన్ సంకలనాన్ని సీఎం కేసీఆర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ స్ఫూర్తిగా ప్రత్యేకంగా 'హరితహాసం'–ట్రీ టూన్స్ కార్టూన్లను కార్టూనిస్టు మృత్యుంజయ వేశారు.

వర్షాభావం ఎదురైనా.. నీళ్లు ఇద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

సూచించారు. వ్యవసాయాన్ని, రైతులను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమన్నారు. అయితే.. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సాగునీటి విడుదలకు కొన్నిరోజులు విరామం ఇచ్చి, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జూలై తొలి వారం నాటికి వర్షపాతం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, ఇతర అంశాలపై మరోసారి సమీక్షించుకుని, పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సీఎం కేసీఆర్ సోమవారం సచివాలయంలో సమీక్షించారు.

కాళేశ్వరం ద్వారా ఎత్తిపోతలతో..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలను ఆగస్టులోనే సమీక్షించి.. కొరత ఏర్పడిన పక్షంలో శ్రీరాంసాగర్ పునరుజ్జీవన పథకం ద్వారా 30– 35 టీఎంసీల నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోయాలని సమీక్షలో సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ ఏడాది మల్లన్నసాగర్‌లో మరో 10 టీఎంసీలు నింపాలన్నారు. రంగనాయకసాగర్‌లో 3 టీఎంసీల సామర్థ్యానికిగాను 0.69 టీఎంసీలే ఉన్నాయని ఇంజనీర్లు వివరించగా.. మిడ్‌మానేరు నుంచి వెంటనే 2 టీఎంసీలను ఎత్తిపోయాలని, దీంతో రంగనాయకసాగర్ కింద వానాకాలం పంటలకు నీరు అందించడానికి వీలవుతుందని సూచించారు. నిజాంసాగర్‌లో ఉన్న 4.95 టీఎంసీల నీళ్లు ఆగస్టు చివరివరకు 3 తడులకు సరిపోతాయని, తర్వాత మరో 3 తడులకు 5 టీఎంసీలు అవసరమని ఇంజనీర్లు సమీక్షలో వివరించారు. దీనితో ఆగస్టులో కొండపోచమ్మసాగర్ ద్వారా 5 టీఎంసీలను నిజాంసాగర్‌కు తరలించాలని సీఎం సూచించారు.

జలాశయాలన్నీ నింపి పెట్టుకోవాలి

వానాకాలం ముగిసి జలాశయాల్లోకి ఇన్‌ఫ్లో ఆగిపోయాక కూడా.. అక్టోబర్, నవంబర్ నెలల్లో కాళేశ్వరం వద్ద గణనీయంగా గోదావరిలో ప్రవాహాలు ఉంటాయి. రెండో పంట అవసరాలకు ఆ నీటిని ఎత్తిపోసి ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్లలో తగినంత నీటిని నింపి పెట్టుకోవాలని సమీక్షలో నిర్ణయించారు. ఇందుకోసం ఎన్ని పంపులు, ఏ సమయంలో ఆన్ చేయాలనే విషయంపై ఒక ఆపరేషన్ మ్యాన్యువల్ తయారు చేయాలని సీఎం ఆదేశించారు.

వార్ధా ప్రాజెక్టుకు అనుమతులివ్వండి

వార్ధా బ్యారేజీ ప్రాజెక్టు కోసం రూ.4,252.53 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, పరిపాలన అనుమతులు త్వరగా ఇవ్వాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ కోరగా.. దీనికి సంబంధించిన ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సీఎస్ శాంతికుమారి, ఈఎన్సీలు మురళీధర్, ఎన్.వెంకటేశ్వర్లు, శంకర్, సీఈలు హమీద్‌ఖాన్, రమణారెడ్డి, శ్రీనివాస్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు' లిఫ్టింగ్‌కు సిద్ధం చేయండి

తాగునీటి అవసరాల కోసం ఆగస్టు చివరికల్లా పాలమూరు–రంగారెడ్డి నుంచి నార్లాపూర్, ఏదుల, కరివెన, ఉద్దండాపూర్ జలాశయాల్లోకి నీటిని ఎత్తిపోయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. అందుకు అవసరమైన అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లను తొలగించి, సమర్థులైన కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని సూచించారు. ఇక తాగునీటి అవసరాల కోసం మిడ్‌మానేరు నుంచి గౌరవెల్లి జలాశయంలోకి నీటిని ఎత్తిపోయాలని ఆదేశించారు. గౌరవెల్లి ఆయకట్టుకు సాగునీటి సరఫరా కోసం కాల్వల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు.

మళ్లీ వచ్చేది మేమే!



రంగారెడ్డి జిల్లా తుమ్మలూరులో నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు. వారిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

85 శాతం ప్రాజెక్టును పూర్తి చేశాం. నాలుగైదు మాసాల్లో ప్రాజెక్టు పరిధిలోని అన్ని రిజర్వాయర్లను నీటితో నింపుతాం. కాళేశ్వరం జలాలపై ఎలాంటి వివాదాలూ లేవు. కృష్ణా జలాలపై వివాదం కొనసాగుతోంది.

రంగారెడ్డిని సస్యశ్యామలం చేస్తాం..

రంగారెడ్డి జిల్లా దాసర్లపల్లిలో నాకు గతంలో పదిపదిహేను ఎకరాలు ఉండేది. 20 బోర్లు వేయాల్సి వచ్చింది. సన్నగా పోసే బోర్లతో అనేక కష్టాలు పడ్డాం. ఆ బాధ వర్ణనాతీతం. ప్రస్తుతం తెలంగాణలో ఈ బాధలన్నీ తీరిపోయాయి. ఓ చిన్న లిఫ్టును ఏర్పాటు చేసి ఉమ్మడి జిల్లాలోని వికారాబాద్, పరిగి సహా చేవెళ్ల, మహేశ్వరం, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు సాగునీరు అందిస్తాం. కొండపోచమ్మ కింది నుంచి ఘట్‌కేసర్ మీదుగా కాళేశ్వరం నీళ్లను మూసీ దాటించి లోయపల్లి రిజర్వాయర్‌ను నింపడం ద్వారా రంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం.

వారి నోళ్లు మూతపడ్డాయి

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు ముందు చాలా మంది హేళన చేశారు. తెలంగాణ వారికి పంటలు పండించడం రాదన్నారు. కరెంట్ లేక చీకట్లో మగ్గుతామన్నారు. ప్రస్తుతం దేశంలోనే ధాన్యం దిగుబడిలో, తలసరి ఆదాయంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. మొక్కలను నాటి చెట్లను పెంచడంలో ముందుంది. 100 శాతం ఓడీఎఫ్ సాధించడంలోనూ ముందున్నాం. తలసరి విద్యుత్ వినియోగంలోనూ టాప్‌లో నిలిచింది. ఇలా అనేక రంగాల్లో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉంది.

హరితహారం ఫలితాలు కనిపిస్తున్నాయి

నేను హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినప్పుడు కాంగ్రెస్ వాళ్లు హేళన చేశారు. మొక్కలు నాటే కార్యక్రమంపై జోకులు వేసి నవ్వుకున్నారు. కానీ హరితహారం ఫలితాలు ఇప్పుడు కళ్లకు కడుతున్నాయి. రాష్ట్రంలో 22 శాతం ఉన్న పచ్చదనం 30 శాతం దాటింది. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణలో ఇప్పటికే 267 కోట్ల మొక్కలు నాటాం. ఇప్పటికే 170 అర్బన్ ఫారెస్ట్‌లను పూర్తి చేసుకున్నాం. ఇది మనందరి విజయం. హరితహారంలో భాగంగా ఈ ఏడాది పండ్ల మొక్కలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. ఇందుకు రూ.100 కోట్ల బడ్జెట్ పెట్టాల్సిందిగా ముఖ్య కార్యదర్శికి సూచించాం. హరితహారం చట్టం తెచ్చినప్పుడు సర్పంచులు నాపై కోపం తెచ్చుకున్నారు. అయినా కష్టపడి పనిచేశారు. ఫలితంగా మోడువారిన దారులన్నీ నేడు పూల తేరులయ్యాయి. గ్రామాలు పచ్చబడిన కీర్తి సర్పంచులకే దక్కుతుంది.

ఫారెస్ట్ అధికారుల కోసం 20 పోలీస్ స్టేషన్లు

అటవీ రక్షణలో భాగంగా, విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫారెస్ట్ ఆఫీసర్లకు సాయుధ సాయం అందజేయాలని నిర్ణయించాం. అటవీ అధికారుల భద్రత కోసం తెలంగాణవ్యాప్తంగా 20పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అటవీ ఉద్యోగులను, వారి కుటుంబాలను ప్రభుత్వం కడుపులో పెట్టుకుని చూసుకుంటుంది.

4 మున్సిపాలిటీలకు రూ.150 కోట్లు

మంత్రి సబిత విజ్ఞప్తి మేరకు మహేశ్వరంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తాం. జల్‌పల్లి, తుక్కుగూడ, మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపాలిటీలకు రూ.150 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నాం.." అని సీఎం కేసీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.



మొబైల్స్ సహా అన్ని గ్యాడ్జెట్స్‌కు ఒకే చార్జింగ్ కేబుల్ కావాలంటున్న వినియోగదారులు

దీనిపై కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు వెల్లడి

లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వేలో 78 శాతం మంది అభిప్రాయం ఇదే

సింగిల్ చార్జర్‌కే జై

సాక్షి, హైదరాబాద్: నేటి సాంకేతిక ప్రపంచంలో దాదాపు అందరి ఇళ్లలోనూ ఒకటికన్నా ఎక్కువే మొబైల్ ఫోన్లు ఉంటున్నాయి. అలాగే చాలా మంది ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లను ఎక్కువగానే వినియోగిస్తున్నారు. కానీ మొబైల్‌ఫోన్లు, ట్యాబెట్లు ఒక్కోటి ఒక్కో కంపెనీది, ఒక్కో తరహాది కావడంతో వాటికి వాడే చార్జర్లు సైతం అదే సంఖ్యలో ఉంటున్నాయి. దాని బదులు అన్ని రకాల గ్యాడ్జెట్స్ కోసం ఒకే తరహాలో ఉండే చార్జింగ్ కేబుల్స్‌ను తయారు చేస్తే ఈ–వేస్ట్‌ను అరికట్టడంతోపాటు ఇళ్లలోనూ చార్జర్ల సంఖ్యను తగ్గించవచ్చని కేంద్రం భావిస్తోంది. ఇందుకోసం ఒకే తరహా చార్జింగ్ కేబుల్స్ ఉండాలని నిర్ణయించింది. అన్ని మొబైల్ డివైస్‌లు, ట్యాబ్లెట్లకు ఒకే తరహా యూఎస్‌బీ టైప్–సీ చార్జింగ్ పోర్ట్ కేబుల్ ఉండేలా అన్ని తయారీ కంపెనీలు వాటి ఉత్పత్తుల తయారీలో మార్పులు తేవాలని ఇప్పటికే ఆదేశించింది. 2025 మార్చి నాటికి ఈ విధానాన్ని అమల్లోకి తేనున్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. కేంద్రం నిర్ణయాన్ని మొబైల్ వినియోగదారులు స్వాగతిస్తున్నట్లు లోకల్ సర్కిల్స్ సంస్థ సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 78 శాతం మంది ఒకే తరహా చార్జింగ్ కేబుల్‌కే జై కొట్టారు. దేశవ్యాప్తంగా మొత్తం 303 జిల్లాల నుంచి 23 వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు సంస్థ వెల్లడించింది. సర్వేలో వెల్లడైన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి..

మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లకు ఒకే తరహా యూఎస్‌బీ చార్జింగ్ కేబుల్ ఉండాలి:	కేవలం మొబైల్‌ఫోన్లకు ఒకే తరహా యూఎస్‌బీ చార్జింగ్ కేబుల్ ఉండాలి:	ఒకే కంపెనీ మొబైల్‌ఫోన్లు, ట్యాబ్‌లకు ఒకే తరహా చార్జింగ్ కేబుల్ ఉండాలి:
78 శాతం మంది	9 శాతం మంది	4 శాతం మంది

ఇప్పుడున్నట్టుగానే చార్జింగ్ కేబుల్స్ ఉంటేనే మేలు: 6 శాతం మంది | ఏమీ చెప్పలేం: 3 శాతం

మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌ల తయారీ కంపెనీలు వేర్వేరు రకాల చార్జింగ్ కేబుల్స్ ఎందుకు తయారు చేస్తున్నాయి?	వారి ఉత్పత్తుల అమ్మకాలు పెంచుకొనేందుకు: 32 శాతం మంది	సరైన అవగాహన లేకపోవడం: 6 శాతం మంది	ప్రభుత్వం నుంచి ఎలాంటి నిబంధనలు లేకపోవడం: 13 శాతం మంది
	పై అన్ని కారణాలతో: 38 శాతం మంది		
	ఇతర కారణాలు: 4 శాతం మంది		ఏం చెప్పలేం: 7 శాతం మంది

మానవ బ్రహ్మాస్త్రం హరితహారం: కేటీఆర్

అటవీ రంగానికి ఆక్సిజన్ అందించిన ఘనత కేసీఆర్‌దే



సాక్షి, హైదరాబాద్: దశాబ్దాల పాటు ధ్వంసమైన పర్యావరణానికి తెలంగాణ హరితహారం వరంగా మారిందని, 230 కోట్ల మొక్కలు నాటాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం ప్రపంచ చరిత్రలోనే మూడో అతిపెద్ద మానవ ప్రయత్నమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ హరితహారం విజయాన్ని ప్రస్తావిస్తూ సోమవారం ట్వీట్ చేశారు. తెలంగాణ పునర్నిర్మాణమంటే ప్రజల బతుకుచిత్రాన్ని మార్చడమే కాదని, ధ్వంసమైన అడవులను పునరుద్ధరించడం, సకల జీవరాశులను సంరక్షించడమని దేశానికే సీఎం కేసీఆర్ చాటి చెప్పారని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తులను అరికట్టడం, పర్యావరణ సమతుల్యత సాధించడం, ఆపదలో ఉన్న అటవీసంపద కాపాడటం కోసం మానవజాతి చేతిలో ఉన్న ఏకైక బ్రహ్మాస్త్రం హరితహారమని కేటీఆర్ అభివర్ణించారు. నిరాదరణకు గురైన అటవీరంగానికి ఆక్సిజన్ అందించి తిరిగి ప్రాణం పోయడం ద్వారా 'జంగిల్ బచావో.. జంగిల్ బడావో'నినాదాన్ని కేసీఆర్ నిజం చేశారని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను తలదన్నేలా 'గ్రీన్ వాల్ ఆఫ్ తెలంగాణ'నిర్మాణంలో తెలంగాణ ప్రజలు భాగస్వాములయ్యారని కేటీఆర్ వెల్లడించారు.

ఆకుపచ్చని తెలంగాణ కేసీఆర్ ఘనత

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



అసెంబ్లీ ప్రాంగణంలో మొక్క నాటుతున్న గుత్తా, బండా ప్రకాశ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను ఆకుపచ్చని రాష్ట్రంగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకే దక్కుతుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అసెంబ్లీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పచ్చదనం పెంచడానికి సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా రిపోర్ట్ ప్రకారం 2015 నుండి 21 మధ్య రాష్ట్రంలో ఫారెస్ట్ కవర్ 6.85 శాతం పెరిగిందని, హైదరాబాద్ గ్లోబల్ సిటీగానే కాదు.. గ్రీన్ సిటీగానూ మారిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 14,864 నర్సరీలు, 19,472 పల్లె ప్రకృతి వనాలు, 2,011 బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. అడవులు వేగంగా అంతరిస్తున్న సమయంలో పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపట్టిన ప్రయత్నాలు ఫలితాన్నిస్తున్నాయని మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎం.ఎస్.ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

వలస నేతల 'ఉక్కపోత'

▶ మొదటి పేజీ తరువాయి


ప్రజల్లోకి వెళతామని, కేసీఆర్‌పై పోరాడే పార్టీలోనే మనం ఉండాలని హుజూరాబాద్, మునుగోడు నియోజకవర్గాల కేడర్ అంటున్నట్లు సమాచారం. కార్యకర్తలు, ముఖ్య అనుచరుల నుండి పెరుగుతోన్న ఒత్తిడి నేపథ్యంలో ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు గత కొన్ని రోజులుగా దాదాపు ప్రతిరోజూ భేటీ అవుతున్నారు. తాము కేసీఆర్, ఆయన కుటుంబ పాలనకు వ్యతిరేకంగానే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి ఎన్నికల యుద్ధంలో పాల్గొన్నామని, ప్రస్తుత కీలక దశలో బీఆర్ఎస్ విషయంలో బీజేపీ రాజకీయ వైఖరిని మార్చుకునే పరిస్థితి ఉంటే.. తాము మెజారిటీ కార్యకర్తలు, నాయకుల అభీష్టం మేరకు పోరాట పంథాను రూపొందిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడి బీఆర్ఎస్‌కు పరోక్ష మద్దతు ఇచ్చే బీజేపీలో కొనసాగే పరిస్థితి ఉండదంటూ కార్యకర్తలకు భరోసా ఇవ్వాలని వారు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

అంతా ఉమ్మడి వేదికపైకి..: ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలపై కింది స్థాయి నుంచి ఒత్తిడి వస్తోన్న నేపథ్యంలో త్వరలో రాజగోపాల్ ఆధ్వర్యంలో ఓ కీలక సమావేశం నిర్వహించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తమ అనుచరులతో పాటు సబ్బండ వర్గాలు, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, యువజన ప్రతినిధులతో ఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆ సమావేశంలో వచ్చే ప్రతిపాదన దిశగా తమ రాజకీయ కార్యాచరణను ప్రకటించనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. తెలంగాణ రాష్ట్ర అవిర్భావానికి ముందు ఇక్కడి ప్రజలు ఏం కోరుకున్నారు?, తెలంగాణ వచ్చిన తర్వాత ఏం జరిగింది?, ఇందులో బీఆర్ఎస్ నేతల అవినీతి, బంధుప్రీతి ఎలా రాజ్యం చేసింది? తదితర అంశాలపై చర్చించి, అందులో వచ్చే ఏకాభిప్రాయం ద్వారా తమ రాజకీయ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఈ దిశగానే గడిచిన వారం రోజులుగా రాజగోపాల్‌రెడ్డి పలువురు కీలక నాయకులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈటలను కలసిన యూపీ డిప్యూటీ సీఎం బ్రిజేశ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి బ్రిజేశ్ పాఠక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శామీర్‌పేటలోని నివాసంలో ఈటలను ఆయన కలుసుకున్నారు. తిరుపతి పర్యటనకు వెళ్తూ హైదరాబాద్‌లో ఈటలతో బ్రిజేశ్ పాఠక్ మర్యాదపూర్వక భేటీ జరిగినట్టు పార్టీవర్గాల సమాచారం. ఈ భేటీలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ తుల ఉమ కూడా పాల్గొన్నారు.


JEE (ADVANCED) 2023
మళ్లీ మెరిసిన ఆకాషియన్లు
Aakash + BYJU'S
AIR 27 Aditya Neeraje 2 Year Classroom
AIR 28 Aakash Gupta 1 Year Classroom
AIR 29 Tanishq Mandhane 4 Year Classroom
AIR 31 Kamyak Channa 4 Year Classroom
AIR 36 Dhruv Sanjay Jain 4 Year Classroom
AIR 42 Shivanshu Kumar 4 Year Classroom
2340# Aakashians Qualified in JEE (ADV.) 2023
(2160 Classroom + 180 Distance & Digital)
#Still Counting
8 in Top 50 AIR (All India Rank)
20 in Top 200 AIR (All India Rank)
43 in Top 500 AIR (All India Rank)
84 in Top 1000 AIR (All India Rank)
Including Students from Classroom, Digital &DLP Courses across all Categories
మా క్లాస్ రూమ్ ప్రోగ్రామ్ నుండి అత్యుత్తమ టాపర్లు
AIR 99 Md Sahil Akhtar
AIR 103 Nihal Alkeshbhai P
AIR 114 Anoop Singh
AIR 172 Amritanshu Singh
AIR 182 Nikhilesh Joshi
AIR 184 Adit Jindal
AIR 186 Shiv Narang
AIR 197 Satwik Raj W
AIR 222 Siddharth Miglani
AIR 242 Mozeel Vanwani
AIR 261 Vaibhav Raj
AIR 281 Raktim Kundu
AIR 289 Jigyasa Chouhan
AIR 295 Sarthak Thakare
AIR 306 Vignesh N
AIR 323 Parth Baranwal
AIR 326 Aliv Sahoo
AIR 328 Utkarsh Gupta
AIR 363 Alladi Lohith K
AIR 371 Kundan Maiti
AIR 386 Dhruva J Herrick
AIR 439 Pratyush Kumar S
AIR 489 Aakarsh D Reja
AIR 499 Hardik Goyal
and many more...
Scan the code to check all the ranks & watch what the toppers have to say
Aakash BYJU'S LIVE
ONLINE CLASSROOM PROGRAM
AIR 26 Mayank Soni
AIR 458 Arijit Paul
and many more...
Though every care has been taken to publish the result, yet Aakash Educational Services Ltd. shall not be responsible for inadvertent error, if any.
క్లాస్‌రూమ్ ప్రోగ్రాములలో మన ఆల్ ఇండియా మరియు సౌత్ ఇండియా టాపర్
AIR 27 Aditya Neeraje 2 Year Classroom
తెలంగాణ శాఖల నుండి ఇతర అత్యుత్తమ టాపర్లు
AIR 363 Alladi Lohith Kumar 2 Year Classroom
AIR 524 Poorvie Sadagopan 2 Year Classroom
AIR 561 B Siddaarth 4 Year Classroom
దక్షిణ భారతదేశంలోని శాఖల నుండి ఇతర అత్యుత్తమ టాపర్లు
AIR 182 Nikhilesh Joshi 4 Year Classroom
AIR 261 Vaibhav Raj 4 Year Classroom
and many more...
Though every care has been taken to publish the result, yet Aakash Educational Services Ltd. shall not be responsible for inadvertent error, if any.
అడ్మిషన్లు జరుగుతున్నాయి - 90 శాతం వరకు స్కాలర్‌షిప్‌లు పొందవచ్చు
Come Back Stronger JEE / NEET 2024
Hurry! Batches filling fast.
Long Term Courses (For12th pass students)
Hostel Facility Available*
Special Focus on Physics & Chemistry
Exclusive Doubt Sessions
Comprehensive Study Material & All India Tests
Student Centric Approach
Appear for instant Admission & Scholarship Test. Register for FREE
visit: iacst.aakash.ac.in or scan the QR code
*Terms & Conditions apply.
CLASS 12th Studying Students
1 Year Integrated courses for JEE / EAMCET / NEET
CLASS 11th Studying Students
2 Year Integrated courses for JEE / EAMCET / NEET
CLASS 8th-10th Studying Students
Integrated courses for NTSE / Olympiads / School Boards
12 Branches in Telangana
HYDERABAD
(Himayat Nagar): 8800013001
(Kondapur): 8800897955
(Kothapet): 8800013004
(Kukatpally): 8800013003
(Shaikpet): 8800013006
(S R Nagar): 8800013002
(Trimulgherry): 8800013009
KARIMNAGAR: 8800013007
WARANGAL: 8800013016
NIZAMABAD: 8800857521
Scan code to locate the nearest centre
Aakash BYJU'S Information Centre: Mancherial: 9100078157
Two more Aakash BYJU'S Branches in Hyderabad now Suchitra: 8800948902 & Habsiguda: 8800950201
Andhra Pradesh Branches: Kadapa: 8800898028, Kakinada: 8800789546, Kurnool: 8800013008, Nellore: 8800012982, Rajahmundry: 8800012983, Tirupati: 8800013010, Vijayawada: 8800013015, VISAKHAPATNAM: Dwarka Nagar: 8800013011, Gajuwaka: 8800013012, Madhurawada: 8800548130. Aakash BYJU'S Branch now in Guntur: 8800971868. Aakash BYJU'S Information Centre: Ongole: 9311324089 | Vizianagaram: 8448799006
Download Aakash App
GET IT ON Google Play
Download on the App Store
CALL (TOLL-FREE) 1800-102-2727
VISIT aakash.ac.in
Aakash BYJU'S

> అన్ని ఆచరణల కంటే మించి చేయాల్సినది హృదయాన్ని కాపాడుకోవడం. ఎందుకంటే అదే జీవితానికి ఆధారం కాబట్టి.
>
> – జుడాయిజం

సాక్షి

మంగళవారం, 20 జూన్ 2023

ఈ మంటలు ఆర్పండి!

నెలన్నర దాటిపోయింది. ఇప్పటికి 120 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 50 వేల మంది నిరాశ్రయులయ్యారు. రాష్ట్ర బలగాలకు తోడు కేంద్ర బలగాలు రంగంలోకి దిగి చాలాకాలమైంది. సాక్షాత్తూ కేంద్ర హోమ్ మంత్రి వచ్చి పర్యటించారు. అయినా పరిస్థితి మారలేదు. ఈశాన్య రాష్ట్రం మణిపూర్ ఇవాళ్టికీ అగ్నిగుండమై మండుతోంది. శాంతిభద్రతలు క్షీణించి, మూకస్వామ్యం రాజ్యమేలుతోంది. షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) హోదా ఇవ్వాలంటూ మైతై తెగ ప్రజలు చేస్తున్న డిమాండ్‌కు వ్యతిరేకంగా మే మొదటివారంలో జరిగిన గిరిజనుల ప్రదర్శన హింసాత్మకంగా మారినప్పుడు మొదలైన ఈ జ్వాల మణిపూర్‌లోని తెగల మధ్య చీలికలను ఎత్తిచూపింది. మరి, ఈ మంటల్ని చల్లార్చి, శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత తల మీద ఉన్న సర్కారు ఇప్పటి దాకా ఏం చేసినట్టు? సమస్యను చక్కదిద్దాల్సిన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఒక వర్గం వైపు నిలబడి, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. దీంతో పరిస్థితి అంతకంతకూ దిగజారుతోంది.

కుకీలు ఎక్కువుండే కొండ ప్రాంత జిల్లాల నుంచి మైతైలు వలసపోతుంటే, మరోపక్క మైతైలు అధికంగా ఉండే ఇంఫాల్ లోయ నుంచి కుకీలు తరలిపోతున్నారు. కేంద్ర మంత్రి నివాసం సహా రెండు వర్గాలకు చెందిన 4 వేల గృహాలు ఇప్పటికే అల్లర్లలో అగ్నికి ఆహుతి అయ్యాయి. శరణార్థి శిబిరాలు కిక్కిరిశాయి. అమాత్యుడి ప్రైవేట్ నివాసంపై దాడి గత మూడు వారాల్లో ఇది రెండోసారి. జాతుల మధ్య విద్వేషం ఇంతగా పెచ్చరిల్లుతుంటే, కేంద్రంలో, రాష్ట్రంలో రెండుచోట్లా అధికారంలో ఉన్న పాలకపక్షం ఏం చేస్తోందన్నది ప్రశ్న. నిజానికి, కేంద్ర హోమ్ మంత్రి ఇటీవలే సంక్షుభిత మణిపూర్‌ను సందర్శించినప్పుడు, సమస్యకు పరిష్కారం లభిస్తుందనుకున్నా ఆ ఆశ నెరవేరలేదు.


భౌగోళికంగా బంగ్లాదేశ్, చైనా, మయన్మార్‌ల మధ్య చిక్కిన ఈశాన్య రాష్ట్రాల్లో తెగల మధ్య తరచూ ఘర్షణలు కొత్త కావు. 1949లో భారత యూనియన్‌లో చేరినప్పటి నుంచి మణిపూర్‌లోనూ అవి ఉన్నవే. కానీ, మధ్యవర్తులుగా ఉండాల్సినవారే తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న అనుమానంతో ఇరువర్గాల మధ్య విశ్వాసం సన్నగిల్లడం విషాదం. అపనమ్మకం నిండినచోట భద్రతా దళాలైనా తగిన చర్యలు చేపట్టడం కష్టం. మణిపూర్ రైఫిల్స్ సహా రాష్ట్ర పోలీసు బలగాలు మైతైలకే మద్దతుగా నిలుస్తున్నాయని కుకీల భావన. మైతైలేమో కుకీ ప్రాబల్య పర్వత ప్రాంతాల్లో చట్ట విరుద్ధంగా గంజాయి సాగు చేస్తున్నా అస్సామ్ రైఫిల్స్ చూసీ చూడనట్టున్నాయని ఆరోపిస్తున్నారు. ఇది చాలదన్నట్టు భద్రతాదళాల మధ్యా ఘర్షణ వాతావరణం నెలకొంది. పారా మిలటరీ దళాలు తమ పనిలో జోక్యం చేసుకుంటున్నాయని పోలీసుల ఆరోపణ. వెరసి, పాలన మృగ్యమైన మణిపూర్‌లో నేటికీ రహదారులు సాయుధ మూకల నియంత్రణలోనే ఉన్నాయి.

రాష్ట్రంలో ఉద్రిక్తతల్ని చల్లబరచడానికి పాలకుల వైపు నుంచి ఏ మాత్రం ప్రయత్నాలు జరుగుతున్నాయంటే అనుమానమే. ఎంతసేపటికీ దీన్ని శాంతి భద్రతల సమస్యగానే వారు చూస్తున్నారు. అది పెద్ద చిక్కు. పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతలో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పదే పదే విఫలమైనా, కేంద్రం ఉపేక్షించింది. విద్వేషాగ్నిలో ఈశాన్యం కాలిపోతున్నా, మూడు వారాల పైచిలుకు తర్వాత కానీ హోమ్ మంత్రి అక్కడకు రాకపోవడం ఏ రకంగా సమర్థనీయం? కొన్ని వారాలుగా ఇలా ఉన్నా ప్రధాని తన రాజకీయ సభల్లో కానీ, ఇతరత్రా కానీ ఎక్కడా మణిపూర్ ఊసే ఎత్తలేదు. మాటల ద్వారా మనుషుల మధ్య మత్సరం తగ్గించాల్సిన వేళ పాలకులు మౌనముద్ర దాల్చడం విడ్డూరమే!

గౌహతి హైకోర్ట్ రిటైర్డ్ ఛీఫ్ జస్టిస్ సారథ్యంలో ముగ్గురు సభ్యుల విచారణ సంఘం వేయడం బాగానే ఉంది. కానీ, రాష్ట్ర గవర్నర్ నేతృత్వంలో శాంతి సంఘం ఏర్పాటుకు మాత్రం ఆదిలోనే హంసపాదు పడింది. పక్షపాత సీఎం సభ్యుడిగా ఉన్న కమిటీలో తాము ఉండబోమనేది కుకీ ప్రతినిధులు తేల్చేశారు. ఈ పరిస్థితి ఎందుకొచ్చిందో బీరేన్ ఆలోచించుకోవాలి. 2017లో తొలి విడత సీఎంగా ఎన్నికైనప్పుడు గిరిజనవాసులతో సన్నిహితంగా మెలిగిన ఆయన 2022లో రెండో విడత అధికారం చేపట్టాక వైఖరి మార్చారు. ప్రభుత్వస్థలంలో ఆక్రమణల పేరిట ఇంఫాల్‌లో చర్చిలతో సహా అనేకం కూల్చివేతకు ఆదేశించి, కుకీలకు కోపకారణమయ్యారు. సంఖ్యాపరంగా మైతైలున్నందున మెజారిటీ వాదాన్ని స్థానిక గిరిజన తెగలపై రుద్దుతున్నారనే భావన కలగడమూ సమస్యకు కారణమైంది.

మైతైలకు ఎస్టీ హోదానిచ్చే అంశం పరిగణనలోకి తీసుకోవచ్చని కోర్ట్ చెప్పింది సరే, ఆ వివాదాస్పద నిర్ణయంతో తెగల మధ్య అశాంతి నెలకొంటుందని ఊహించకపోవడం ప్రభుత్వ తప్పిదమే. ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం, పర్యవసానాలు ఊహించి సంబంధిత వర్గాల మధ్య అపోహల్ని ముందే తొలగించడం కీలకం. పాలకులు అక్కడే విఫలమయ్యారు. అనుమానాలు పెను భూతాలై, పరిస్థితిని ఇంతదాకా తెచ్చారు. ఇంటర్నెట్‌పై నిర్బంధాల నేపథ్యంలో క్షేత్రస్థాయి వార్తలు సరిగ్గా తెలియకపోగా, అసలు కథ వదిలేసి దీన్ని రెండు మతాల మధ్య ఘర్షణగా చిత్రించే ఘోర తప్పిదాలూ సాగుతున్నాయి. ఇప్పటికైనా కేంద్రం కలగజేసుకోవాలి. అన్ని తెగలకూ రాజ్యాంగ రక్షణ ఉందన్న భరోసా కల్పించాలి. మూలన విసిరేసినట్టుగా ఉన్న ఆ ప్రాంతాలనూ, ప్రజలనూ పరాయివారుగా చూసే ధోరణి మారాలి. అక్కడి విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలను గౌరవిస్తూ, దేశంలో తామూ భాగమనే అభిప్రాయం ఆ ప్రజల్లో కల్పించాలి. మరి, ఆ దిశగా శాంతి స్థాపనకు ఇకనైనా పాలకులు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అన్నది మాటలకే పరిమితం కాదన్న నమ్మకం వివిధ తెగల మధ్య కల్పిస్తారా?

ప్రశ్నించే గొంతులకు సంకెళ్లా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

'దేశద్రోహ' నేరారోపణ అన్నది వలస పాలకుల దౌర్జన్య పాలనావసరాల కోసం ఏర్పరచుకున్న ప్రత్యేక నిబంధన. వలస పాలనానంతరం ఏర్పడిన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఈ నిబంధన చేటు కలిగిస్తోంది. 2010 నుంచీ ఇప్పటివరకూ 800కు పైగా దేశద్రోహ కేసులు నమోదయ్యాయని 'ఎ డికేడ్ ఆఫ్ డార్క్‌నెస్' డేటాబేస్ చెబుతోంది. ఈ ప్రజా వ్యతిరేక చట్టాల కొనసాగింపు కేంద్రం వరకే పరిమితం కాలేదు. కొన్ని రాష్ట్రాల పాలకులు కూడా అదే 'అలవాటు'లో ఉన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ప్రభుత్వం 150 మందికిపైగా పౌర హక్కుల ఉద్యమ నాయక, కార్యకర్తలపైన సాధికారత లేని 'ఉపా' కేసుల్ని మోపింది. భూస్వామ్య, ధనికవర్గ ప్రయోజనాల రక్షణే పాలకుల ప్రాధాన్యమా?

''దేశంలో వలస పాలన అంతరించిన తరువాత కూడా, వలస పాలకులు స్వార్థ ప్రయోజనాల కోసం భారతదేశంలో పౌరులపైన, పౌర హక్కులపైన విధించిన 'దేశద్రోహ' చట్టంలోని '124–ఎ' నిబంధన అమలు జరుగుతూండటం దారుణం. వలస పాలనానంతరం ఏర్పడిన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఈ నిబంధన చేటు కలిగిస్తోంది. ఈ తప్పుడు నిబంధన సృష్టించిన సమస్యను ఏ భాషా మార్పు వల్లా, నిబంధనల సరళింపు వల్లా పరిష్కరించలేము. ఎందుకంటే 'దేశద్రోహ' నేరారోపణ అన్నది వలస పాలకుల దౌర్జన్య పాలనావసరాల కోసం ఏర్పరచుకున్న ప్రత్యేక నిబంధన. కనుకనే స్వతంత్ర భారత సుప్రీంకోర్టు '124–ఎ' దేశద్రోహ నేరారోపణ నిబంధన స్వతంత్ర భారతంలో చెల్లదని కేదార్‌నాథ్ వర్సెస్ బిహార్ (1962) కేసు విచారణ సందర్భంగా కొట్టివేసింది. ఈ అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని పాలకులు అమలు జరిపి ఉంటే – ప్రభుత్వాన్ని విమర్శించిన నేరానికి లేదా అలాంటి విమర్శను ప్రసారం చేసే వీడియోలు విన్న నేరానికి లేదా అలాంటి పాటలు విన్న నేరానికి దేశ పౌరులపైన దేశద్రోహ కేసులను పాలకులు మోపి ఉండేవారు కాదు. ఇప్పటిదాకా రాజ్యాంగంలోని 14వ అధికరణ కింద 2010 నుంచీ ఇప్పటి వరకూ 800కు పైగా దేశద్రోహ కేసులు నమోదయ్యాయి.''

– లభ్యతి రంగరాజన్

(ఇప్పటివరకూ దేశంలో నమోదైన 'దేశద్రోహ' కేసులను పరిశీలించి, వాటిని 'ఓ దశాబ్దపు చిమ్మ చీకటి' (ఎ డికేడ్ ఆఫ్ డార్క్‌నెస్) పేరిట ఏర్పాటుచేసిన డేటాబేస్ సాధికారికంగా నమోదు చేసింది. దీనికి లభ్యతి రంగరాజన్ ఎడిటర్‌గా ఉన్నారు.)

దేశ పాలకులూ, వారి ఇష్టానుసారం మెలగుతున్న పాలనా యంత్రాంగమూ పుర్రెకు పుట్టిన బుద్ధి ప్రకారం పౌర సమాజాన్ని ఇబ్బంది పెట్టవచ్చా? అనుకూలమైన వలస చట్టాల చాటున అనేక రకాల నిర్బంధాలకు గురి చేయవచ్చునని 'పెగసస్' విదేశీ స్పైవేర్ కొనుగోలు చేసినప్పుడే ఇది నిరూపితమైంది. ఈ ప్రజా వ్యతిరేక చట్టాల కొనసాగింపు కేంద్రం వరకే పరిమితం కాలేదు. అలాంటి చట్టాలపై ఆధారపడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు, పాలకులు కూడా అదే 'అలవాటు'లో ఉన్నారు. ఉండబట్టే తాజా పరిణామాలలో భాగంగా

రెండో మాట



దేశవ్యాప్తంగానూ, విదేశాల్లోనూ ఖ్యాతి పొందిన సుప్రసిద్ధ విద్యావేత్త, సంస్కర్త, పౌరహక్కుల ఉద్యమ నాయకులలో ఒకరు అయిన ప్రొఫెసర్ హరగోపాల్ సహా దాదాపు 150 మందికిపైగా పౌర హక్కుల ఉద్యమ నాయక, కార్యకర్తలపైన సాధికారత లేని 'ఉపా' కేసుల్ని మోపి పాలకులు తమ 'చెవి దురద' తీర్చుకున్నారు. ఆ 'దురద'ను అంత త్వరగానూ తొలగ గొట్టుకోవడానికి తంటాలు పడ్డారు. ఏ 'నేరం'పైన ఈ కుట్ర కేసు బనాయించవలసి వచ్చిందో స్పష్టత లేదు.

కాగా, పక్కా తెలంగాణ వాసి, భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చినా ఆ వాసనకు దూరంగా ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి, తాను పుట్టి పెరిగిన ఫ్యూడల్ సంప్రదాయాల్ని కాలదన్నిన వారు బి.నరసింగరావు. తెలంగాణలో తన ప్రజలు అనుభవించిన భూస్వామ్య దాష్టీకాలను కళ్లారా చూసి మనసు చెలించి, 'దాసి' చలన చిత్రం ద్వారా ధనిక వర్గ దుర్మార్గాన్ని ఎండగట్టి దేశంలోనే గాక అంతర్జాతీయంగానూ ఆయన ఖ్యాతి గడించారు. అలాంటి నేలతల్లి బిడ్డకు కూడా పాలకులు 'ఇంటర్వ్యూ' ఇవ్వడానికే జంకారు, కాదు భయపడ్డారు, లేదా బిడియపడ్డారు! ఎందుకు? నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లోనే తెలంగాణకు నిజమైన రక్షణ ఉందని ఆయన ప్రకటించినందుకు! పేరుకు తగ్గట్టే ఆయనది తెలంగాణలోని 'ప్రజ్ఞాపురం'. వాస్తవం ప్రకటించినందుకు తనకు ఇంటర్వ్యూను నిరాకరించిన నేటి తెలంగాణ పాలకులను ప్రశ్నిస్తూ నరసింగరావు ఎక్కడ పుట్టిన 'కమలం' ఇది అని ప్రశ్నించడం కొంత బాధాకరమైనదైనా అది తనకు జరిగిన అవమానాన్ని వ్యక్తం చేయడానికి ఉద్దేశించింది మాత్రమేనని భావించాలి.

భారత లౌకిక రాజ్యాంగం నిర్దేశించి నెలకొల్పిన సుసంప్రదాయాలు ఎన్నో ఉన్నా వాటిని తృణీకరించి ప్రజా వ్యతిరేక పాలనను దొల్లించుకుపోతున్న పాలకులకు 'ముగుదాడు' వేయగల ప్రజాస్వామిక న్యాయ వ్యవస్థ ఇప్పుడు ఉన్నందున, పాలకులు, పాలనా వ్యవస్థ కొంతమేర అదుపులో ఉన్నట్టు కన్పిస్తోంది. కానీ లోపాయికారీ పద్ధతుల్లో దేశంలోని ఫెడరల్ వ్యవస్థ ప్రయోజనాల్ని దెబ్బతీయడానికి మరోవైపు నుంచి మతవాద, మితవాద శక్తులు చీలుబాటలవైపే ప్రయాణిస్తూ వ్యవస్థను అస్థిరం చేస్తున్నాయని మరచిపోరాదు. అంత కన్నా ఎన్నటికీ మరవరాని అంశం – రాజ్యాంగంలో పొందుపరచుకున్న ప్రజాహిత సూత్రాలను అమలు చేయించుకోగల హక్కును దేశ పౌరులకు లేకుండా చేశారు. కారణం స్పష్టమే. భూస్వామ్య, ధనికవర్గ ప్రయోజనాల రక్షణకే పాలకుల ప్రాధాన్యం. నేడు రాజ్యాంగమూ, దాని ప్రయోజనాలనూ కేవలం కొద్దిమంది కార్పొరేట్ అధిపతులు, వారికి కొమ్ముకాస్తున్న పాలక వర్గమే అనుభవిస్తోందని ప్రజలు భావిస్తున్నారు. తొల్లింటి అరకొర ప్రజానుకూల ప్రణాళికా వ్యవస్థ కూడా ఈ రోజున కూలిపోయింది. అందుకే కూలిపోయే వ్యవస్థను కాపాడ్డానికే దాని రక్షకులైన పాలక వర్గాలు 'కంకణం' కట్టుకుంటారు. మహాకవి శ్రీశ్రీ దశాబ్దాల క్రితమే రానున్న పరిణామాల్ని గురించి ముందస్తు హెచ్చరిక చేశారు:

''విభజన రేఖను రక్షించడానికే
న్యాయస్థానాలు, రక్షక భట వర్గాలు
చెరసాలలు, ఉరి కొయ్యలు'' అని చెబుతూనే –
''అభిప్రాయాల కోసం
బాధలు లక్ష్యపెట్టనివాళ్లు
మాలోకి వస్తారు
అభిప్రాయాలు మార్చుకొని
సుఖాలు కామించేవాళ్లు
మీలోకి పోతారు'' అనీ ప్రకటించారు!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎవరున్నారు?



దాదాపు నెల రోజుల్లో ముగ్గురు ముఖ్య ఖలిస్తాన్ అనుకూల నాయకులు వేర్వేరుగా చనిపోవడం కాకతాళీయ సంఘటనలు కావు.

– హర్జోప్ సింగ్ బాల్, సంపాదకుడు

మారిన పరిస్థితి



పదిహేనేళ్ల క్రితం, వాస్తవ ప్రపంచం నుంచి తప్పించుకోవడానికి ఇంటర్నెట్ ఒక సాధనం. ఇప్పుడు దీన్నుంచి తప్పించుకోవడానికి వాస్తవ ప్రపంచమే మార్గం.

– నోవా స్మిత్, ఆర్థికవేత్త

ఇదా ప్రజాస్వామ్యం?



'ప్రజాస్వామ్యం మన నరాల్లో ఉంది, అది మన సంస్కృతి'; 'భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిది'; 'భారత్ ప్రజాస్వామ్య దేవాలయం'... ఇలాంటి గొప్పగా ధ్వనించే మాటలకు అంతర్జాతీయ సమాజం హర్షిస్తుంది; వీటినే పునరావృతం చేసుకుని విసుగు చెందుతుంది. అన్నట్టు కేంద్ర పాలనలో జమ్ము కశ్మీర్ ఐదేళ్లు పూర్తిచేసుకుంది. జమ్ము కశ్మీర్ ఎక్కడ ప్రారంభం అవుతుందో అక్కడ ప్రజాస్వామ్యం అంతం అవుతుంది.

– ఒమర్ అబ్దుల్లా, జమ్ము–కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి

కృతఘ్నత



గత డెబ్బై ఐదేళ్లుగా పాశ్చాత్య దేశాల ఉదారత మీద పాలస్తీనా బతుకుతోంది. అయినా పెట్టుబడిదారీ విధానాన్నీ, అమెరికానూ, పాశ్చాత్య దేశాలనూ తీవ్రంగా విమర్శిస్తుంది; ఇరాన్, చైనా, రష్యాలను ప్రశంసిస్తుంది. దీనికి భిన్నంగా మేము ఇజ్రాయిల్‌కు ఇచ్చే సొమ్ముకు ప్రతిఫలంగా కనీసం కృతజ్ఞత, విశ్వాసం గల స్నేహాలను పొందుతున్నాం.

– హుస్సేన్ అబ్దుల్ హుస్సేన్, యూఎస్ రీసెర్చ్ ఫెలో

వరుస మరణాలు



ముగ్గురు ముఖ్య ఖలిస్తాన్ అనుకూల నాయకులు నెల రోజుల్లో చనిపోవడం గమనార్హం. కేసీఎఫ్ చీఫ్ పరంజీత్ సింగ్ పంజ్‌వార్‌ను పాకిస్తాన్‌లో కాల్చేశారు. కేఎల్ఎఫ్ చీఫ్ అవతార్ సింగ్ ఖాండా హాస్పిటల్లో చనిపోయారు.ఇప్పుడు కేటీఎఫ్ చీఫ్ హర్‌దీప్ నజ్జర్‌ను కెనడాలో కాల్చేశారు.

– పర్తీక్ సింగ్ మహల్, పాత్రికేయుడు

గొప్ప సేవ



తక్కువ ధరకు దాదాపు 42 కోట్ల కాపీల ధార్మిక పుస్తకాలను ప్రచురించి 'గీతా ప్రెస్' హిందూ ధర్మానికి ఎవరూ చేయనంత సేవ చేసింది. దానికి గాంధీ శాంతి బహుమతిని ఇవ్వడాన్ని విమర్శిస్తున్న రాజకీయ పార్టీలు హిందూ ద్రోహులు.

– ఎన్.సి.అస్థానా, మాజీ ఐపీఎస్ అధికారి

గొంతెత్తుదాం!



లైంగిక హింసను ఒక యుద్ధ ఆయుధంగా వాడటం అనేది దురదృష్టవశాత్తూ విస్తృతంగా వ్యాప్తిలో ఉన్న వాస్తవం. ఈ సిగ్గుచేటు నేరాన్ని తప్పనిసరిగా నిరసించాలి. యుద్ధం వద్దు, హింస వద్దు అని చెప్పే విషయంలో మనం ఎప్పటికీ అలసి పోకూడదు.

– పోప్ ఫ్రాన్సిస్, మత గురువు

ఇన్‌బాక్స్

వర్షమా వచ్చిపో...

ఆకాశం తెల్లమొఖమేసింది
భూమి దాహంతో బీటలు వారింది
లోకం జిక్కుజిక్కుమంటోంది
ఏడబోయినవే మబ్బు తల్లీ

ఏడ దాక్కున్నావ్ ఏడు లోకాల వెనకాల్నా
చిన్న సందులోంచి తొంగయినా చూస్తలేవు
అలిగినవా అలిసినవా
కోపమొచ్చిందా, దయతప్పిందా?

రోళ్లు పగుల్తున్నై రోకళ్లు ఇరుగుతున్నై
కప్పలు కాటగల్సిపోతున్నై
కన్నీళ్లు కారీ కారీ గుండెలు ఎడారులవుతున్నై
నీకోసం ఎదురు చూసీ చూసీ చుక్కలు కనిపిస్తున్నై

అవును మరి నిన్ను అనేదేముంది
నువ్వు ప్రేమించే పచ్చదనానికి పాడె కట్టాం
నువ్వు ఇష్టపడే అడవులకు చితి పెట్టాం
నువ్వు అభిమానించే గుట్టల్ని మందుపాతరలు పెట్టి
నేలమట్టం చేశాం
నేలనీ నింగినీ వదల్లేదు ఏం మిగిల్చామని

ఊరనకా వాడనకా పల్లెనకా పట్నమనకా
అభివృద్ధి బహానాలో అంతా ఇనుము సిమెంటు కంకర
కన్ను తెరిచినా కాలు కదిపినా అంతా బొడి బొడి
తడిలేని మనసంతా ఎడారి ఎడారి
అయినా మబ్బు తల్లీ
దయతోనో కరుణతోనో ఒకసారి వచ్చిపోరాదే
నాలుగు చినుకుల్ని రాల్చి
మాలో ఊపిర్లు నింపి పోదువుగానీ

– వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కార గ్రహీత । 94405 01281

పట్టణీకరణలో ఒక మెట్టు పైనే!

అభిప్రాయం



అరవింద్ కుమార్

సహజ వనరులపై ఆధారపడిన ప్రాథమిక రంగం వాటా తగ్గి... ఉత్పత్తి, సేవల రంగం వాటా పెరిగిన ఆర్థిక వ్యవస్థలో పట్టణీకరణ అనివార్యం అవుతుంది. పట్టణాలు ఆర్థికవృద్ధికి ఇంజిన్‌లు అవుతాయి. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడి, ఆదాయ స్థాయులు అనేక రెట్లు అధికం అవుతాయి.

దక్షిణాది రాష్ట్రాల్లో పట్టణ ప్రాంతాలు ఎక్కువ. 'తెలంగాణ సోషియో, ఎకనమిక్ అవుట్‌లుక్ 2022' నివేదిక ప్రకారం తెలంగాణలో పట్టణ జనాభా వాటా జాతీయ సగటు అయిన 31.16 కన్నా ఎక్కువగా 48.6 శాతంగా ఉంది. ఇది దేశంలోని మొదటి మూడు పట్టణీకరణ రాష్ట్రాలలో తెలంగాణను మొదటి స్థానంలో నిలిపింది. తమిళనాడు 48.45 శాతం, కేరళ 47.23 శాతం, మహారాష్ట్ర 45.23 శాతం పట్టణ జనాభాను కలిగి ఉన్నాయి.

సంతోషకరమైన విషయం ఏమిటంటే, తెలంగాణలో పట్టణీకరణ వేగం కూడా దేశంలోని ఇతర ప్రాంతాలకంటే ఎక్కువగా ఉంది. ఇది తెలంగాణ జి.ఎస్.డి.పి. (స్థూల రాష్ట్ర జాతీయోత్పత్తి) శీఘ్ర శిఖర గమనానికీ, తెలంగాణలో ఉద్యోగావకాశాల పెరుగుదలకూ సూచిక. 2028 నాటికి తెలంగాణ 50 శాతం కంటే ఎక్కువగా పట్టణ జనాభాను కలిగి ఉంటుందని అంచనా. ఒక్క హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమరేషన్ (హెచ్.యు.ఎ. – హైదరాబాద్ సహా ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం) లోనే అప్పటికి రాష్ట్ర జనాభాలో కనీసం 40 శాతం ఉంటారు. మన పట్టణీకరణ మాత్రమే కాదు, మన జి.ఎస్.డి.పి. కూడా భారతదేశంలోని మిగిలిన రాష్ట్రాలకంటే ఎక్కువగా వృద్ధి చెందుతోంది అనడానికి ఇది నిదర్శనం.

ప్రణాళికాబద్ధంగా పటిష్ఠమైన పట్టణీకరణను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వినూత్న విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. వాటిలో కొన్ని. ఎ) 'ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్': దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రం అపరిమితంగా 'ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్'ను ఆమోదిస్తోంది. అంటే భవన నిర్మాణ స్థలాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునే సదుపాయం. ఇది పట్టణ ప్రాంతాలలో నిటారు వృద్ధిని సూచిస్తుంది. అగ్ని మాపక భద్రత, సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ ప్రభావ అంచనాల పరంగా



అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకుని నిర్మాణాన్ని ప్లాన్ చేసేందుకు అపరిమిత ఎఫ్.ఎస్.ఐ. వీలు కల్పిస్తుంది. బి) టి.ఎస్–బి.పాస్: తెలంగాణ ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన టి.ఎస్–బి.పాస్ (తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టమ్) ఆన్‌లైన్‌లో స్వీయ ధ్రువీకరణతోనే భవన నిర్మాణానికి అనుమతిని మంజూరు చేస్తోంది. ఇందులో 600 చదరపు గజాల లోపు స్థలంలో నిర్మాణాలకు తక్షణమే, అంతకు మించి ఉంటే 21 రోజుల లోపు అనుమతులు లభిస్తాయి. ఇందు కోసం ఏ అధికారినీ నేరుగా కలవాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు. 2.1 లక్షల భవన నిర్మాణ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం జరిగింది. సి) ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ ఫండింగ్ మెకానిజం: ఏదైనా మౌలిక సదుపాయాల పనిని చేపట్టాలంటే పట్టణ స్థానిక సంస్థలకు ఇన్‌ఫ్రా నిధులు అవసరం. అందుకే జి.హెచ్.ఎం.సి. రహదారులకు ఇరువైపుల భవన నిర్మాణ ఛార్జీలు, ఆస్తిపన్ను వాటికవే పెరిగేలా ఒక మెకానిజంను తీసుకొచ్చింది. దాంతో స్థానిక సంస్థల ఆదాయం మెరుగై ఆ పరిధిలోని భవన నిర్మాణాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తాయి. డి) ప్రాజెక్ట్ ఆధారిత ఎస్.పి.వి.లు: పట్టణ ప్రాంత మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రహదారి ప్రాజెక్టులకే పూర్తిగా నిర్దేశించిన ఎస్.పి.వి. (స్పెషల్ పర్పస్ వెహికిల్ – ప్రాజెక్టు నిధుల సమీకరణ కోసం ఏర్పాటైన వ్యవస్థ)లను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

అందులో భాగంగా... 1. రెండు వైపులా దారి ఉన్న ప్రధాన వాహన మార్గాల్లో రద్దీని తగ్గిస్తూ, అదే సమయంలో సగటు వాహన వేగాన్ని గంటకు 15 నుంచి 35 కిలోమీటర్లకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం 'స్ట్రాటజిక్ అర్బన్ రోడ్ డెవలప్‌మెంట్ (ఎస్.ఆర్.డి.పి.) పథకానికి రూపకల్పన చేసింది. 2. రోడ్డు మార్గాలను గుర్తించడం, కొత్త లింకు రోడ్లను వేయడం ద్వారా ఇన్‌ఫ్రా పెట్టుబడికి గరిష్ఠ విలువను తీసుకురావడమే లక్ష్యంగా 2017లో 'హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (హెచ్.ఆర్.డి.సి.)ను ఏర్పాటు చేసింది. 3. కాంప్రెహెన్సివ్ రోడ్డు మెయింటెనెన్స్ ప్రాజెక్టు (సి.ఆర్.ఎం.పి.) కింద హైదరాబాద్‌లోని 930 కి.మీ.ల ముఖ్యమైన ప్రధాన ఆర్టెరియల్ రోడ్లు (మూడు లేదా అంతకంటే ఎక్కువ లైన్లు ఉన్నవి) గుర్తించి ప్రైవేట్ ఇన్‌ఫ్రా ఏజెన్సీలకు ఓపెన్ బిడ్ ద్వారా అప్పగించింది. 4. స్ట్రాటెజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ (ఎస్.ఎన్.డి.పి.) కింద నీటి వనరుల పరస్పర అనుసంధానం కోసం, వరద ముంపు ప్రమాదాన్ని నివారించడానికి 2021లో ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.

రాజధాని వరకే కాకుండా రాష్ట్ర స్థాయిలో పట్టణీకరణను నడిపిస్తున్న కొన్ని ప్రణాళికలు కూడా ఎంతో కీలకమైనవి. 2019లో తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన తెలంగాణ మున్సిపాలిటీల చట్టం (టి.ఎం.ఎ.) పౌరులకు పారదర్శకంగా మున్సిపల్ సేవలు అందిస్తోంది. అలాగే మున్సిపల్ బడ్జెట్‌ను తయారు చేయడంలో, నిర్వహించడంలో ఈ చట్టం వృత్తి నైపుణ్యాన్ని తెస్తుంది. మున్సిపల్ బడ్జెట్‌లో తప్పని సరిగా 10 శాతం గ్రీన్ బడ్జెట్‌గా ఉంటుంది. అన్ని మున్సిపల్ సేవలు ఆన్‌లైన్లో సమయానుకూలంగా జరిగిపోతుంటాయి.

పట్టణ శ్వాసావరణ స్థలం ఏ విధంగానూ ప్రభావితం కాకుండా, వాస్తవానికి మరింత పెరగకుండా చూసేందుకు హైదరాబాద్ పరిసరాల్లో 19 అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌లు (అభివృద్ధి చేయాలనుకున్న మొత్తం 129లో) ఒక్కొక్కటి 500 నుంచి 2,500 ఎకరాలలో విస్తరించాయి. ఇవి హరితావరణాన్ని, వారాంతపు విహార అనుభూతులను అందిస్తున్నాయి. హైదరాబాద్ సహా అన్ని యు.ఎల్.బి. (అర్బన్ లోకల్ బాడీ)లలో గత దశాబ్దంలో గ్రీన్ కవర్ పెరిగింది. 2020, 2021లలో హైదరాబాద్ రెండుసార్లు 'ట్రీ సిటీ ఆఫ్ ది వరల్డ్'గా ఎంపిక అయింది. ది ఆర్బర్ డే ఫౌండేషన్, యునైటెడ్ నేషన్స్ వారి ఎఫ్.ఎ.ఒ. నుండి రెండుసార్లు భారతీయ విజేతగా నిలిచిన ఏకైక నగరం హైదరాబాద్. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'ఎ.ఐ.పి.హెచ్. వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డు – 2022'ను కూడా హైదరాబాద్ గెలుచుకుంది.

భవిష్యత్తులోనూ తెలంగాణలో పట్టణాభివృద్ధి అత్యంత వేగంగా ఉండబోతోంది. పట్టణీకరణ జీవన నాణ్యతను మెరుగుపరుస్తోంది. ప్రజలకు సామాజిక, భౌతిక మౌలిక సదుపాయాలను బలమైన భద్రతను అందిస్తోంది. వారిని ఆర్థిక, సామాజిక సాధికారత వైపు నడిపిస్తోంది. గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి వీలు కల్పిస్తోంది.

వ్యాసకర్త ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్), మెట్రోపాలిటన్ కమిషనర్ (హెచ్ఎండీఏ)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు. విదియ ఉ.11.08 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పునర్వసు రా.9.21 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ఉ.8.15 నుండి 10.01 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.56 వరకు తదుపరి రా.10.54 నుండి 11.40 వరకు, **అమృతఘడియలు:** సా.6.44 నుండి 8.27 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.32.

రైతులకు మరో రూ.1,500 కోట్ల ధాన్యం డబ్బులు



సాక్షి, హైదరాబాద్: యాసంగిలో ధాన్యం విక్రయించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1,500 కోట్లు విడుదల చేసింది. మూడు రోజుల క్రితమే రూ.3,000 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం తాజాగా ఈ మొత్తాన్ని విడుదల చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం వ్యవసాయ, నీటి పారుదల, పౌరసరఫరాల శాఖలకు సంబంధించిన మంత్రులు, అధికారులతో సమావేశమయ్యారు. మంత్రి గంగుల కమలాకర్ ఈ సమావేశానికి హాజరై, రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు బదిలీ అయినట్లు వివరించారని సమాచారం. సోమవారం వరకు ధాన్యం విక్రయించిన తరువాత ఓపీఎంఎస్‌లో నమోదైన ప్రతి రైతుకు డబ్బులు బదిలీ అయినట్లు అనంతరం మంత్రి మీడియాకు తెలిపారు.

ధాన్యం ఇంకా మిగిలే ఉంది!

ఇదిలా ఉండగా యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయినట్లు ప్రభుత్వం చెపుతున్నప్పటికీ.. ఇంకా 12 జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతూనే ఉన్నాయి. యాసంగిలో ఆలస్యంగా నాట్లు వేసిన కారణంగా కొనుగోళ్లు కూడా ఆలస్యమయ్యాయి. ఆలస్యంగా పంట సాగు చేసిన ప్రాంతాల్లో కోతలు జూన్ రెండో వారం వరకు సాగుతూనే ఉన్నాయని మంత్రి గంగుల తెలిపారు. అలాంటి ప్రాంతాల్లో రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచామని, రైతు పండించిన ప్రతి గింజను సేకరించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

దరఖాస్తు గడువు పొడిగింపు ఉండదు

- పెంచితే చెక్కుల జారీ ఆలస్యమవుతుంది
- రూ.లక్ష సాయం పథకంపై మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్: కులవృత్తులకు అందించే రూ.లక్ష సహాయం పొందేందుకు దరఖాస్తు గడువు పొడిగించేది లేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టంచేశారు. గడువు పెంచితే ఎంపికైన లబ్ధిదారులకు చెక్కుల జారీ ఆలస్యమవుతుందని, అందుకే 20వ తేదీ గడువును పొడిగించడం లేదని తెలిపారు. హరితోత్సవం సందర్భంగా సోమవారం కరీంనగర్‌లో నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రూ.లక్ష సహాయం అందించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే మూడున్నర లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. మంగళవారం నాటికి దరఖాస్తు గడువు పూర్తవుతుందని, అనంతరం జూలై 15వ తేదీన చెక్కులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. చెక్కుల జారీ పూర్తయ్యాక మళ్లీ దరఖాస్తు ప్రక్రియ మొదలవుతుందన్నారు. రెవెన్యూ సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేదన్నారు. అలా అయితే మూడున్నర లక్షలకు పైగా దరఖాస్తులు ఎలావస్తాయని ప్రశ్నించారు. కులాల విభజన జరగలేదని, దశలవారీగా అన్ని కులాలకు పథకం వర్తిస్తుందని గంగుల స్పష్టం చేశారు.

ధ్రువీకరణ పత్రాలు ఎప్పుడిస్తారు?

- పత్రాల జారీలో ఆలస్యంపై జనం ఆగ్రహం
- మిర్యాలగూడలో దరఖాస్తుదారుల రాస్తారోకో



తహసీల్దారు కార్యాలయం ఎదుట రాస్తారోకో చేస్తున్న దరఖాస్తుదారులు

మిర్యాలగూడ టౌన్: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ప్రజలు సోమవారం ఆందోళన చేశారు. ప్రభుత్వం బీసీ కులాలకు లక్ష రూపాయల రుణం అందజేసేందుకు ప్రకటించిన పథకానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంది. వాటి కోసం ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, దరఖాస్తు చేసుకుని పది రోజులు గడిచినా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని మిర్యాలగూడలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. అయితే ఆందోళనకారులు ఆ తర్వాత తహసీల్దారు కార్యాలయానికి వెళ్లిన అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దరఖాస్తుదారులు మాట్లాడుతూ.. గత వారం పది రోజులుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దారు కార్యాలయంలో ఇప్పటి వరకు కూడా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. కాగా, కొన్ని రోజులుగా సర్వర్ డౌన్ అవుతుండడం వల్ల ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం అవుతోందని, రాత్రి సమయంలో కూడా సరిఫికెట్లు జారీ చేస్తున్నామని అధికారులు అంటున్నారు.

ఒకేరోజు 35 లక్షల కుటుంబాలతో మమేకం!

- 22న 'ఇంటింటికి బీజేపీ'కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: 'ఇంటింటికీ బీజేపీ'కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22న ఒకేరోజు 35 లక్షల కుటుంబాలను కలిసేలా పార్టీ కార్యక్రమాన్ని రూపొందించుకుంది. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇది కొనసాగనుంది. క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్ అధ్యక్షుడు మొదలు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి వరకు ప్రజల వద్దకు వెళ్లేలా, రాష్ట్రంలోని 35 వేల పోలింగ్ బూత్‌లలో ఒక్కో బూత్ అధ్యక్షుడు వంద కుటుంబాలను కలిసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. వీరంతా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించడంతో పాటు ఆ మేరకు కరపత్రాలు కూడా పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ, రాష్ట్ర నేతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కాగా ఈ కార్యక్రమానికి సంబంధించి సోమవారం పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకులతో సంజయ్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 22వ తేదీన ప్రతి పార్టీ కార్యకర్త, రాష్ట్ర నాయకత్వం ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా సంచలనం సృష్టించాలని సంజయ్ పిలుపునిచ్చారు. అదేరోజు 9090902024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు.

పోడు పట్టాలు రెడీ!

ఈ నెల 24న ఆసిఫాబాద్‌లో ప్రారంభం
- హాజరుకానున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన గిరిజన సంక్షేమ, అటవీ శాఖలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 24వ తేదీన ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకోసం గిరిజన సంక్షేమశాఖ, అటవీ శాఖలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆసిఫాబాద్ జిల్లాలో దీనిని మొదలు పెట్టాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. అతి త్వరలో ఇది ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పోడు రైతులకు పట్టాలు అందజేస్తారు. ఆ తర్వాత నుంచి ఇతర జిల్లాల్లోనూ పోడు పట్టాల పంపిణీ వేగవంతం కానుంది. మొత్తమ్మీద ఈ నెలాఖరు కల్లా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పోడు రైతులకు పట్టాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

26 జిల్లాల్లో1.50 లక్షల రైతులు

పోడు రైతులకు పట్టాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. ఈ క్రమంలో 26 జిల్లాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. అయితే వీటిని పరిశీలించేందుకు జిల్లా స్థాయిలో కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో అధికారులు ప్రాథమికంగా అర్హతలను ఖరారు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,50,012 మంది రైతులు 4,05,600 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నట్లు గుర్తించారు. వీరంతా గిరిజనులు, ఆదివాసీలే. ప్రాథమిక పరిశీలన అనంతరం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, అటవీ శాఖలు సంయుక్తంగా అర్హతలను ఖరారు చేశాయి. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 50,595 మంది రైతులు 1,51,195 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నట్లుగా దరఖాస్తు సమర్పించారు. ఈ లెక్కన ఒక్కో రైతు సగటున 3 ఎకరాల మేర సాగు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మహబూబాబాద్ జిల్లాలో 24,972 మంది రైతులు, ఆసిఫాబాద్ జిల్లాలో 15,254 మంది రైతులు దరఖాస్తులు సమర్పించారు. అతి తక్కువగా నారాయణపేట, పెద్దపల్లి జిల్లాల నుంచి మూడు చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం ఈ రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేందుకు ఏర్పాట్లు జరిగాయి.

పోడు రైతులు, వారు సాగు చేస్తున్న భూమి వివరాలు

జిల్లా	క్లెయిమ్స్	విస్తీర్ణం (ఎకరాల్లో)
భద్రాద్రి కొత్తగూడెం	50,595	1,51,195
మహబూబాబాద్	24,972	70,434
ఆసీఫాబాద్	15,254	44,750
ఆదిలాబాద్	12,222	31,683
ములుగు	7,413	18,869
నిర్మల్	7,257	20,051
ఖమ్మం	5,857	9,779
కామారెడ్డి	4,480	12,969
నిజామాబాద్	3,788	7,697
వరంగల్	3,654	8,366
భూపాలపల్లి	3,428	8,537
మంచిర్యాల్	2,403	5,024
నల్గొండ	2,256	4,426
నాగర్ కర్నూల్	1,956	4,968
రాజన్న సిరిసిల్ల	1,614	2,857
సంగారెడ్డి	1,128	1807
మెదక్	610	524
వికారాబాద్	434	554
వనపర్తి	311	379
యాదాద్రి భువనగిరి	186	427
సూర్యాపేట	84	189
హనుమకొండ	70	65
మహబూబ్ నగర్	19	22
జగిత్యాల	15	19
నారాయణపేట	3	8
పెద్దపల్లి	3	1
మొత్తం	1,50,012	4,05,600

ఎంపీ నిధులతో ఇల్లు కట్టుకున్నా.. పెళ్లి చేశా..!

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు పేరిట వీడియో వైరల్
- అది అవాస్తవమని, ఓర్వలేక చేస్తున్న ప్రచారమని ఖండించిన ఎంపీ



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎంపీ నిధులతో ఇల్లు కట్టుకున్నానని, పెళ్లి చేశానని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు చేసిన వ్యాఖ్యల వీడియో కలకలం రేపింది. కానీ తాను అలా అనలేదని, ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఖండించడం గమనార్హం. సోయం బాపురావు ఈ నెల 16న ఆదిలాబాద్‌లోని తన నివాసంలో స్థానిక బీజేపీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దీనికి సంబంధించిన ఓ వీడియో సోమవారం వైరల్‌గా మారింది. అందులో.. ''మొదటిసారి పార్టీ బలోపేతం కోసం, రెండోసారి రెండున్నర కోట్లలో ఇల్లు, కొడుకు మ్యారేజీ కోసం ఎంపీ ల్యాడ్స్ వాడిన. ఇల్లు లేకుంటే వ్యాల్యూ ఉండదు కాబట్టి నేనే కొంత వాడిన. ఈ మాటను ఏ నాయకుడు కూడా ఒప్పుకోడు. ఇంకోసారి నా స్వార్థం కోసం వాడను. అంతకుముందు దద్దమ్మ ఎంపీలు మొత్తం వాడుకున్నారు. ఈసారి ఇంకా దేశంలో ఏ ఎంపీకి కూడా నిధులు రాలేదు. ఈసారి వచ్చే రూ.ఐదు కోట్లు మీకే.. ఒక్కొక్కరికి రూ.ఐదేసి లక్షల చొప్పున నిధులు ఇస్తా..''అని బాపురావు పేర్కొన్నట్లుగా ఉంది.

తెలివిలేని ఆరోపణలు: సోయం బాపురావు

సోమవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో ఓ కార్యక్రమానికి హాజరైన ఎంపీ సోయం బాపురావు దీనిపై మాట్లాడారు. ''నేను ఇల్లు కట్టుకోవడం, కొడుకు పెళ్లిలో బిజీగా ఉన్నానని చెప్పానే తప్ప.. ఇంటికోసమే నిధులు వాడినట్టు ఎక్కడా లేదు. ఇది తెలివి లేనివాళ్లు చేసే అవాస్తవ ప్రచారం. అవగాహన లేక, ఓర్వలేక ఇలా చేయిస్తున్నారు. ఎంపీ నిధుల వినియోగానికి ఒక సిస్టం ఉంటుంది. కొందరికి నేను ముక్కుసూటిగా పనిచేయడం నచ్చక, వాళ్ల ఆటలు సాగక ఆరోపణలు చేస్తున్నారు..''అని పేర్కొన్నారు.

కవితను ఎందుకు అరెస్టు చేయలేదో సంజయ్ చెప్పాలి : పొన్నం



కరీంనగర్‌టౌన్: లిక్కర్ స్కామ్ కేసులో కేసీఆర్ కూతురు కవితను ఎందుకు అరెస్టు చేయలేదని తెలంగాణ సమాజం అడుగుతున్న ప్రశ్నకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమాధానం చెప్పాలని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన డీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో పెడతామని చెబుతూ.. జోకర్ పాత్ర పోషిస్తున్న బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేయడం ద్వారా తన ఉనికిని కాపాడుకోవాలనుకుంటున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అవినీతి సంబంధాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. సంజయ్ పాదయాత్రకు డబ్బులు సమకూర్చిందే కేసీఆర్ అని ఆరోపించారు. బండి సంజయ్ చేసే ఖర్చంతా గంగుల కమలాకర్ ద్వారా కేసీఆర్ భరిస్తున్నారన్నారు. ఈటల రాజేందర్‌ను అణచివేయడానికే బండి సంజయ్ అరెస్టు పేరిట డ్రామా ఆడారని ధ్వజమెత్తారు.

సంజయ్‌పై పొన్నం ఆరోపణలు నిరాధారం



విఠల్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌పై కాంగ్రెస్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి సీహెచ్ విఠల్ తెలిపారు. 2009 తర్వాత మళ్లీ గెలవని పొన్నం ప్రభాకర్ ఫ్రస్టేషన్‌తో మాట్లాడుతున్నారన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంజయ్‌పై ఆరోపణలు, విమర్శలు చేసే అర్హత పొన్నం ప్రభాకర్‌కు లేదని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని అధికార ప్రతినిధి జె.సంగప్ప విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 30 మందికి ఆ పార్టీ తరఫున కేసీఆరే టికెట్లు నిర్ణయిస్తారని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్.. కర్ణాటక ఎన్నికల్లో జేడీ(ఎస్)కు హ్యాండిచ్చి కాంగ్రెస్‌కు ఆర్థికంగా సహకరించారని ఆరోపించారు. కర్ణాటక ఎన్నికల పోలింగ్‌కి ముందు హరీశ్‌రావు బెంగళూరులోనే ఉన్నారన్నారు.

నాన్నా.. మరో కేసు పెడుతున్నా

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డిపై కూతురు ఫైర్
- చేర్యాలలో భూమి కొనుగోలు చేయలేదని స్పష్టీకరణ
- బలవంతంగా ఒకపేపర్‌పై సంతకం చేయించారని ఆరోపణ

జనగామ: జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, కూతురు మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. గతంలో హైదరాబాద్ ఉప్పల్, చేర్యాల పోలీస్ స్టేషన్‌లలో తండ్రిపై ఫిర్యాదు చేసిన ఆమె... తాజాగా మరో కేసు ఫైల్ చేస్తున్నానంటూ చెప్పడంతో.. మరో వివాదం తెరపైకి వచ్చింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జనగామ పట్టణంలోని వడ్లకొండ ఇరిగేషన్ క్వార్టర్‌లో సోమవారం జరిగిన హరితదినోత్సవంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం తిరిగి వెళ్లిపోతున్న క్రమంలో.. ఆయన కూతురు తుల్జా భవానీరెడ్డి, అల్లుడు అక్కడికి వచ్చారు. కూతురు.. తండ్రి వద్దకు వెళ్లి.. భూమి కొనుగోలు సమయంలో తన సంతకాలు ఫోర్జరీ చేశారని డాక్యుమెంట్లను చూపించారు.



చేర్యాల భూమికి సంబంధించి సంతకాలపై అడుగుతున్న ఎమ్మెల్యే కూతురు

అందరి ముందే తండ్రితో వాగ్వాదం

జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల ఎదుటే ఎమ్మెల్యే కూతురు వాగ్వాదానికి దిగారు. చేర్యాల భూమి తనపేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు రోజంతా తనను ఆఫీసులో కూర్చొబెట్టి, బెదిరించారన్నారు. ఈ సమయంలో ఒక్క పేపర్‌పై సంతకం చేయించిన మాట వాస్తవం కాగా, మిగతా చోట్ల ఫోర్జరీ చేశారని ఆరోపించారు. తాను సంతకాలు చేయకున్నా... తప్పుడు ధ్రువీకరణతో చేర్యాల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయడంతో.. నిత్యం ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటున్నానని వాపోయారు. తన సంతకాలు ఫోర్జరీ చేసినమాట వాస్తవమా, కాదా అని తెలుసుకునేందుకే వచ్చానని చెప్పారు. గతంలో రెండుసార్లు ఫిర్యాదు చేయగా, ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదు అయిందని, ఇప్పుడు మరో కేసు ఫైల్ చేస్తున్నట్లు తండ్రి(ఎమ్మెల్యే)కు చెబుతూ... అక్కడినుంచి వెళ్లి పోయారు.

కూతురుకు ఆస్తి కొనివ్వడం ఫోర్జరీ అవుతుందా: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

కన్న కూతురుకు ఆస్తి కొనివ్వడం ఫోర్జరీ అవుతుందా అంటూ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తన రాజకీయ ప్రత్యర్థులు కావాలని కూతురు అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని బదనాం చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేర్యాలలో 1200, జనగామలో 1100 గజాలు స్థలం కూతురు పేరిట కొనుగోలు చేసి ఇస్తే, ప్రత్యర్థుల మాయమాటలను నమ్మి, తాను ఫోర్జరీ చేశానని కూతురు తనను బదనాం చేయడం బాధగా ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో కూతురు వచ్చి సంతకాలు చేసిందన్నారు. గతంలో ఇక్కడ పని చేసిన కలెక్టర్ తాను కబ్జాకోరు అంటూ ఇంతకంటే ఎక్కువ బదనాం చేశారని, తానేంటో అధినేత సీఎం కేసీఆర్‌కు పూర్తిగా తెలుసన్నారు.

ఇద్దరు పిల్లలతో బిల్డింగ్‌పై నుంచి దూకి తల్లి ఆత్మహత్య

- అదనపు కట్నం కోసం భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ అఘాయిత్యం
- బన్సీలాల్‌పేట్ జీవైఆర్ కాంపౌండ్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ఘటన

బన్సీలాల్‌పేట్: అదనపు కట్నం డిమాండ్ చేయడంతో పాటు భర్త వేధింపులు తట్టుకోలేక ఓ గృహిణి ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన సోమవారం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బన్సీలాల్‌పేట్ డివిజన్ జీవైఆర్ కాంపౌండ్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోని 8వ అంతస్తు నుంచి దూకి సౌందర్య(28), ఏడాదిన్నర వయసున్న కవల పిల్లలు నిత్యా, నిదర్శన్‌తో కలిసి ఆత్మహత్య చేసుకుంది. ముందుగా ఇద్దరు పిల్లలను కిందికి తోసి తర్వాత ఆమె కూడా దూకింది. తలకు తీవ్ర గాయాలతో ముగ్గురూ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన సికింద్రాబాద్‌లో కలకలం రేపింది. ఒకరు తర్వాత ఒకరు బిల్డింగ్ పై నుంచి కిందకు పడుతున్న దృశ్యాలు చూసిన స్థానికులు గగుర్పాటుకు గురయ్యారు. కళ్లు తెరిచి చూసే లోపు ముగ్గురు నిర్జీవంగా పడి పోయారు.

20రోజుల క్రితం భర్తతో గొడవ పడి..

'సిద్దిపేట జిల్లా రామంచకు చెందిన వేమన్న, దుర్గమ్మల చిన్న కుమార్తె సౌందర్యను అదే జిల్లా కొండాపూర్‌కు చెందిన గణేష్‌కు ఇచ్చి మూడేళ్ల కితం వివాహం చేశారు. 30ఏళ్ల క్రితం వేమన్న దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జీవైఆర్ కాంపౌండ్‌లో జీవనం సాగిస్తుండగా.. సౌందర్య, గణేష్‌లు ఉప్పల్ భరత్‌నగర్‌లో ఉంటున్నారు. ఇరవై రోజుల క్రితం సౌందర్య భర్తతో గొడవ పడి తల్లిదండ్రుల వద్దకు వచ్చి జీవైఆర్ కాంపౌండ్‌లోనే ఉంటోంది. కాగా, సోమవారం పద్మారావునగర్‌లోని ఓ క్షౌరశాలలో పని చేస్తున్న భర్త వద్దకు వెళ్లి ఆందోళనతో తిరిగి వచ్చినట్టు తెలుస్తోంది. మధ్యాహ్నం ఇంట్లో పిల్లలకు భోజనం చేయించిన అనంతరం తల్లి నిద్రిస్తుండగా ఇద్దరు పిల్లల్ని తీసుకొని 8వ అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి ఇద్దరు పిల్లలను కిందికి వదలి తాను కూడా దూకేసింది. భర్త గణేష్ అదనపు కట్నం కోసం వేధించడంతోనే తమ బిడ్డ పిల్లలతో కలిసి ప్రాణాలు తీసుకుందని మృతురాలి తల్లిదండ్రులు దుర్గ, వేమన్నలు ఆరోపించారు. అదనపు కట్నం కింద ఇటీవలే యాదాద్రి దగ్గరున్న ఓ ప్లాట్‌ను కూడా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామని విలపిస్తూ చెప్పారు. కాగా ఈ ఘటనతో బస్తీలో తీవ్ర విషాదం నెలకొంది. సౌందర్యను వేధింపులకు గురి చేసి పిల్లలు, ఆమె చావుకు కారణమైన భర్త గణేష్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని స్థానిక మహిళలు డిమాండ్ చేశారు. పోలీసులు మృతదేహాలను గాంధీ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భర్త, పిల్లలతో సౌందర్య

మంత్రి తలసాని పరామర్శ

ఈ ఘటన చాలా బాధాకరమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. విషయం తెలిసిన వెంటనే తలసాని హుటాహుటిన జీవైఆర్ కాంపౌండ్ బస్తీకి చేరుకొని మృతురాలి కుటుంబీకులను ఓదార్చారు. చట్టపరంగా కేసును విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ పోలీసులను ఆదేశించారు. ప్రభుత్వం తరఫున ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఎస్సీ హాస్టల్లో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

- ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న రక్షిత
- ఆర్మూర్‌లోని కళాశాలలో చదువుతున్న విద్యార్థిని
- మరో రెండురోజుల్లో డిగ్రీ పూర్తవుతుందనగా బలవన్మరణం

ఆర్మూర్/ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని ఎస్సీ హాస్టల్లో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం రాత్రి గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుందీ తెలియరాలేదు. పోలీసులు, సహచర విద్యార్థినుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెండోరా మండల కేంద్రానికి చెందిన గోలి వెంకట రాములు, సత్తెమ్మల రెండో కూతురు రక్షిత (20) ఆర్మూర్‌లోని నరేంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం (ఎంపీసీఎస్) చదువుతూ వసతి గృహంలో ఉంటోంది. ఆదివారం రాత్రి భోజనానికి రావాలని తోటి స్నేహితులు పిలవగా, తాను తర్వాత భోజనం చేస్తానని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. అయితే రక్షిత వసతి గృహంలోనే ఉన్న వార్డెన్ ఫర్జానా బేగం వద్దకు వచ్చి చల్లని నీళ్లు తీసుకుని, ప్లేట్లో అన్నంతో తిరిగి గదిలోకి వెళ్లిపోయింది. డిన్నర్ పూర్తయిన తర్వాత గదికి వచ్చిన తోటి విద్యార్థినులు, రక్షిత లోపలి నుంచి గడియ వేసుకున్నట్లు గుర్తించారు. డోర్ కొట్టగా ఆమె సమాధానం ఇవ్వలేదు. ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో విద్యార్థినులు గది వెనకాల ఉన్న కిటికీ నుంచి చూడగా.. రక్షిత ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది.

ఆస్పత్రికి తరలించిన తోటి విద్యార్థినులు: వార్డెన్‌కు సమాచారం అందించిన విద్యార్థినులు, తలుపులు బద్దలు కొట్టి రక్షితను ఆటోలో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించడంతో అక్కడికి తరలించారు. అక్కడి వైద్యులు అప్పటికే రక్షిత మృతి చెందినట్లు నిర్ధారించారు. వార్డెన్ ఇచ్చిన సమాచారంతో మెండోరా నుంచి తల్లి సత్తెమ్మ, మేనమామ రాజేందర్ ప్రభుత్వ ఆస్పతికి చేరుకొన్నారు. మరో రెండురోజుల్లో డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూర్తవుతాయి. బిడ్డ పట్టభద్రురాలిగా తిరిగి వస్తుందనుకుంటే.. ఘోరం జరిగిపోయిందటూ తల్లి విలపించడం అందరినీ కంటతడి పెట్టించింది. రక్షిత తండ్రి వెంకటరాములు ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లగా.. ఆమెకు అక్క ఆకాంక్ష, తమ్ముడు అభిరామ్ ఉన్నారు. రక్షిత బలవన్మరణానికి కారణాలు తెలుసుకోవాలని మేనమామ రాజేందర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు దుర్మరణం



మృతిచెందిన తల్లీకొడుకులు (ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి: భూమి సమస్యను విన్నవించేందుకు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్తున్న తల్లి, కుమారుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని తాడ్వాయి - పస్రా మార్గంలో సోమవారం ఈ ఘటన జరిగింది. ఎస్సై వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కావేరి రమాదేవి (38), ఆమె కుమారుడు స్టీవిన్ (17) ఇద్దరూ కలసి భూ సమస్య పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ ఆఫీసుకు బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో తాడ్వాయికి 8 కిలోమీటర్ల దూరంలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో తల్లి, కొడుకు ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. రమాదేవి బుట్టాయిగూడెంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుండగా, కొడుకు స్టీవిన్ ములుగు ప్రభుత్వ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. రమాదేవి భర్త మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా రమాదేవికి ఒక కూతురు ఉండగా ఆమెకు వివాహం జరిగింది. ప్రమాదం గురించి తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వరరావు సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి కుమార్తె సబిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

తల్లి మరణానికి కారణమైన కొడుకులకు జైలు

- 2016లో దీక్ష చేస్తూ కన్నుమూసిన వృద్ధురాలు

కొత్తగూడెంటౌన్: కొడుకులు తన బాగోగులు చూసుకోవడం లేదని దీక్షకు దిగిన వృద్ధురాలు మృతి చెందగా.. వృద్ధాప్యంలో తల్లి బాగోగులు పట్టించుకోకుండా ఆమె మరణానికి కారకులైన కుమారులకు జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జి.భానుమతి వెలువరించిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మొండికుంట గ్రామానికి చెందిన కందిమల్ల నర్సింహారెడ్డి, సరోజనమ్మ దంపతులకు ఐదుగురు కొడుకులు కందిమల్ల సుధాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, శేఖర్‌రెడ్డి. భర్త చనిపోయాక కొడుకులు తన బాగోగులు చూడటం లేదని సరోజనమ్మ 2016 ఆగస్టు 10న గ్రామపంచాయతీ కార్యదర్శి పసువులేటి కృష్ణకు చెప్పింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ దీక్షకు దిగింది. దీక్ష చేస్తున్న ఆమె మరుసటి రోజు(2016 ఆగస్టు 11)న మధ్యాహ్నం స్పృహ కోల్పోయింది. స్థానికులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ జరుగుతుండగా అశోక్‌రెడ్డి చనిపోయాడు. ఈ క్రమంలో 16 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి.. నేరం రుజువైనందున సరోజనమ్మ కుమారులు నలుగురికి ఏడాది చొప్పున కారాగార శిక్షతో పాటు రూ.5 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ మిరోజ్ ఫిర్దోసీ వాదించగా, సిబ్బంది ఎం.హరిగోపాల్ ఎం.ఈశ్వరరావు సహకరించారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక..

- భవనంపైనుంచి దూకిన టెన్త్ విద్యార్థిని



చికిత్స పొందుతున్న విద్యార్థిని స్నేహలత

రాయికోడ్ (అందోల్): హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక పదో తరగతి విద్యార్థిని హాస్టల్ భవనంపై నుంచి దూకి గాయాలపాలైంది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కేజీబీవీ హాస్టల్ టీచర్లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝరాసంగం మండలం ప్యారారం గ్రామానికి చెందిన దశరథ్, సుజాత దంపతుల కూతురు స్నేహలత నాలుగేళ్లుగా రాయికోడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో చదువుకుంటూ హాస్టల్‌లో ఉంటోంది. ఈ వేసవి సెలవుల్లో సొంతూరుకెళ్లింది. కాగా హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేదని అప్పుడే తల్లిదండ్రులకు చెప్పింది. అయినా కూతురును బుజ్జగించి, స్కూళ్లు తెరవడంతో సోమవారం హాస్టల్‌లో వదిలివెళ్లడానికి వచ్చారు. వీరు కేజీబీవీకి చేరుకున్న అనంతరం మరోసారి స్నేహలత మొండికేయగా తల్లి నచ్చచెప్పింది. దీంతో బ్యాగ్ హాస్టల్‌లో పెట్టి వస్తానని తల్లికి చెప్పి, భవనంపైకి ఎక్కి దూకింది. ఈ ఘటనలో స్నేహలత తల, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే బాలికకు స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం స్నేహలత క్షేమంగానే ఉన్నట్లు కేజీబీవీ ఎస్‌ఓ దీపిక తెలిపారు.

క్లుప్తంగా...

రూ. కోటి నగదు బహుమతి వద్దు: గీతా ప్రెస్

గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్‌లోని ప్రఖ్యాత ప్రచురణ సంస్థ గీతా ప్రెస్‌కు ప్రతిష్టాత్మక గాంధీ శాంతి బహుమతిని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల రాజకీయ రగడ మొదలైంది. విపక్షాలు విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ బహుమతి కింద అందజేసే రూ.కోటి నగదును తాము స్వీకరించబోమని గీతా ప్రెస్ బోర్డు ట్రస్ట్ సోమవారం స్పష్టం చేసింది. 2021 సంవత్సరానికి గాను గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతి ప్రకటించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని వెల్లడించింది. విరాళాలు తీసుకొనే సంప్రదాయం తమ ప్రెస్‌కు లేదని, అందుకే ఈ బహుమతి కింద అందించే రూ.కోటి నగదును స్వీకరించబోమని గీతా ప్రెస్ మేనేజర్ లాల్‌మణి త్రిపాఠి పేర్కొన్నారు. బహుమతి మాత్రమే స్వీకరిస్తామని వివరించారు. ఇదిలా ఉండగా, గీతా ప్రెస్‌కు గాంధీ శాంతి బహుమతి ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ నేతలు చేసిన విమర్శలను వీహెచ్‌పీ ఖండించింది.

మధ్యప్రదేశ్‌లో పరువు హత్య



మొరెనా: కూతురు ప్రేమ వ్యవహారం నచ్చని ఓ తండ్రి ఘాతుకానికి ఒడిగట్టాడు. కన్నకూతురితోపాటు ఆమె ప్రియుడిని కూడా తుపాకీతో కాల్చి చంపి, మృతదేహాలను నదిలో పడేశాడు. మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాలో ఈ ఘోరం చోటుచేసుకుంది. రతన్‌బసాయి గ్రామానికి చెందిన శివానీ(19), పొరుగూరు బాలుపురకు చెందిన రాధేశ్యామ్ తోమర్(21) ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 3వ తేదీన వారిద్దరూ అదృశ్యమయ్యారు. అయితే, వారిని శివానీ తండ్రి చంపించి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ రాధేశ్యామ్ తండ్రి లఖన్ తోమర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రేమికులు ఎటో వెళ్లిపోయి ఉంటారని పోలీసులు కూడా మొదట్లో భావించారు. అలాంటి జాడలేవీ లేకపోవడంతో శివానీ కుటుంబీకులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దారుణం వెలుగులోకి వచ్చింది. కూతురు తమ మాట విననందునే ఆమెతోపాటు, ప్రేమికుడిని చంపేసి చంబల్ నదిలో పడేసినట్లు శివానీ తండ్రి రాజ్‌పాల్ తోమర్ పోలీసు విచారణలో వెల్లడించాడు. అతడు చూపిన ప్రాంతంలో మృతదేహాల కోసం చంబల్ నదిలో గజ ఈతగాళ్ల సాయంతో గాలిస్తున్నారు. నదిలో ఎక్కువగా మొసళ్లుంటాయని, మృతదేహాలు దొరికేందుకు ఆస్కారం లేదని గ్రామస్తులు అంటుండగా, మృతదేహాలు దొరికితేనే నిబంధనల ప్రకారం రాజ్‌పాల్‌పై హత్య కేసు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు.

తంపులమారి చైనా

పొరుగు దేశాలతో సరిహద్దు వివాదాలు

- భూభాగాలు, దీవులు, సముద్ర జలాల విషయంలో 15 దేశాలతో కయ్యం
- భారత్‌లోని పలు కీలక భూభాగాలు తమవేనని వాదిస్తున్న డ్రాగన్ దేశం
- మధ్య యుగాల నాటి రాజుల పాలనా క్షేత్రాన్ని రుజువుగా చూపుతూ జగడాలు



దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి

చైనా పీపుల్స్ రిపబ్లిక్ దేశంగా ఏర్పడిన నాటి నుంచి సరిహద్దుల విషయంలో భారత్‌తో గిల్లికజ్జాలు పెట్టుకుంటూనే ఉంది. రెండు దేశాల మధ్య ఉన్న 3,488 కిలోమీటర్ల సరిహద్దుకు సంబంధించి అనేక చోట్ల వివాదాలు సృష్టిస్తోంది. మన దేశంలో చైనాతో సరిహద్దు ఉన్న జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలో అనేక భూభాగాలు తమవేనంటూ చైనా వాదిస్తోంది. 1950లో టిబెట్‌ను ఆక్రమించుకున్న చైనా అటుపిమ్మట భారత్‌లోని అనేక భాగాలు టిబెట్‌కు చెందినవని, వాటిని తమకు అప్పగించాలని ఒత్తిడి చేస్తూనే ఉంది. 1962లో భారత్‌తో జరిపిన యుద్ధం ఫలితంగా ప్రస్తుత కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లోని భాగమైన 37,244 చదరపు కిలోమీటర్ల అక్సాయ్‌చిన్ ప్రాంతాన్ని చైనా ఆక్రమించుకుంది. అంతేకాదు జమ్మూకశ్మీర్ లోయలోని మరో 5,300 చదరపు కిలోమీటర్ల భూభాగం కూడా తమదేనంటూ ఘర్షణలకు దిగుతూనే ఉంది. 2020 మే నెలాఖరులో చైనా సైన్యం గల్వాన్ లోయ ప్రాంతంలో భారత భూభాగంలోకి చొరబడినప్పుడు జరిగిన ఘర్షణలో ఇరువైపులా అనేకమంది సైనికులు మరణించారు. 1967లో సిక్కింలోని నాథులా, చోలా ప్రాంతాల్లో కూడా చైనా సైన్యం సరిహద్దుల వెంబడి అనేక చోట్ల భారత సైన్యంతో ఘర్షణలకు దిగింది. ఆ తరువాత కూడా చైనా ఘర్షణలకు పాల్పడుతూనే ఉంది. మరోవైపు అరుణాచల్‌ప్రదేశ్ తమ దేశ అంతర్భాగమని డ్రాగన్ దేశం వాదిస్తోంది. మొదట్లో దాదాపు 90,000 చదరపు కిలోమీటర్లు.. అంటే మొత్తం అరుణాచల్‌ప్రదేశ్ తమదేనని అని వాదించిన చైనా ఇప్పుడు తొలుత 8,000 చదరపు కిలోమీటర్ల భూభాగంపై వివాదాన్ని పరిష్కరించుకుందామని భారత్‌తో బేరాలాడుతోంది. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లోని 15 ప్రాంతాల పేర్లను చైనా భాష మాండరిన్‌లోకి మార్చేసింది. వీటిలో 8 పేర్లు పట్టణాలు, 2 పేర్లు నదులు, 5 పేర్లు పర్వతాలకు సంబంధించినవి ఉన్నాయి. అరుణాచల్‌ప్రదేశ్‌ను చైనా తన భూభాగమైన జంగ్‌నన్‌గా సంబోధిస్తోంది.

అర్థం లేని ఆధారాలు

పొరుగు దేశాలతో నెలకొన్న వివాదాలకు చైనా ప్రత్యక్ష ఆధారాలు చూపడం లేదు. తన విస్తరణవాదానికి పూర్వకాలం నాటి రాజవంశస్తుల పాలనా క్షేత్రాన్ని రుజువుగా చూపిస్తోంది. మధ్య యుగాలనాటి హాన్, తంగ్, యువాన్, క్వింగ్ రాజవంశీకులు పరిపాలించిన ప్రాంతాలంటూ ఇతర దేశాలతో సరిహద్దుల విషయంలో జగడానికి దిగుతోంది. అందుకోసం ఆయా ప్రాంతాల పేర్లను పూర్వకాలంలో పేర్కొన్న పేర్లుగా మార్చేస్తోంది. అంతర్జాతీయంగా జరిగిన ఏ ఒక్క ఒప్పందాన్ని కూడా చైనా అంగీకరించడం లేదు. దక్షిణ చైనా సముద్ర జలాలపై, ఆ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలపై ఆధిపత్యం తమదేనంటూ తాను సృష్టించిన గీతల మ్యాప్‌లను చారిత్రక ఆధారాలుగా చూపుతోంది.

ఆరు మహాయుద్ధాలు!

2020 నుంచి 2050 మధ్యకాలంలో ఆరు మహాయుద్ధాలు జరుగుతాయని చైనాకు చెందిన సోహు అనే పోర్టల్‌లో గతంలో పేర్కొన్నట్లు యురేషియన్ టైమ్స్ అనే ఆన్‌లైన్ పత్రిక వెల్లడించింది. దాని ప్రకారం 2025 నాటికి తైవాన్, 2030 నాటికి అన్ని దీవులను, 2040 నాటికి అరుణాచల్‌ప్రదేశ్‌ను, 2050 నాటికి జపాన్‌కు చెందిన దీవులను స్వాధీనం చేసుకోవడానికి యుద్ధాలు జరుగుతాయని పోర్టల్ చెబుతోంది. తంపులమారి చైనా మాదిరిగానే భారతదేశం కూడా మౌర్య, చోళ వంశస్తుల పరిపాలనా క్షేత్రాన్ని ఆధారంగా చూపితే అనేక దేశాలను అఖండ్ భారత్‌లో అంతర్భాగంగా చెప్పొచ్చు. మౌర్య, చోళ వంశస్థుల పరిపాలనకు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి.

అందరితోనూ తగువే

భారత్ మాత్రమే కాకుండా 15 దేశాలతో చైనాకు సరిహద్దు తగాదాలు కొనసాగుతున్నాయి. వీటిలో తైవాన్, ఫిలిప్పైన్స్, ఇండోనేసియా, వియత్నాం, జపాన్, ద.కొరియా, ఉ. కొరియా, సింగపూర్, బ్రూనై, నేపాల్, భూటాన్, లావోస్, మంగోలియా, మయన్మార్ తదితర దేశాలు ఉన్నాయి. దక్షిణ చైనా సముద్రం అంతా తమ ఏలుబడిలోనే ఉండాలంటూ అంతర్జాతీయ సమాజాన్ని డ్రాగన్ సవాలు చేస్తోంది.

- తైవాన్ విషయంలో ఆ దేశమంతా తమకు చెందినదేనన్నది చైనా వాదన. అయితే, ప్రస్తుతానికి మెకలిస్ బ్యాంక్, చైనా ఆక్రమణలో ఉన్న దీవులు, సౌత్‌చైనా సముద్రంలో కొంత భూభాగం విషయంలో రెండు దేశాలు ఘర్షణ పడుతున్నాయి.
- ఫిలిప్పైన్స్ విషయంలో కూడా స్కార్‌బరో కొండలు, మరికొన్ని దీవులపై చైనా వివాదం సృష్టించింది. వీటివిషయంలో ఫిలిప్పైన్స్‌తో తరచుగా ఘర్షణలకు పాల్పడుతోంది.
- ఇండోనేసియాకు సంబంధించి నతునా దీవులు, సౌత్ చైనా సముద్రంలో కొంతభాగం తమదేనంటూ చైనా తగువులు సృష్టిస్తోంది.
- వియత్నాం విషయానికి వస్తే అనేక భాగాలను తమకు అప్పగించాలని చైనా ఒత్తిడి పెంచుతోంది. పలు ద్వీపాలతోపాటు సముద్ర జలాల్లో ఆధిపత్యం కోసం కాలుదువ్వుతోంది. చైనా నౌకాదళం ఇటీవల వియత్నాంకు చెందిన చేపల వేట పడవను సముద్రంలో ముంచేసింది.
- మలేసియాతోనూ కొన్ని దీవులు, సముద్ర జల్లాల విషయంలో చైనా జగడం ఆడుతోంది. మలేషియా చమురు అన్వేషణ నౌకలను అడ్డుకుంటోంది. ఇటీవల అమెరికా, ఆస్ట్రేలియా యుద్ధనౌకలు మలేషియాకు అండగా రావడంతో చైనా నౌకాదళం తోకముడిచి వెనక్కి వెళ్లిపోయింది.
- జపాన్‌కు చెందిన రెండు ద్వీప సముదాయాలపై చైనా కన్నుపడింది. అవి సెన్కాకు దీవులు, ర్యూక్యు దీవులు. ఈ దీవుల్లో చమురు నిక్షేపాలు బయటపడినప్పటి నుంచి చైనా వీటి విషయంలో జపాన్‌తో తగువు పడుతోంది.
- దక్షిణ చైనా సముద్రంలో కొంతమేరకు మునిగిపోయిన సొకొత్రా రాక్‌పై దక్షిణ కొరియాతో వివాదానికి దిగింది చైనా. ఈ రాక్ కొరియాకు 149 కిలోమీటర్ల దూరంలో ఉండగా, చైనాకు 287 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- దాదాపు 1,400 కిలోమీటర్ల సరిహద్దు ఉన్న ఉత్తర కొరియాతో సీ ఆఫ్ జపాన్ సముద్ర జలాల్లో హద్దుల అంశంపై చైనా వివాదం సృష్టించింది.
- దక్షిణ చైనా సముద్ర జలాల విషయమై సింగపూర్‌తో చైనా తగువులాడుతోంది.
- అతిచిన్న ఇస్లామిక్ దేశమైన బ్రూనైతో కూడా కొన్ని దీవులు, సముద్ర జలాలపై చైనా గొడవ పెట్టుకుంది.
- తమ భూభాగంలో కొంత భాగాన్ని చైనా ఆక్రమించుకున్నట్లు నేపాల్ ప్రభుత్వం ఇటీవలే గుర్తించింది. పశ్చిమ నేపాల్‌లోని హుమ్లా జిల్లాలో చైనా ఆక్రమణలకు పాల్పడింది.
- దాదాపు 290 మైళ్లకుపైగా సరిహద్దు ఉన్న భూటాన్‌తో అనేక చోట్ల హద్దుల విషయంలో చైనా వివాదాలు సృష్టించింది. 1980 నుంచి వీటి విషయంలో రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి.
- లావోస్‌లో అత్యధిక భాగం తమదేనని చైనా వాదిస్తోంది. అందుకు యువాన్ రాజవంశ పరిపాలనను రుజువుగా చూపిస్తోంది.
- సరిహద్దు వివాదం కారణంగా తమ దేశంలోని ఓ చెక్‌పాయింట్‌పై దాడి జరిగిందని చైనా చెబుతోంది. ఈ ప్రాంతం విషయంలో మంగోలియాకు, చైనాలోని గాన్సు ప్రాంత ప్రజలకు మధ్య వివాదం ఉంది.

ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హతం

కెనడాలోని గురుద్వారా వద్ద కాల్చిచంపిన గుర్తుతెలియని ఆగంతకులు



న్యూఢిల్లీ: కెనడాలో సిక్కు వేర్పాటువాద ఉద్యమానికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. భారత్‌లో మోస్ట్–వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన నిషేధిత ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్) అధిపతి హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌ను గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఆదివారం రాత్రి కాల్చిచంపారు. కెనడాలోని సుర్రే నగరంలోని గురునానక్ సిఖ్ గురుద్వారా పార్కింగ్ ప్రాంగణంలో నిజ్జర్ కారులో ఉండగా ఇద్దరు వ్యక్తులొచ్చి తుపాకీ గుళ్ల వర్షం కురిపించారు. దీంతో బుల్లెట్ గాయాలతో కారులోనే నిజ్జర్ కన్నుమూశారు. కెనడా పారిపోయిన నిజ్జర్‌ను పట్టిచ్చే సమాచారమిస్తే రూ.10 లక్షల నగదు బహుమతి ఇస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) గత ఏడాది జులైలో ప్రకటించడం తెల్సిందే. కఠిన చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక) చట్టం కింద ఉగ్రవాదిగా పేర్కొంటూ ఇతని ఆస్తులను జప్తుచేసింది. 2021లో పంజాబ్‌లోని జలంధర్‌లో ఒక హిందూ పూజారిపై దాడి ఘటనలో నిజ్జర్‌కు ప్రమేయముంది. ఖలిస్తాన్ డిమాండ్‌తో భారత్‌లో ఏర్పాటైన సిఖ్స్ ఫర్ జస్టిస్ సంస్థకు సాయపడుతూ దాని విద్వేష అజెండాను కెనడాలోనూ ఇతను ప్రచారంచేసేవాడు.

ఎవరీ నిజ్జర్?

45 ఏళ్ల నిజ్జర్ సొంతూరు పంజాబ్‌లోని భార్‌సింగ్‌పూర్. కెనడాకు వెళ్లాక అక్కడి గురునానక్ సిఖ్ గురుద్వారాకు చీఫ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. 2010లో పటియాలాలో హిందూ ఆలయం వద్ద పేలుడు ఘటనలో నిజ్జర్‌కు ప్రమేయముందని కేసు నమోదైంది. కేటీఎఫ్‌కు చెందిన జగ్తార్ సింగ్ తారాను కలిసేందుకు నిజ్జర్ 2013–14కాలంలో పాకిస్తాన్‌కూ వెళ్లి వచ్చాడు. నిజ్జర్‌పై కాల్పుల ఘటన జరిగిన సుర్రే నగరంలో సిక్కుల జనాభా అధికం. ఇక్కడి వైరి ఖలిస్తానీ గ్రూప్‌తో శత్రుత్వం వల్లే ఈ కాల్పుల ఉదంతం చోటుచేసుకుందనే వార్తలు కెనడా మీడియాలో ప్రసారమయ్యాయి. పంజాబ్‌కు గతంలో కెప్టెన్ అమరీందర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నిజ్జర్ పేరును 'వెతుకుతున్న నేరగాళ్ల జాబితా'లో చేర్చారు. తర్వాత కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో 2018లో భారత్‌లో పర్యటించినపుడు ఆయనకు ఈ జాబితాను అందజేశారు.



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఐఎన్ఎస్ దీపక్ యుద్ధ నౌకపై యోగాసనాలు వేస్తున్న నేవీ సిబ్బంది

'ఉమ్మడి పౌరస్మృతి మత స్వేచ్ఛకు వ్యతిరేకం'

న్యూఢిల్లీ: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అనేది మత స్వేచ్ఛకు పూర్తి వ్యతిరేకమని దేశంలోని ప్రముఖ ముస్లిం సంస్థ జమియత్ ఉలేమా–ఈ–హింద్ సోమవారం వ్యాఖ్యానించింది. ఈ మేరకు సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. ' రాజ్యాంగం భారతీయులకు మత స్వేచ్ఛను ప్రసాదించింది. కానీ ఉమ్మడి పౌరస్మృతి అనేది ఈ మత స్వేచ్ఛకు వ్యతిరేకం .వీధుల్లో నిరసన కార్యక్రమాల ద్వారా యూసీసీని వ్యతిరేకించదల్చుకోలేదు. చట్ట ప్రకారమే ఒక్కో అడుగూ ముందుకేస్తూ వెళతాం. ఈ మేరకు యూసీసీని వ్యతిరేకిస్తూ చేసిన తీర్మానాన్ని జమియత్ కమిటీ ఆమోదించింది' అని సంస్థ పేర్కొంది.

రేపే అమెరికాకు మోదీ

- పర్యటనకు పూర్తయిన ఏర్పాట్లు
- అమెరికావ్యాప్తంగా భారతీయ–అమెరికన్ల ఐక్యతా ప్రదర్శనలు



వాషింగ్టన్/హూస్టన్: ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆయన ఈ నెల 21 నుంచి 24వ తేదీ దాకా అమెరికాలో పర్యటిస్తారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, జిల్ దంపతుల ఆహ్వానం మేరకు అగ్రరాజ్యంలో మోదీ పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగా పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. మోదీ పర్యటన కోసం భారత–అమెరికన్లు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికేందుకు సన్నద్ధమవుతున్నారు. మోదీకి స్వాగత సందేశాన్ని పంపించడానికి రాజధాని వాషింగ్టన్ డీసీ సహా అమెరికావ్యాప్తంగా 20 నగరాల్లో భారత–అమెరికన్లు తాజాగా ఐక్యతా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనల్లో వందలాది మంది ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్‌లో మోదీ హాజరయ్యే కార్యక్రమంలో పాల్గొనేందుకు టికెట్ల కోసం భారత–అమెరికన్లు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పుడు అమెరికా అంతటా మోదీ పర్యటనపై పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.

రక్షణ బంధాలకు పెద్దపీట

రక్షణ రంగంలో పరస్పర సహకారం కోసం భారత్–అమెరికా చేతులు కలుపుతున్నాయి. మోదీ అమెరికా పర్యటనలో ఇదే అంశంపై విస్తృతంగా చర్చలు జరుగనున్నాయి. రక్షణ రంగంలో సహకారంపై ఇరుదేశాలు కీలకమైన ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు తెలుస్తోంది. ఓ రోడ్డు మ్యాప్‌ను సైతం ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఇకపై కలిసి పనిచేయాలని భారత్–అమెరికా ఇప్పటికే నిర్ణయించుకున్నాయి.

24, 25న మోదీ ఈజిప్టు పర్యటన

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 24, 25న ఈజిప్టులో పర్యటిస్తారు. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసీ ఆహ్వానం మేరకు ఆయన ఈ పర్యటన తలపెట్టారు. 1997 తర్వాత భారత ప్రధాని ఈజిప్టులో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి కావడం విశేషం. 11వ శతాబ్దం నాటి చారిత్రక అల్–హకీం మసీదును మోదీ సందర్శిస్తారు. దావూదీ బోహ్రా ముస్లిం సామాజికవర్గం సహాయంతో ఈ మసీదును ఇటీవలే పునరుద్ధరించారు. ఈజిప్టులో మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన భారత సైనికులకు హెలియోపోలిస్ వార్ సెమెట్రీలో మోదీ నివాళులర్పిస్తారు. ఈజిప్టు అధ్యక్షుడితో చర్చలు జరుపుతారు. ఈజిప్టులోని భారతీయులతో సమావేశమవుతారు.

వెస్ట్‌బ్యాంక్‌లో భీకర పోరు

ఐదుగురు పాలస్తీనీయులు మృతి



జెనిన్ శరణార్థి శిబిరంపై దాడి దృశ్యం

జెనిన్: ఇజ్రాయెల్ సైనిక దళాలు సోమవారం వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై జరిపిన దాడి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. శిబిరంలోని తీవ్రవాదులను పట్టుకునేందుకు ఆర్మీ ప్రయత్నించింది. ఇస్లామిక్ జిహాద్ శ్రేణులు బాంబులను పేల్చడంతో ఆర్మీకి చెందిన అయిదు వాహనాలు ధ్వంసమయ్యాయి. వాటిలో చిక్కుకున్న జవాన్లను కాపాడేందుకు హెలికాప్టర్ రంగంలోకి దిగింది. గన్‌షిప్ కాల్పుల్లో బాలుడు సహా ఐదుగురు పాలస్తీనీయులు చనిపోయారు. 90 మందికి పైగా గాయపడ్డారు.

ఎల్‌ఏసీ వద్ద పరిణామాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. చైనాతో సరిహద్దు వివాదంపై పార్లమెంట్‌లో సమగ్రంగా చర్చ జరపాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రతినిధి మనీష్ తివారీ సోమవారం మీడియాతో మాట్లాడారు. 'సరిహద్దులు దాటి మన భూభాగంలోకి ఎవరూ ప్రవేశించలేదు. మన ఆర్మీ పోస్టులను ఎవరూ స్వాధీనం చేసుకోలేదని మూడేళ్ల క్రితం గల్వాన్ ఘర్షణలు జరిగాక అఖిలపక్ష భేటీలో ప్రధాని మోదీ చెప్పారు. చైనా సైనికులు సరిహద్దులు దాటి చొచ్చుకొచ్చేందుకు, మన భూభాగంలో టెంట్లు వేసేందుకు ప్రయత్నించడంతో గల్వాన్ ఘటన జరిగిందంటూ విదేశాంగ శాఖ ప్రకటించింది. ఇవి రెండూ పరస్పర విరుద్ధ ప్రకటనలు'అని తివారీ తెలిపారు. అందుకే భారత్–చైనా సరిహద్దు వివాదంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరపడంతోపాటు గత మూడేళ్లుగా ఎల్‌ఏసీ వెంట జరుగుతున్న వాస్తవ పరిణామాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ కోరుతోందన్నారు. 'ఎల్‌ఏసీ వెంట ఉన్న 65 పెట్రోలింగ్ పాయింట్లకు గాను 26 వరకు మన ఆర్మీ నియంత్రణలో లేవన్న విషయం నిజమా? చైనా ఆక్రమణలను మనం ఎందుకు ఆపలేకపోయాం?'అని తివారీ కేంద్రాన్ని నిలదీశారు.

రా చీఫ్‌గా రవి సిన్హా నియామకం

న్యూఢిల్లీ: దేశం వెలుపల గూఢచర్య కార్యకలాపాలు నడిపే నిఘా సంస్థ.. రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్(రా)కు అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి రవి సిన్హా(59) నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఛత్తీస్‌గఢ్ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన రవి సిన్హా రెండు దశాబ్దాలుగా 'రా'లో నంబర్ టూగా వివిధ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన 'రా' ఆపరేషన్స్ విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. గూఢచర్యంలో ఆధునిక సాంకేతికత వినియోగంలో సిద్ధహస్తుడిగా ఆయనకు పేరుంది.

నిర్దిష్టమైన అంశాలపై ఒప్పందం

అమెరికా విదేశాంగ మంత్రితో భేటీ తర్వాత జిన్‌పింగ్ ప్రకటన



బీజింగ్: దాదాపు ఐదేళ్ల తర్వాత చైనాలో పర్యటిస్తున్న అమెరికా విదేశాంగ మంత్రితో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య కొన్ని నిర్దిష్టమైన అంశాలపై ఒప్పందం కుదిరిందని జిన్‌పింగ్ ప్రకటించారు. అయితే ఆ ఒప్పందాల వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఇటీవల అమెరికా గగనతలంలో చైనా నిఘా భారీ బెలూన్లు చక్కర్లు కొట్టడం, వాటిని అమెరికా వాయుసేన కూల్చేయడం వంటి ఘటనలతో ఇరుదేశాల మధ్య సత్సంబంధాల్లో సందిగ్ధత నెలకొన్న విషయం తెల్సిందే. "ఇటీవల బాలీలో బైడెన్‌తో కుదిరిన 'కనీస అవగాహన'కు కొనసాగింపుగా చైనా తన వైఖరిని స్పష్టంచేసింది. ప్రత్యేకంగా కొన్ని అంశాల్లో ఒప్పందాలు కుదిరాయి. ఇరు దేశాలు ఉమ్మడిగా పురోగతి సాధించాయి. పరస్పర గౌరవం, నమ్మకాల మీదనే చర్చలు సఫలమవుతాయి" అని భేటీ తర్వాత జిన్‌పింగ్ వ్యాఖ్యానించారని చైనా అధికార వార్తాసంస్థ సీజీటీఎన్. ' బ్లింకెన్ పర్యటనతో ఇరుదేశాల బంధం కీలక కూడలికి చేరుకుంది. అయితే చైనాపై అమెరికా విధిస్తున్న ఏకపక్ష ఆంక్షలను ఎత్తేయాల్సిన అవసరం ఉంది' అని చైనా విదేశాంగ మంత్రి క్విన్ చెప్పారు. చైనాతో దౌత్య ద్వారాలు ఎప్పటికీ తెరిచే ఉండాలనే లక్ష్యంతో బ్లింకెన్ పర్యటన సాగిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

లొంగేది లేదు: ఇమ్రాన్

లాహోర్: దేశంలో న్యాయబద్ధమైన పాలన కోసం తన పోరు కొనసాగుతుందని పాకిస్తాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ చీఫ్ ఇమ్రాన్ ఖాన్ స్పష్టం చేశారు. 'ప్రభుత్వం నన్ను జైలులో పెట్టినా లొంగను'అంటూ కరాఖండిగా తేల్చారు. యూట్యూబ్‌లో ఆయన సోమవారం దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దేశం కోసం, ప్రజల మెరుగైన భవిష్యత్తు కోసమే తన పోరాటమని చెప్పారు. అంతకుముందు ఆయన లాహోర్ నుంచి ఇస్లామాబాద్ వెళ్లి తనపై ఉన్న 19 కేసులకు సంబంధించిన బెయిల్ గడువును పొడిగించాలని కోర్టును కోరారు. ఇమ్రాన్‌పై 140కి పైగా కేసులున్నాయి.

జగదీశ్ షెట్టార్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ టిక్కెట్



బెంగళూరు/న్యూఢిల్లీ: కర్ణాటక శాసనమండలికి ఈ నెల 30వ తేదీన జరగనున్న ఉప ఎన్నికల్లో పోటీ చేసే ముగ్గురు అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ ప్రకటించింది. మాజీ సీఎం జగదీశ్ షెట్టార్, మంత్రి ఎన్ఎస్ బోస్ రాజు, తిప్పన్నప్ప కమక్నూర్‌లను బరిలోకి దించుతున్నట్లు సోమవారం తెలిపింది. వీరి అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని ఏఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి వీలుగా బాబూరావ్ చించన్సూర్, ఆర్.శంకర్, లక్ష్మణ్ సవాదిలు రాజీనామా చేయడంతో ఈ మూడు సీట్లు ఖాళీ అయ్యాయి. ఈ ముగ్గురిలో సవాది మాత్రమే ఎమ్మెల్యేగా గెలుపొందగా మిగతా ఇద్దరు ఓటమి పాలయ్యారు.

గుజరాత్‌ను వీడని బిపర్‌జోయ్

అస్సాం, తమిళనాడుల్లోనూ వానలు

అహ్మదాబాద్/జైపూర్/గువాహటి/ సాక్షి, చెన్నై: బిపర్‌జోయ్ తుపాను వాయుగుండంగా మారడంతో గుజరాత్, రాజస్తాన్‌ల్లోని పలు ప్రాంతాల్లో గత 24 గంటల్లో భారీ వర్షాలు కురిశాయి. గుజరాత్ బనస్కాంత జిల్లా ధనేరా తాలుకాలో వరదలు సంభవించాయని అధికారులు సోమవారం తెలిపారు. 20 వరకు పశువులు కొట్టుకుపోయాయన్నారు. వచ్చే రెండు రోజుల్లో సౌరాష్ట్ర ప్రాంతంలో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) పేర్కొంది. అదేవిధంగా, రాజస్తాన్‌లోని అనేక ప్రాంతాల్లో గత రెండు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. సంబంధిత ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే 15 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పాలి, సిరోహి, బర్మేర్, జలోర్ జిల్లాల్లో చాలా ప్రాంతాలు నీట మునిగాయి. పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరదల్లో చిక్కుకున్న 265 మందిని యంత్రాంగం కాపాడింది. అజ్మీర్‌లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వానకు స్థానిక జేఎల్ఎన్ ఆస్పత్రిలోకి వరద ప్రవేశించింది. 18 మంది రోగులను ఇతర వార్డులకు అధికారులు తరలించారు. రాజస్తాన్ మీదుగా ఏర్పడిన అల్పపీడనం బుధవారం కల్లా బలహీనపడుతుందని ఐఎండీ తెలిపింది. అస్సాంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో పంట పొలాలు, గ్రామాలు, పట్టణాలు నీటి ముంపునకు గురయ్యాయి. లఖింపూర్‌లోని 25,200 మంది సహా మొత్తం 33,400 మంది వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గురువారం వరకు రాష్ట్రంలో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలకు కురుస్తాయంటూ ఐఎండీ హెచ్చరించింది.

చెన్నైలో స్కూళ్లకు సెలవు

ఆదివారం రాత్రి నుంచి తమిళనాడు రాజధాని చెన్నైలో భారీ వర్షాలు కురుస్తుండటంతో యంత్రాంగం సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించింది. రోడ్లపైకి భారీగా నీరు చేరడంతోపాటు చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది.

గుర్బానీ ప్రసారాలు ఉచితం

చండీగఢ్: సిక్కులు పఠించే పవిత్ర శ్లోకం గుర్బానీ ఇకపై ఉచితంగా ప్రఖ్యాత స్వర్ణదేవాలయం నుంచి ప్రసారం కానుంది. ఇందుకు సంబంధించిన బ్రిటిష్‌కాలంనాటి చట్టానికి చేసిన సవరణ ప్రతిపాదనలకు పంజాబ్ రాష్ట్ర మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది. మంగళవారం శాసనసభలో ఈ సవరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదిస్తామని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సోమవారం ప్రకటించారు. ఇన్నాళ్లూ గుర్బానీని రాష్ట్రంలో శక్తివంతమైన శిరోమణి అకాలీదళ్ పార్టీకి చెందిన ప్రైవేట్ చానెల్ పీటీసీ ప్రసారం చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ(ఎస్‌జీపీసీ) మండిపడింది. 'ఆ చట్టాన్ని పార్లమెంట్ చేసింది. దీనికి సవరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు. సిక్కుల మత సంబంధ వ్యవహారాలకు ఆప్ ప్రభుత్వం రాజకీయ రంగు పులుముతోంది' అని ఆగ్రహం వ్యక్తంచేసింది. 'చట్ట పరిధిపై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. ఇది రాష్ట్ర పరిధిలోనిది' అని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. ' గుర్బానీ వినిపించేటపుడు అడ్వర్టైజ్‌మెంట్లు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రత్యక్షంగా ఉచితంగా ఆడియో, వీడియో ప్రసారాలు చేస్తున్నాం' అని ప్రభుత్వం ప్రకటించింది. పీటీసీ ప్రైవేట్ చానెల్‌కు అధిపతి అయిన శిరోమణి అకాలీదళ్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకే సర్కార్ ఈ నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది.

భోజనం బాగుందా బుజ్జీ



ముఖ్యమంత్రి మధ్యాహ్నం భోజన పథకం తనిఖీలో భాగంగా సోమవారం తిరుచిరాపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ విద్యార్థినితో కలిసి భోజనం చేస్తున్న తమిళనాడు యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి

సాక్షి
కరీంనగర్
మంగళవారం । 20 । జూన్ । 2023



పత్తి ధర రూ.7,200

జమ్మికుంట: జమ్మికుంటలో పత్తి రూ.7,200 పలికింది. మార్కెట్‌కు 28వాహనాల్లో 368 క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. మోడల్ ధర రూ.7వేలు, కనిష్ట ధర రూ.6,800 పలికింది.



విద్యుత్ భవన్‌లో హరితోత్సవం

కొత్తపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని టీఎస్ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ భవన్ ఆవరణలో సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, ఉద్యోగులు మొక్కలు నాటారు.

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం వేడిగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

మొక్కనాటిన సీపీ



మొక్కనాటి నీరుపోస్తున్న సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: హరితోత్సవంలో భాగంగా సోమవారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో సీపీ ఎల్.సుబ్బారాయుడు మొక్కలు నాటారు. కమిషనరేట్‌వ్యాప్తంగా విడతల వారీగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగించనున్నామని తెలిపారు. డీసీపీ(శాంతి భద్రతలు)ఎస్.శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ(సీఏఆర్)ఎం.భీంరావు, ఏసీపీలు సి.ప్రతాప్, పీ.కాశయ్య, ఎస్బీఐ జి.వెంకటేశ్వర్లు, సీఐ సృజన్‌రెడ్డి, ఆర్ఐలు శేఖర్‌బాబు, సురేశ్, మురళి పాల్గొన్నారు.

ఈత వనాలతో అభివృద్ధి



మొక్కనాటుతున్న శ్రీనివాసరావు

కొత్తపల్లి(కరీంనగర్): గౌడకులస్తుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఈతవనం ఏర్పాటు చేస్తోందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కొత్తపల్లి మండలం ఎలగందులలో గౌడ కులస్తులకు కేటాయించిన మూడెకరాలస్థలంలో హరితోత్సవంలో భాగంగా ఎంపీపీ పిల్లి శ్రీలతతో కలిసి ఆయన ఈత మొక్కలు నాటారు. వన సేవకులను సన్మానించారు. పంచాయతీరాజ్‌శాఖ డీఈ నవీన్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ తిరుమల, ఎస్సైలు స్వప్న, సంధ్య, ఇరిగేషన్ ఏఈ కాళిదాసు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు హరిత అవార్డు



అవార్డు తీసుకుంటున్న కమిషనర్ ఇస్లావత్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ హరితఅవార్డు దక్కింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన హరితదినోత్సవ వేడుకల్లో అవార్డును దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా నగరపాలక కమిషనర్ సేవా ఇస్లావత్ స్వీకరించారు.

కేబుల్ బ్రిడ్జి ప్రారంభానికి తరలిరావాలి



మాట్లాడుతున్న జీవీ.రామకృష్ణారావు

మానకొండూర్: కేబుల్‌బ్రిడ్జి ప్రారంభోత్సవానికి ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు కోరారు. మానకొండూర్‌లో సోమవారం మాట్లాడుతూ.. ప్రయాణదూరాన్ని తగ్గించేందుకు కరీంనగర్ మానేరువాగుపై చేపట్టిన తీగలవంతెన దేశంలోనే మూడోదని అన్నారు. ఓ రైతు సూచనను పరిగణలోకి తీసుకున్న అప్పటి ఎంపీ, ప్రస్తుత రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్ణయంతో తీగల వంతెన మంజూరు చేయించారని తెలిపారు. బ్రిడ్జి ద్వారా అల్గునూర్ మీదుగా ట్రాఫిక్ తిప్పలు తప్పుతాయని పేర్కొన్నారు.

21న మినీ జాబ్‌మేళా

విద్యానగర్(కరీంనగర్): ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఈనెల 21న కరీంనగర్‌లోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే.దేవేందర్‌రావు తెలిపారు. వివిధ ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, స్థానికంగా పనిచేసే అవకాశం ఉందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు 21న ఉదయం 10.30 గంటల నుంచి 2గంటల లోపు జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

కొనసాగిన పరీక్షలు

కరీంనగర్ సిటీ: తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2023లో భాగంగా 4వ రోజు వివిధ క్రీడాంశాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించామని కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ తెలిపారు. బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి 255 మంది హాజరుకాగా వారిలో ఒకమహిళాఅభ్యర్థి, 254మంది పురుష అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జే.ప్రభాకర్‌రావు, రమేశ్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మునావర్, సత్యనారాయణ, పీడీ విజయకుమార్ ఉన్నారు.

మొలక మాడుతోంది

- ఆందోళనలో అన్నదాతలు
- విత్తనాలు వేసి వర్షం కోసం నిరీక్షణ
- మొలకెత్తకుంటే రూ.కోట్ల నష్టం..
- పొడినేలలో విత్తనాలు వద్దంటున్న వ్యవసాయాధికారులు



కరీంనగర్ మండలంలో నెర్రలుబారిన పత్తిచేను

కరీంనగర్ అర్బన్/కరీంనగర్‌రూరల్/వీణవంక: రుతుపవనాలు దోబూచులాడుతుండగా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాలు కురవాల్సి ఉండగా తొలకరి జాడ లేదు. అన్నదాతలు రోహిణిలోనే విత్తనాలు వేసి పక్షం రోజులుగా వరుణుడి కోసం నిరీక్షిస్తున్నారు. మరో రెండు మూడు రోజులు దాటితే విత్తనం పాడవనుండగా రూ.కోట్లలో నష్టం వాటిల్లనుంది. మృగశిరలో వర్షాలు కురిసి విత్తనాలు మొలకెత్తాల్సి ఉండగా ఇంకా నేలలోనే మగ్గడం ఆందోళనకర పరిణామం. మండుతున్న ఎండలు వరినార్లను ఎదగనివ్వకపోగా.. చేలోని పత్తి మొలకలు మాడిపోతున్నాయి.

నారు ఎండుతోంది

జిల్లాలో వరి 2,72,500ల ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. జూన్ మొదటి,రెండోవారంలో 85వేల ఎకరాల్లో నార్లు పోశారు. ఇప్పటి వరకు వర్షాలు కురవకపోవడంతో నార్లు ఎండలకు మాడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతుండటంతో వేడి నీటికి మొలక ఎదగడంలేదు. ఉదయం, సాయంత్రం నీళ్లు పెట్టి తీస్తున్నా.. మొలక ఎదగకపోవడంతో కొంతమంది నారుమడులు చెడగొట్టి మళ్లీ నార్లు పోసినట్లు తెలిసింది. ఒక్కో వడ్ల బస్తా రూ.850 ఉండగా రైతులపై అదనపు భారం పడుతోంది.

వర్షం పడకుంటే రూ.కోట్లలో నష్టం

జిల్లాలో 48 వేల ఎకరాల్లో పత్తివేస్తారని అంచనా వేయగా అంతకుమించి సాగు చేశారని తెలుస్తోంది. పత్తికి కనీస మద్దతు ధరకు మించి పలుకగా ఈ సారి మరింత పెరిగింది. దీంతో రైతులు పత్తి వైపే మొగ్గుచూపగా వర్షాలు కురవకముందే విత్తనాలు వేశారు. సుమారు 55వేల ఎకరాల వరకు సాగైనట్లు సమాచారం.విత్తనాలు వేసి పక్షం రోజులు దాటుతుండగా, రెండుమూడు రోజుల్లో వర్షాలు పడకుంటే విత్తు మొలకరాక నేలలోనే పాడవనుంది. దీంతో రూ.14కోట్లకు పైగా నష్టం వాటిల్లనుండగా మళ్లీ నేలను చదును చేయడం అదనపు భారమే. కాగా.. పొడి నేలల్లో విత్తనాలు వేసి నష్టపోవద్దని, తొలకరి కురిసిన తరువాతే పంటలు వేయాలని వ్యవసాధికారులు సూచిస్తున్నారు.

గత జూన్‌లో ఇదే తేదీ వరకు నమోదైన వర్షపాత వివరాలిలా..

నమోదైన వర్షపాతం:	174.5 మి.మీలు
వర్షం కురిసిన రోజులు:	9
అత్యధిక వర్షపాతం నమోదైన మండలాలు:	16

వానాకాలం సాగు అంచనా

మొత్తం రైతులు:	1,93,205
సాగు విస్తీర్ణం:	3,39,050ఎకరాలు
వరి:	2,72,500
పత్తి:	48,000
మొక్కజొన్న:	4,500
కందులు:	2,500
పెసలు:	1,000
ఇతర పంటలు:	10,643

ముందుకు జరపడం కష్టమే

యాసంగి వరిపంట దిగుబడి వచ్చేసరికి అకాల వర్షం తీరని నష్టం చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పంటల సీజన్‌ను ముందుకు జరపాలని వ్యవసాయశాఖను ఆదేశించగా క్షేత్రస్థాయిలో విరుద్ధ పరిస్థితి నెలకొంది. జూలై మొదటివారంలోగా నాట్లు వేస్తే పంట సెప్టెంబర్ వరకు చేతికందనుండగా యాసంగినాట్లు నవంబర్‌లోగా వేసుకుంటే మార్చి నెలాఖరు వరకు కోతలు పూర్తవనున్నాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లదన్నది ప్రభుత్వ భావన. వర్షాలు కురిస్తే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరే అవకాశముండగా మృగశిర దాటుతున్నా చినుకు జాడే కరువైంది. ముందుగానే వరి నారు పోసుకోవాలనుకున్న రైతులు వర్షాలు లేకపోవడంతో అచితూచి వ్యవహరిస్తున్నారు. నీరు సమృద్ధిగా ఉన్నా ఒకవేళ నారుపోస్తే వర్షాలు లేకపోతే పరిస్థితి ఎలాగని మరికొందరి ఆలోచన.

వరినారు ఎదుగుతలేదు



ఈ వానాకాలంలో నాకున్న భూమితో పాటు కౌలుకు తీసుకున్న భూమితో కలిపి 20ఎకరాలకు నార్లు పోసిన. సన్న, దొడ్డు రకం వడ్లు అలికిన. ఎండలకు నార్లు ఎదుగుతలేవు. నారును కాపాడుకోవడానికి అరిగోస పడుతున్నాం. గతంలో ఎప్పుడైనా ఈ సమయానికి వర్షాలు పడేవి. నారు ఎదగకపోవడంతో మళ్లీ దున్నడానికి సిద్ధమవుతున్న. వారం లోపు వర్షాలు కురవకపోతే తీవ్రంగా నష్టపోతాం.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, కనపర్తి, వీణవంక మండలం

రూ.50 వేల పెట్టుబడి పెట్టా..



ఐదు ఎకరాల్లో పత్తి విత్తనాలు వేసేందుకు రూ.50వేల పెట్టుబడి పెట్టాను. 12విత్తనాల ప్యాకెట్లకు రూ.10వేలు, కూలీలకు రూ. 5వేలు, దున్నేందుకు రూ.35వేల ఖర్చయింది. విత్తనాలు వేసిన పదిరోజుల నుంచి వానలు పడకపోవడంతో మొలకెత్తలేదు. ఎండతీవ్రతకు భూమిలోనే విత్తనాలు మాడిపోతున్నాయి.

– మంద తిరుపతి, పత్తిరైతు, గోపాల్‌పూర్, కరీంనగర్ రూరల్



కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు, ఏసీపీలు శ్రీనివాస్, విజయ్‌కుమార్

సిటీ కంట్రోల్

- 14 చోట్ల ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్
- 18 చోట్ల వైఫై హాట్‌స్పాట్స్
- రేపటి నుంచి అమలులులోకి

కరీంనగర్ కార్పొరేషన్: స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా కరీంనగర్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్(ఐసీసీసీ) అమల్లోకి రానుంది. కంట్రోల్ రూం నుంచి ఆధునిక పద్ధతిలో ట్రాఫిక్‌ను నియంత్రించడం, ప్రజలను ఉద్దేశించి మాట్లాడడం వంటివి దీని ప్రత్యేకత. నగరంలో ఇప్పటికే ఈ కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌లో భాగంగా ఎంపిక చేసిన జంక్షన్లలో కెమెరాలు, స్పీకర్లు, స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. నగరంలోని 14 జంక్షన్లలో ఆటోమేటెడ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టిమ్ ఏర్పాటు చేయగా, 18చోట్ల పబ్లిక్ అడ్రసింగ్‌లో భాగంగా స్పీకర్లను అమర్చారు. కమాండ్ కంట్రోల్ రూం నుంచి కెమెరాల ద్వారా ట్రాఫిక్, ఇతరత్రా ర్యాలీలు, ప్రదర్శనలు వీక్షించే అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణంగా ప్రజలు, వాహనదారులను ఉద్దేశించి ఆదేశాలు, ఆయా జంక్షన్లలో స్పీకర్ల ద్వారా జారీచేస్తారు. ఈ నెల 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ట్రయల్‌రన్‌లో భాగంగా మేయర్ సునీల్‌రావు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా మాట్లాడిన విషయం తెలిసిందే. సోమవారం కూడా రాష్ట్ర ఆవిర్భావ పాటలను ఈ సిస్టమ్ ద్వారా కూడళ్లలో వినిపించారు. ఎనిమిది ప్రాంతాల్లో స్క్రీన్లు ఏర్పాటు చేశారు. నగరంలోని 18 ప్రాంతాల్లో ఫ్రీవైఫై హాట్‌స్పాట్ సెంటర్లుగా మార్చారు. బుధవారం మంత్రి కేటీఆర్ ఈ కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను ప్రారంభించనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మేయర్

ఈ నెల 21న మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం మేయర్ యాదగిరి సునీల్‌రావు పరిశీలించారు. కశ్మీర్‌గడ్డ రైతుబజార్, గ్రంథాలయాలను సందర్శించారు. శంఖుస్థాపనకు శిలాఫలకాల ఏర్పాటుకు సంబంధించిన స్థలాలు, కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నగర, ట్రాఫిక్ ఏసీపీలు తుల శ్రీనివాస్‌రావు, విజయ్, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, ఐలేందర్ యాదవ్, తోట రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన ఇలా...

పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ నగర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు మంత్రి నగరపాలకసంస్థ కార్యాలయానికి చేరుకుంటారు. రూ.10 కోట్లతో నిర్మించనున్న కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్, రూ.7 కోట్లతో నిర్మించనున్న మోడ్రన్ లైబ్రరీకి శంకుస్థాపన చేస్తారు. 5.15 గంటలకు కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను, 5.30కి మూడో అంతస్తులోని సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తారు. 5.45కు కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బందితో సమావేశమవుతారు. 6 గంటలకు కేబుల్ బ్రిడ్జి ప్రారంభించనున్నారు.

21న డీసెట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

తిమ్మాపూర్: డీసెట్–2023–24 ప్రవేశాలకు సర్టిఫికెట్ల పరిశీలన 21న జరగనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య తెలిపారు. డీసెట్–2023లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఎల్ఎండీకాలనీలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)కు జూన్ 21 ఉదయం 10 గంటలకు రావాలని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్ల సెట్ వెంటతీసుకుని రావాలని పేర్కొన్నారు. డీసెట్–2023 హాల్ టికెట్, ర్యాంకకార్డు, ఎస్సెస్సీమెమో, ఇంటర్, స్టడీ, కుల, ఆదాయ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా వివరించారు.

టూరిస్ట్ స్పాట్‌గా కేబుల్ బ్రిడ్జి

- ఆదివారం సాయంత్రం వాహనాలకు నో ఎంట్రీ
- నగరాన్ని గ్రీన్‌సిటీగా మార్చడమే లక్ష్యం
- మంత్రి గంగుల కమలాకర్



నగరంలోని కేబుల్ బ్రిడ్జి ప్రాంతంలో తొలిమొక్క నాటుతున్న మంత్రి కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్: దక్షిణ భారతంలోనే అతిపెద్దదైన కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి పర్యాటక కేంద్రంగా మారనుందని రాష్ట్ర పౌరసరఫరాల, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. హరితోత్సవం సందర్భంగా సోమవారం నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో కేబుల్‌బ్రిడ్జి సమీపంలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 21వ తేదీన కేబుల్ బ్రిడ్జిని ప్రారంభిస్తారని, ఆ తరువాత నుంచి వాహనాలకు అనుమతి ఇస్తామని తెలిపారు. ప్రతి ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు వాహనాల రాకపోకలు ఉండవని, కేవలం పర్యాటకులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అలాగే కేటీఆర్ చేతులమీదుగా నగరంలో కమాండ్ కంట్రోల్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు.

గ్రీన్‌సిటీగా మార్చడమే లక్ష్యం

కాంక్రీట్ జంగల్ నుంచి నగరాన్ని గ్రీన్‌సిటీగా మార్చడమే లక్ష్యమని మంత్రి గంగుల చెప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో ప్రతి ఏటా లక్షలాది మొక్కలు నాటి సంరక్షిస్తున్నామన్నారు. కష్టానికి తగిన ఫలితం అవార్డు రూపంలో వచ్చిందన్నారు. సోమవారం ఆరు లక్షల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న జంక్షన్‌ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్లు ఆకుల పద్మ ప్రకాశ్, కోల మాలతి సంపత్, గుగ్గిళ్ల జయశ్రీ,నేతికుంట యాదయ్య, నాయకులు గర్రెపల్లి సత్యనారాయణరావు, ఎడ్లమధు, అనురాస్‌కుమార్, నారదాసు వసంత్‌రావు పాల్గొన్నారు.

హరిత కరీంనగరే లక్ష్యం

- మేయర్ సునీల్‌రావు



మొక్కనాటి నీరు పోస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: కరీంనగర్‌ను హరిత నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు మేయర్ సునీల్ రావు అన్నారు. సోమవారం 16వ డివిజన్ పరిధిలోని బుల్ సెమెన్ సెంటర్ పట్టణ ప్రకృతి వనంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. వనాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ ఏటా హరితహారంలో భాగంగా ఆరు లక్షల మొక్కలు నాటి సంరక్షించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు నగర వ్యాప్తంగా చిట్టడవులు, పట్టణ ప్రకృతి వనాలతో పాటు వివిధ పద్ధతుల్లో ప్లాంటేషన్ చేసి, నగరానికి గ్రీన్‌కవర్ పెంచుతున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇళ్లల్లో పెంచేందుకు మూడు పండ్లు, మూడు పూల మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. పదిశాతం గ్రీన్ బడ్జెట్‌ను కేటాయించి హరితహారాన్ని విజయవంతం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ కు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం ఉత్తమ అవార్డును ప్రకటించిందన్నారు. సహాష్టి కృషితో ఈ అవార్డు దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్, కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో సీటు ఇప్పించండి సారూ..

- ప్రజావాణిని ఆశ్రయించిన విద్యార్థులు
- మొత్తం 195 ఫిర్యాదులు స్వీకరణ



ప్రజావాణిలో అర్జీదారులు

కరీంనగర్ అర్బన్: పాఠశాలలో విద్యనభ్యసించాల్సిన చిన్నారులు ప్రభుత్వ యంత్రాంగ కరుణ కోసం అర్రులు చాచారు. పేద విద్యార్థులమని, కుటుంబం గడవడమే కష్టంగా ఉందని వాపోయారు. తమకు హాస్టల్‌లో సీటు కల్పిస్తే చదువుకుంటామని కలెక్టర్‌ను ప్రాధేయపడ్డారు. ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్న తమకో దారి చూపాలని కన్నీటిపర్యంతమయ్యారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ హాస్టల్‌లను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దడంతో సంపన్నులు కూడా ప్రభుత్వ విద్య వైపే మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో పోటీ అనివార్యమవగా సీటు కల్పించాలని ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. ఇక పింఛన్లు, డబుల్ బెడ్ రూం, భూ సమస్యలు, దళితబంధుపై అర్జీలు రాగా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, సంయుక్త కలెక్టర్ నవీన్ నికోలస్‌లు అర్జీలు స్వీకరించారు.195 దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టరేట్ ఏవో జగత్‌సింగ్ తెలిపారు.


సీటు ఇప్పించరూ..



మాది చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి. రెక్కాడితేనే డొక్కాడే పరిస్థితి. నాకొక చెల్లె ఉంది. నేను మంచిగా చదువుకుని చెల్లెకు అండగా నిలువాలని ఉంది. ప్రభుత్వ హాస్టల్‌లో సీటు కోసం దరఖాస్తు చేస్తే సీటు రాలేదు. కలెక్టర్ సారూ దయచూపి సీటు కల్పిస్తారని అమ్మతో కలిసి వచ్చిన.

– కనవేని శివచరణ్, విద్యార్థి


నాన్న వదిలేశాడు



అమ్మ, నాన్న ఉన్నంతలో మంచిగా చదివించారు. రెండేళ్ల క్రితం మా నాన్న వదిలేసి వెళ్లాడు. అమ్మ దివ్యనే అన్నీ చూసుకుంటోంది. ప్రైవేట్‌లో చదువుకునే స్తోమత లేదు. సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 5వ తరగతి కోసం ప్రవేశ పరీక్ష రాస్తే మొదటి జాబితాలో నా పేరు లేదు. కలెక్టర్ సారు నా చదువును కొనసాగించేలా చేయూతనిస్తారని వచ్చిన.

– నెల్లి అక్షయకీర్తి, శాయంపేట, జమ్మికుంట

85 శాతం వైకల్యం



కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాణ్ని. నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కుడికాలు కోల్పోయా. ఊతకర్రలు లేకుండా నడవలేని పరిస్థితి. సదరం సర్టిఫికెట్ తీసుకున్నా. 85శాతం వైకల్యమని ఇచ్చారు. ఇప్పటివరకు పింఛన్ మంజూరు కాలేదు. మూడేళ్లుగా తిరుగుతున్నా ఎవరూ కనికరించడం లేదు. నా భార్య కూలీ పని చేసి పిల్లలను, నన్ను సాకుతోంది.

– తూర్పాటి అశోక్, దుర్శేడ్, కరీంనగర్ రూరల్

బక్రీద్ శాంతియుతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ ఆర్వీ.కర్ణన్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

కరీంనగర్ అర్బన్/కరీంనగర్ కల్చరల్/కరీంనగర్: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకుందామని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్లో మతపెద్దలతో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ల పరిధిలోని ఈద్గాల వద్ద శానిటైజేషన్, లైటింగ్, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఆవులు, అనా రోగ్యంతో ఉన్న పశువులను వధించరాదని సూచించారు. జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని, 24 గంటలు పని చేస్తాయని వివరించారు. సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ అపోహలను సృష్టించే వాట్సాప్ మెసేజ్‌లను చూసి తొందరపడవద్దని అన్నారు. బక్రీద్‌ను ప్రశాంతంగా జరపుకోవాలన్నారు.

ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు ఓటరుగా పేరునమోదు చేసుకోవాలని కలెక్టర్ కర్ణన్ అన్నారు. జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపుకార్డులు అందించారు.

బాగా చదువుకోవాలి

ప్రభుత్వం పాఠశాలలను తీర్చిదిద్దిందని కలెక్టర్ అన్నారు. ధన్గర్‌వాడి పాఠశాలను తనిఖీ చేశారు. ఇంటరాక్టివ్ ప్యానెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని.. ప్రతీఒక్కరూ బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఈ సందర్భంగా సూచించారు.

ఈవీఎంల చెకింగ్‌కు ఏర్పాట్లు

ఎన్నికల క్రమంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల చెకింగ్‌కు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి పరిశీలించారు.

పర్లపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి

ఉత్తమ గ్రామపంచాయతీగా ఐఎస్‌వో–9001 అవార్డు పొందిన తిమ్మాపూర్ మండలం పర్లపల్లిని మిగిలిన గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సోమవారం తనచాంబర్‌లో పర్లపల్లి సర్పంచ్ మాదాడి భారతి నర్సింహారెడ్డి, ఎంపీపీ కేతిరెడ్డి వనిత, ఎంపీడీవో రవీందర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

సమాన స్కాలర్‌షిప్ వర్తింపజేయాలి



విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఇస్తున్న పద్ధతిలోనే ఇంటి నుంచి కళాశాలలకు వచ్చేవారికి సమాన స్కాలర్‌షిప్ వర్తింపజేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ కోరారు. ఈ మేరకు సోమవారం బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బూర వెంకటేశ్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత వసతి కల్పిస్తూ భోజన ఖర్చుల నిమిత్తం ప్రతినెలా ఒక్కొక్కరికి రూ.1,500 ఖర్చు చేస్తోందన్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారికి రూ.500 మాత్రమే వెచ్చిస్తోందని పేర్కొన్నారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్కాలర్‌షిప్ చెల్లించాలని విన్నవించారు.

జాతీయ వాటర్ పోలో పోటీలకు ఎంపిక



సాయితేజ



శ్రీజ

కరీంనగర్ స్పోర్ట్స్: బెంగళూరులో ఈ నెల 21 నుంచి 25 వరకు జరగనున్న సీనియర్స్ వాటర్ పోలో పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు కరీంనగర్ డీవైఎస్‌వో కీర్తి రాజవీరు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన కీర్తి సాయితేజ (కరీంనగర్), టి.శ్రీజ (గోదావరిఖని)లు తెలంగాణ జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారిని స్విమ్మింగ్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరావు, కృష్ణమూర్తి, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పలు క్రీడా సంఘాల బాధ్యులు సీహెచ్.సంపత్‌రావు, గిన్నె లక్ష్మణ్, ఉపేందర్‌రావు, రమేశ్ రెడ్డి, యూనిస్ పాషా అభినందించారు.

డ్యాం గుంతలో మునిగి బాలుడి మృతి

కొత్తపల్లి(కరీంనగర్): చింతకుంట శివారు మానేరు డ్యాం గుంతలో మునిగి, ఓ బాలుడు మృతి చెందినట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా చింతకానికి చెందిన ఓర్సు అరవింద్‌కుమార్(14) కుటుంబం కరీంనగర్‌లోని రాంనగర్‌లో ఐదేళ్లుగా నివాసం ఉంటోంది. అందరూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సోమవారం అరవింద్‌కుమార్ స్నానం చేసేందుకు డ్యాంలో దిగగా గుంతలో మునిగి, ఊపి రాడక మృతి చెందాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం.. జాగ్రత్త

- పాఠశాలల పూర్తి సమాచారం తెలుసుకోండి
- అనుమతులు, వసతులున్నాయా చూడండి
- కరీంనగర్‌తోపాటు జిల్లాలోని పట్టణాల్లో అనేక ట్యాగ్‌లైన్లతో స్కూళ్లు



కరీంనగర్: కరీంనగర్‌తోపాటు జిల్లాలోని పలు పట్టణాల్లో గల పాఠశాలల్లో అడ్మిషన్ల హడావుడి మొదలైంది. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లా అంతటా సీబీఎస్‌ఈ, సాధారణ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ, ఫస్ట్ క్లాస్‌లకు అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఈ తరగతులనే మరికొంత మంది పీపీ–1, పీపీ–2, ఫస్ట్ స్టాండర్డ్ అని పిలుస్తూ ప్రవేశాలు కల్పిస్తున్నారు. కరీంనగర్‌లో ట్యాలెంట్, కాన్సెప్ట్, ఇంటర్నేషనల్, ఒలింపియాడ్, వరల్డ్ లెవెల్, నేషనల్ అనేక రకరకాల ట్యాగ్‌లైన్లతో పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో కొన్నింటికి ప్రభుత్వ అనుమతులు ఉండగా, మరికొన్ని బ్రాంచిల పేరుతో కొనసాగుతున్నాయి. ఇంకొన్నింటికి అసలు అనుమతులు లేవన్నది కఠోర వాస్తవం. ఇదిలా ఉండగా తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్లలో చేర్పించేందుకు సిద్ధమవుతున్నారు. అడ్మిషన్లు, ఇంటర్వ్యూలు, రిటన్ టెస్ట్‌లు, డొనేషన్లు అంటూ ఆయా పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులను తమ చుట్టూ తిప్పుకుంటున్నాయి.

రిజిస్ట్రేషన్ వేరు...రికగ్నైజేషన్ వేరు

ప్రతీ పాఠశాల ప్రభుత్వం నుంచి కచ్చితంగా రికగ్నైజేషన్ పొందాలి. ఇది నిబంధన. కానీ చాలా స్కూళ్ల బోర్డులు చూసినా, ప్రకటనలు ఇచ్చినా వాటిలో గవర్నమెంట్ రిజిస్టర్డ్ అని రాస్తుంటారు. రిజిస్టర్ ఎవరైనా చేసుకోవచ్చు. కానీ విద్యాశాఖ నుంచి రికగ్నైజేషన్ తీసుకున్న బడిలోనే పిల్లలను చేర్పించాలి. సర్కారు నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకున్నా పాఠశాలల నిర్వాహకులు ఇతర స్కూళ్ల తరఫున విద్యార్థులను పరీక్షల్లో కూర్చోబెడతారు. ఈ విధంగా పరీక్ష రాసిన వారిని ప్రభుత్వం ప్రైవేట్ విద్యార్థిగానే పరిగణిస్తుంది. ఇక బ్రాంచిల పేరుతో పాఠశాలలు నడిపితే వాటికి విద్యాశాఖ అనుమతి ఉందా.. లేదా చూసుకోవాలి. సీబీఎస్‌ఈ అనుమతి ఉందన్న వారు కూడా తమ అనుమతి పత్రాలను నోటీసు బోర్డులో ఉంచాల్సిన అవసరం ఉంది.

వీలైనంత ఎక్కువ ప్రచారం..

పాఠశాలల నిర్వాహకులు అడ్మిషన్లు పెంచుకునేందుకు వీలైనంత ఎక్కువ ప్రచారం చేస్తుంటారు. మా పాఠశాలలో ఫలానా సౌకర్యాలు ఉన్నాయని, ప్రత్యేక తర్ఫీదు ఇస్తామని, ప్లే గ్రౌండ్ ఉందని, ఇతరత్రా విషయాలు చెబుతుంటారు. వీటి విషయంలో చాలా కచ్చితంగా ఉండాలి. క్రీడా మైదానాలు లేని పాఠశాల జోలికి, అపార్ట్‌మెంట్లు, ఇరుకు సందుల్లో ఉన్న స్కూళ్ల చెంతకు వెళ్లకుండా ఉంటే మంచిది. నేటికీ టాయిలెట్స్ కూడా సరిగా లేని ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటి విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి.

క్వాలిఫైడ్ టీచర్లేనా?

ఇక కొన్ని పాఠశాలల్లో టీచర్లు క్వాలిఫైడ్ కాకున్నా అలా నడిపిస్తుంటారు. ఉన్నత తరగతుల విద్యార్థులకు కూడా డిగ్రీ, ఇంటర్ ఫెయిలైన టీచర్లతో చదువు చెప్పిస్తుంటారు. స్కూళ్లలో విద్యాబోధనకు బీఈడీ చదివిన వారు, పీజీ చేసినవారు ఉండాలి. ఇది నిబంధన కూడా. వీరి విషయంలో కొన్ని పాఠశాలలు కచ్చితంగా నిబంధనలు పాటిస్తున్నాయి. మరికొన్ని వాటిని పక్కనబెట్టి ఇంటర్, డిగ్రీ ఫెయిలైన వారితో పాఠాలు చెప్పిస్తున్నాయి. అడ్మిషన్ సమయంలో ఆయా వివరాలను కచ్చితంగా అడగాలి.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

కరీంనగర్: తెలంగాణ మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్నూరుకాపులు 40 లక్షల మందికి పైగా ఉన్నారని తెలిపారు. వారందరూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, వీరిలో ఎక్కువ మంది కూలి పనులు చేసుకుంటున్నారని అన్నారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఏటా రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో మున్నూరుకాపు విద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణం కోసం ఎకరం స్థలం, రూ.2 కోట్లు ఇవ్వాలన్నారు. కోకాపేటలో ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల భూమి, రూ.5 కోట్లు సరిపోవడం లేదని జనాభా దామాషా ప్రకారం వాటిని రెట్టింపు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బొల్లం లింగమూర్తి , దామెర కొండ సంతోష్‌కుమార్, తోట కోటేశ్, వరప్రసాద్ బట్టు, పెంట అజయ్ పటేల్, అనారసు కుమార్, బోనాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విద్యానగర్(కరీంనగర్): గీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సర్వాయి పాపన్న మోకు దెబ్బ కరీంనగర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు వడ్లకొండ అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్యం ప్రమాదం అంచుల్లోకి వెళ్లి, వచ్చే గీత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడం లేదన్నారు. ప్రమాదవశాత్తు తాటి చెట్ల పైనుంచి పడి మరణించిన వారి కుటుంబాలకు వారంలోగా ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాటివనాలు ఊరికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉంటాయి కాబట్టి వారికి ద్విచక్రవాహనాలు ఇవ్వాలన్నారు. రెండేళ్ల క్రితం పంపిణీ చేస్తామని వివరాలు సేకరించిన ఎక్సైజ్ అధికారులు ఇప్పటివరకు అందజేయలేదని పేర్కొన్నారు. తాటిచెట్టు పైనుంచి పడి అంగవైకల్యం పొందిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. సర్వాయి పాపన్న మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి జాగిరి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఉద్యోగుల సమస్యలు తీర్చండి

- టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్: రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను తీర్చాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. సోమవారం జిల్లా రిజిస్ట్రార్ జేరిపోతుల ప్రసూనను కలిసి, వినతిపత్రం అందించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉద్యోగులు పలు సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, జిల్లా నాయకులు రాజేశ్వర్‌రావు, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు తమ్మాడి పీటర్, కార్యదర్శి కేతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, భాస్కర్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: ఢిల్లీలో తలకటోరా ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన ఆలిండియా ఓపెన్ ఇంటర్నేషనల్–2023 కరాటే చాంపియన్‌షిప్‌లో కరీంనగర్ ఆర్‌ఆర్ కరాటే అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించినట్లు అకాడమీ చీఫ్ గౌరు రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 16 మంది కటా, కుమిటీ విభాగాల్లో పాల్గొనగా 8 మంది పతకాలు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సాత్విక్, మృదుల్, రామ్‌చరణ్, సిద్ధార్థ్, ఆకాశ్, ఆర్యన్, రేశ్వంత్, లాస్య శ్రీలు 2 బంగారు, ఒక రజత, 7 కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. తొలిసారి మన దేశంలో నిర్వహించిన ఈ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను హైకోర్టు న్యాయమూర్తులు ఎంజీ.ప్రియదర్శిని, అనుపమ చక్రవర్తి, కరీంనగర్ జడ్జి బి.ప్రతిమ, సబ్ జడ్జి అరుణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్ అభినందించారు.

డాక్టర్ ఆజమ్‌కు రాష్ట్రపతి అభినందన



రాష్ట్రపతి ముర్ముకు వివేకానంద చిత్రపటం ఇస్తున్న ఆజమ్


సప్తగిరికాలనీ(కరీంనగర్): సామాజిక సేవకుడు, కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన డాక్టర్ మహమ్మద్ ఆజమ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. ఈ నెల 16న ఆమె రాష్ట్ర పర్యటనకు రాగా ఆజమ్ రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి, స్వామి వివేకానంద చిత్రపటాన్ని అందించారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తాను స్వామి వివేకానంద స్ఫూర్తితో సేవా మార్గాన్ని ఎన్నుకున్నానని, 20 ఏళ్లుగా గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, విద్య, యువజన చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని రాష్ట్రపతికి వివరించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ఆదర్శంగా తీసుకొని, విలువలతో జీవిస్తూ, దేశాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్రపతి సూచించారని ఆజమ్ తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో రాణించాలి



కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్, అండర్–13 చెస్ పోటీలను విజయవంతం చేయాలని జెడ్పీ సీఈవో ప్రియాంక అన్నారు. సంబంధిత వాల్ పోస్టర్‌ను సోమవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మేధస్సుకు పదును పెట్టే చదరంగం క్రీడలో జిల్లా క్రీడాకారులు రాణించి, పతకాలు సాధించాలని సూచించారు. జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు రూ.50 వేల నగదు బహుమతులతోపాటు 32 ట్రోఫీలు అందించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ కంకటి కనకయ్య, టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనూప్ తెలిపారు. కార్యక్రమంలో వి.అనూష్‌కుమార్, కుమార్, అరుణ్, కంకటి సృజన్, తరుణ్ పాల్గొన్నారు.

కాలిఫోర్నియా విద్యార్థుల వ్యవ'సాయం'



కరీంనగర్ అర్బన్: వ్యవసాయంలో సాయపడేందుకు కాలిఫోర్నియా విద్యార్థులు ముందుకొచ్చారు. జిల్లాలో పలు గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక యంత్రాలతో బాసటగా నిలువనున్నారు. సోమవారం యూనివర్సిటీ కాలిఫోర్నియా ప్రతినిధి స్టీవెన్ జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. పీహెచ్‌డీలో భాగంగా సాగుపై అధ్యయనంతో పాటు సేవలందించనున్నారు. ఈ క్రమంలో జిల్లాలో వానాకాలం సీజన్‌లో పలు గ్రామాలను ఎంపిక చేసి డ్రమ్ సీడర్ ద్వారా వరి సాగు చేసేలా ప్రోత్సహించాలని నిర్ణయించారు. గత సంవత్సరం 50కి పైగా గ్రామ పంచాయతీలకు 2 డ్రమ్ సీడర్లను అందజేశారు. డ్రమ్ సీడర్ల వినియోగించడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సారి అదే విధంగా కొత్త గ్రామాల్లో చేయనున్నారు.

లిబియాలో చొప్పదండివాసి ఆత్మహత్య

- అప్పుల బాధే కారణమన్న స్థానికులు



చొప్పదండి: పట్టణానికి చెందిన తాళ్లపల్లి మోహన్ లిబియా దేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లు బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందింది. బతుకుదెరువు కోసం వలస వెళ్లిన అతను అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు తెలిపారు. మృతదేహం కోసం కుటుంబీకులు ఎదురు చూస్తున్నారు. మోహన్ కుటుంబసభ్యులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం సోమవారం పరామర్శించారు. రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్ తదితరులున్నారు.

అంబాల్‌పూర్‌లో మహిళ హత్య



ఎల్లవ్వ మృతదేహం

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని అంబాల్‌పూర్‌కు చెందిన మొలుగూరి ఎల్లవ్వ(68) హత్యకు గురైంది. ఆమె బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన దామెర రాజేశ్వరి ఆదివారం రాత్రి ఎల్లవ్వ ఇంటికి వెళ్లింది. రాజేశ్వరి భర్త మొండయ్య కోపంతో అక్కడికి వచ్చి, ఎల్లవ్వ కొడుకులతో గొడవ పడ్డాడు. మధ్యలో వచ్చిన ఎల్లవ్వ తలపై బండరాయితో కొట్టాడు. గాయపడిన ఆమెను వెంటనే 108 వాహనంలో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు. మృతురాలి కుమారుడు మల్లేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని చింతకుంట శాంతినగర్‌కు చెందిన తమ్మడవేని రాజ్‌కుమార్ మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. కరీంనగర్‌లోని ఓ గ్లాస్ ఎంపోరియంలో పని చేస్తున్న రాజ్‌కుమార్ సోమవారం ఇంట్లో భార్యతో గొడవ పడ్డాడు. మద్యం తాగి, ఆ మత్తులో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెడ్డి యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడిగా అనిల్ రెడ్డి



విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ స్టేట్ రెడ్డి యూత్ ఆర్గనైజేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా వోరం అనిల్ రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి అశోక్‌రెడ్డి నియమించారు. సోమవారం కరీంనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయనకు నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వేముల సుదర్శన్ రెడ్డి, నాయకులు కాల్వ పూర్ణచందర్ రెడ్డి, చింతలపెల్లి సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, కాంతాల తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆ ప్రైవేట్ స్కూళ్ల రిజిస్ట్రేషన్ రద్దు చేయండి'



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ స్కూళ్ల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని డీవైఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందిన కాడికి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. యూనిఫామ్, బుక్స్, టై, షూస్ ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు అమ్ముతున్నారని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారని అన్నారు. 15 ఏళ్లుగా కొన్ని స్కూళ్లలో బోధన, బోధనేతర సిబ్బందికి పీఎఫ్ జమ చేయకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి, చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, అజయ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల కోసమే కేబుల్ బ్రిడ్జి

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్



మాట్లాడుతున్న నగేశ్, పక్కన నాయకులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మానేరు నదిపై కేబుల్ బ్రిడ్జిని బీఆర్‌ఎస్ నాయకుల రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే నిర్మించారని, దీనివల్ల ప్రజలకు ఎలాంటి లాభం లేదని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కె.నగేశ్ ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిడ్జికి, రివర్ ఫ్రంట్‌కు చేస్తున్న ఖర్చును ఆపితే వేలాది మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి, ఇవ్వవచ్చన్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా అభివృద్ధి పేరిట కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ ప్రజాసంక్షేమ పాలన మరిచి, కుటుంబ సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వస్తే ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఎండీ.మీర్జాబేగ్, ఎస్కే.జావీద్, శివరాం, ఊకంటి రవీందర్ రెడ్డి, పోలు శ్రీనివాస్, కె.ఆంజనేయ గుప్త, జాగిరి శ్రీనివాస్, మేదరి స్వరూప, అంజలి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నేరస్తుడికి 14 ఏళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: ఓ వృద్ధురాలిని అత్యాచారంతోపాటు హత్య చేసిన కేసులో నేరస్తుడికి 14 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా మొదటి అదనపు జడ్జి శ్రీవాణి తీర్పునిచ్చారు.. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2016 సెప్టెంబర్ 10న మానకొండూర్ మండలం నిజాయితీగూడెంకు చెందిన గడ్డి కనకవ్వ(65) రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన కాల్వ రాజు ఆమెపై అత్యాచారం చేసి, గొంతు నులిమి హత్య చేశాడు. తర్వాత కాల్వ శ్రీనివాస్, కొమురమ్మల సహకారంతో మృతదేహంపై దుప్పటి కప్పి, వెళ్లిపోయాడు. మరుసటి రోజు కనకవ్వ బయటకు రాకపోవడం, ఎన్నిసార్లు పిలిచినా పలకకపోవడంతో స్థానికులు ఆమె కోడలికి సమాచారం ఇచ్చారు. వచ్చి, చూడగా కనకవ్వ చనిపోయి ఉంది. ఆమె కోడలి ఫిర్యాదు మేరకు మానకొండూర్ పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నేరస్తుడు రాజుకు సోమవారం శిక్ష ఖరారు చేశారు. శ్రీనివాస్, కొమురమ్మలకు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.1,000 చొప్పున జరిమానా విధించారు.

కుల, ఆదాయ సర్టిఫికెట్లకు బారులు



హుజూరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట దరఖాస్తుదారులు

హుజూరాబాద్: బీసీ బంధు పథకం కోసం కుల, ఆదాయ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసి, రోజులు గడుస్తున్నా రాకపోవడంతో వందలాది మంది దరఖాస్తుదారులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బారులు తీరారు. తమకు ధ్రువపత్రాలు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నారంటూ కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కన్నా ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్న కొందరికి త్వరగా ఇస్తున్నారని ఆరోపించారు. మంగళవారమే బీసీ బంధు పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అని, తహసీల్దార్ స్పందించి, కుల, ఆదాయ సర్టిఫికెట్లు తొందరగా వచ్చేలా చూడాలని కోరారు. ఓవైపు సర్వర్ పని చేయకపోవడం, మరోవైపు సిబ్బంది అలసత్వం వల్ల సర్టిఫికెట్లు అందడం ఆలస్యమవుతోందని, పథకానికి దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించాలని అన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు వినియోగించుకోవాలి



కేక్ కట్ చేస్తున్న డీఆర్‌ఎం చందర్‌రావు

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలని డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) చందర్‌రావు పేర్కొన్నారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాలు ప్రారంభించి మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా సోమవారం కరీంనగర్ బస్టాండులోని లాజిస్టిక్స్ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. లాజిస్టిక్స్ సెంటర్ ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలతోపాటు త్వరలోనే నగరంలో డోర్‌డెలివరీ సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. లాజిస్టిక్స్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ బి.శ్రీనివాస్, కరీంనగర్ 1,2 డిపోల మేనేజర్లు ప్రణీత్, శివప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్, బుచ్చయ్య, లాజిస్టిక్స్ ఇన్‌చార్జి జి.రాజు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ విద్యాదినోత్సవం

కరీంనగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు విద్యాదినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్వీ కర్ణన్, డీఈవో జనార్దన్‌రావులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ


పనులు ప్రారంభిస్తున్న సత్యం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో పద్మశాలీ సంఘం కమ్యూనిటీ హాల్ ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, పద్మశాలీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిమల్ల శ్రీకాంత్, ఆర్థిక కార్యదర్శి నందాల తిరుపతి, మండల అధ్యక్షుడు దూడం మల్లేశం, నాయకులు వెంకటేశం, బోగ రాజ్‌కుమార్, గౌడ నర్సయ్య, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

‘అచీవర్స్’లో అంతర్జాతీయ నాన్నల దినోత్సవం



కరీంనగర్: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ నాన్నల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ‘నాన్నతో నేను’ పేరున చిన్నారులతో వైవిధ్యంగా చిత్ర ప్రదర్శన చేశారు. చిన్నారులందరూ తమ తమ నాన్నలతో కలిసి ఉన్న ఫొటోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ కుటుంబంలో నాన్న చాలా ప్రముఖమైన వ్యక్తి అని, తండ్రి తాను కష్టపడి పనిచేసి సంపాదిస్తూ కుటుంబాన్ని పోషిస్తాడని అన్నారు. ప్రతిఒక్కరూ తండ్రిని సంవత్సరానికి ఒకరోజు గౌరవించుకోవడం కాదని ప్రతిరోజూ గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘వీడియో జర్నలిస్ట్‌పై దాడి అమానుషం’

విద్యానగర్(కరీంనగర్): మంత్రి కేటీఆర్ వరంగల్ పర్యటన సందర్భంగా శనివారం విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు, వీడియోగ్రాఫర్లపై కొందరు పోలీసులు దాడి చేయడం అమానుషమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) దాడుల నివారణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అయిలు రమేశ్ అన్నారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు మాదిరిగానే జర్నలిస్టులు కూడా తమ విధుల నిర్వహణలో భాగస్వామ్యం అవుతున్నారనే విషయాన్ని సంబంధిత పోలీసు అధికారులు గుర్తించాలన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జర్నలిస్టులపై ఏసీసీ స్థాయి అధికారి అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా సెల్‌ఫోన్ లాక్కొని వీడియో డిలిట్ చేయడం సరైంది కాదన్నారు. వీడియో జర్నలిస్టు వెంకట్‌పై కూడా ఎస్సై స్థాయి అధికారి దాడికి దిగడాన్ని ఖండించారు. ఇప్పటికైనా ఇలాంటి విషయాలపై సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు స్పందించి జర్నలిస్టులపై అమర్యాదగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఐని మర్యాదపూర్వకంగా కలిసిన టీఏవైఎస్ నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కరీంనగర్: కరీంనగర్‌రూరల్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రదీప్‌కుమార్‌ను, త్రీటౌన్ పోలీసుస్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌లను తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, నాయకులు గజ్జెల ఆనందరావు, సుద్దాల లక్ష్మణ్, మీసాల సాయిలు, మామిడిపల్లి కృష్ణ, ఎర్రోళ్ల ప్రశాంత్, చామనపల్లి చంద్రశేఖర్, గండి గణేశ్, కాసారం కిరణ్, లింగంపల్లి వెంకటేశ్, సముద్రాల లక్ష్మణ్, కేశవేణి రవీందర్ పాల్గొన్నారు.

శాకాంబరీ ఉత్సవాలు

విద్యానగర్(కరీంనగర్):కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో ఆషాఢమాసం శాకాంబరీ ఉత్సవాలు ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీదుర్గాభవానీ అమ్మవారిని పుదీనా మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతులిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో ఆలయఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మీ ఇంట్లో ఎంత మంది ఉన్నారు..?

- ఆరు ఓట్ల కన్నా ఎక్కువగా ఉంటే ఆరా
- క్షేత్రస్థాయిలో బీఎల్‌వోల విచారణ


చేగుర్తిలో సర్వే చేస్తున్న బీఎల్‌వో

కరీంనగర్‌రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారయంత్రాంగం చర్యలు చేపట్టింది. గతంలో ఆధార్ లింకేజీ, రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే తొలగించిన అధికారులు ప్రస్తుతం ఇంటి నంబరు ఆధారంగా ఓటరు జాబితాను జల్లెడ పడుతున్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. బోగస్ ఓట్లను జాబితా నుంచి తొలగిస్తున్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,21,782 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,61,777, మహిళలు 1,59,982, ట్రాన్స్‌జెండర్లు 23 మంది ఉండగా 390 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. కరీంనగర్‌అర్బన్, కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాలు, కొత్తపల్లి మున్సిపాలిటీలో గతనెల 25వ తేదీ నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే ద్వారా బోగస్ ఓటర్లను గుర్తించి తొలగిస్తున్నారు. ఈనెల 23 వరకు ఇంటింటి సర్వే పూర్తి చేయాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు సర్వేను ముమ్మరం చేశారు.

ఆరు ఓట్ల కన్నా ఎక్కువ ఉంటే విచారణ

అధికారులు దశలవారీగా బోగస్ ఓట్లను తొలగిస్తున్నారు. ప్రస్తుతం ఒకే ఇంటి నంబరులో ఎక్కువ మంది ఓటర్ల పేర్లు జాబితాలో ఉండటంతో ఎన్నికల సంఘం సవరణ దిశగా చర్యలు చేపట్టింది. ఒకే ఇంటి నంబరులో ఆరు కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న వివరాలను సేకరించింది. జాబితాలోని ఓటర్ల వివరాలను బీఎల్‌వోలు ఇంటింటికీ తిరుగుతూ విచారణ చేస్తున్నారు. ఓటర్లుగా నమోదు చేసుకున్న వారు ఆ ఇంట్లో ఉంటున్నారా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

కరీంనగర్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు
కొత్తపల్లి	24,418	24,770	01
కరీంనగర్‌రూరల్	23,557	23,683	02
కరీంనగర్‌అర్బన్	11,3802	1,11,529	20

కరీంనగర్ కార్పొరేషన్‌లోనే అసలు సమస్య

ప్రస్తుతం బీఎల్‌వోలు చేపట్టిన ఇంటింటి సర్వేలో కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాల్లో పెద్దగా ఇబ్బందులు తలెత్తడం లేదు. వలస వెళ్లిన, మృతి చెందిన, అద్దెకు ఉండి వెళ్లిన వారి వివరాలు గ్రామీణుల నుంచి వెంటనే వస్తున్నాయి. అయితే కరీంనగర్ కార్పొరేషన్‌లోనే ఇంటింటి సర్వే బీఎల్‌వోలకు కత్తిమీద సాములా మారింది. కొన్ని చోట్ల ఒకే ఇంటి నంబరుపై 20 మందికిపైగా ఓటర్లున్నారు. ప్రధానంగా కొన్ని వర్గాలు నివాసముంటున్న ప్రాంతాల్లో ఎక్కువ మంది ఒక్కటే ఇంటి నంబరుపై ఓటర్లుగా ఉంటున్నారు. ఈ ఓటర్లను గుర్తించి తొలగించేందుకు బీఎల్‌వోలు పడరాని పాట్లు పడుతున్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల నుంచి ఒత్తిళ్లు రావడంతో బోగస్ ఓట్ల గుర్తింపు నామమాత్రంగానే నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

చివరి దశలో ఇంటింటి సర్వే

బోగస్ ఓటర్ల గుర్తింపు కోసం చేపట్టిన ఇంటింటి సర్వే చివరిదశకు చేరుకుంది. పోలింగ్‌స్టేషన్ల వారీగా బీఎల్‌వోలు పకడ్బందీగా సర్వే చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 23 వరకు సర్వే పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాం.

– రజనీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ, సూపర్‌వైజర్

నాటిన మొక్కలను సంరక్షించాలి


నగునూరులో మొక్క నాటుతున్న ఎంపీపీ లక్ష్మయ్య


చెర్లభూత్కూర్‌లో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కరీంనగర్ మండలంలో హరితోత్సవం నిర్వహించారు. నగునూరులో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు వినయ్‌సాగర్, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శోభరాణి తదితరులు పాల్గొన్నారు. చెర్లభూత్కూర్, దుర్శేడ్‌లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచులు దబ్బెట రమణారెడ్డి, గాజుల వెంకటమ్మ, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, పంచాయతీ కార్యదర్శులు వాహెద్, సంజీవరెడ్డితో పాటు పలువురు వార్డుసభ్యులు పాల్గొన్నారు. గోపాల్‌పూర్, చేగుర్తి గ్రామాల్లో జరిగిన హరితోత్సవంలో ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. వర్షాలు కురువకపోవడంతో పాటు ఎండ తీవ్రతకు హరితోత్సవంలో ఊరికి 20 మొక్కల చొప్పున 17 గ్రామాల్లో మొత్తం 340 మొక్కలు మాత్రమే నాటినట్లు ఎంపీడీవో తెలిపారు.

కొత్తపల్లిలో హరితోత్సవం

కొత్తపల్లి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొత్తపల్లి పట్టణంలోని మెగా ప్లాంటేషన్ వద్ద సోమవారం హరితోత్సవంలో మొక్కలు నాటారు. సెయింట్ జార్జ్ విద్యార్థులతో కలిసి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు మొక్కలు నాటారు.

పద్యం బతికితేనే సంస్కృతి బతుకుతుంది


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శ్యాంప్రసాద్‌లాల్, కవులు

కరీంనగర్‌కల్చరల్: పద్యం బతికితేనే సంస్కృతి బతుకుతుందని, ఆ సంస్కృతి జీవన సారమని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. తెలుగు పద్య కవితా సదస్సు ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని బ్రాహ్మణ సంఘంలో నిర్వహించిన సాహితీరత్న లక్ష్మణరావు రచించిన ‘శ్రీశివ’ గ్రంథావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కరీంనగర్ తెలుగు పద్యం పట్టిన గడ్డ అని, వేములవాడ చాళుక్యుల కాలంలో జీనవల్లభుడు రచించిన కంద పద్యాలు కరీంనగర్ జిల్లాలోని బొమ్మలమ్మగుట్టపై శాసనంగా చెక్కబడ్డాయని అన్నారు. ఆ పద్యాలే తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి కారణమయ్యాయని తెలిపారు. పద్య కవితా సదస్సు అధ్యక్షుడు రామక విఠల్‌శర్మ సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కవులు గిరిజా మనోహర్‌బాబు, నేదునూరి వామన్‌రావు, కల్వకుంట్ల రామకృష్ణ, జి.లక్ష్మీనారాయణ, దాస్యం సేనాధిపతి, జీవీ కృష్ణమూర్తి, గాజుల రవీందర్, కేఎస్ అనంతాచార్య, రాజా రామ్మోహన్‌శర్మ, బీఎస్ ఆర్.శర్మ, కొత్త అనిల్, స్తంభంకాడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



కరీంనగర్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని వివేకానంద ప్రైవేటు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ రాకేశ్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ప్రభుత్వ నియమనిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోలేదని,, పాఠశాలలో పుస్తకాలు అమ్ముతూ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్థానికంగా ఉన్న డీఈఓ అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాల పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. పుస్తకాలు అమ్ముతున్నారని ఆధారాలతో సహా బయటపెట్టినా చర్యలు తీసుకోవడం లేదని, ప్రైవేట్ పాఠశాలలపై డీఈవో వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. ఇకనైనా అధికారులు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి విష్ణు, జోనల్ ఇన్‌చార్జిలు నందు, నితీష్, శ్రీవర్ధన్, నగర సంయుక్త కార్యదర్శులు అరుణ్, రాకేశ్, సంహిత్, నగర కార్యకర్తలు అబ్దుల్, సాయి పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై ‘పొన్నం’ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం


మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

కరీంనగర్‌టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ రాజకీయాలు ప్రజలందరికీ అర్థమయ్యాయని, అందుకే పలు ఎన్నికల్లో ఆయనకు డిపాజిట్ కూడా రాలేదని, ప్రజలు తిరస్కరిస్తున్నారనే విషయం గుర్తుపెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు. బండి సంజయ్ ఖర్చంతా గంగుల కమలాకర్ భరిస్తున్నారని, ఈటల రాజేందర్‌కు ప్రాధాన్యం తగ్గించడానికే పాదయాత్ర చేస్తున్నారని పొన్నం ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కొరటాల శివరామకృష్ణ, బండ రమణారెడ్డి, ఖచ్చు రవి, పాదం శివరాజ్, అవదుర్తి శ్రీనివాస్, మునిగంటి కుమార్, ఉప్పరపెల్లి శ్రీనివాస్, ఇసపెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష సాయంలో పద్మశాలీలను చేర్చాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పద్మశాలీ సంఘ నాయకులు

కరీంనగర్: కుల వృత్తుల వారికి ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం జాబితాలో పద్మశాలీలను చేర్చాలని డిమాండ్ చేస్తూ చేనేత ఐక్య వేదిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చేనేత వృత్తిదారులు నిరాధరణకు గురవుతున్నారని, వారికి ప్రోత్సాహకాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. చేయూత పథకంలో వారిని చేర్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిపల్లి సదానందం, పద్మశాలీ సంఘం జిల్లా సమన్వయకర్త అడిశర్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మంచికట్ల కొటేశ్వర్, ప్రధాన కార్యదర్శి అడిచెర్ల రాజు, కరీంనగర్ పట్టణ పద్మశాలీ సంఘం ప్రచార కార్యదర్శి పోరండ్ల రమేశ్, ఐక్య వేదిక ప్రచార కార్యదర్శి జెడల చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కరీంనగర్‌రూరల్: తెలంగాణలో మున్నూరుకాపు కార్పొరేషన్ చేయాలని కోరుతూ సోమవారం మున్నూరుకాపు సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతీ సంవత్సరం రూ.5వేల కోట్లను కేటాయించాలని, 33 జిల్లాల కేంద్రాల్లో విద్యార్థులకు హాస్టల్ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మడికంటి మారుతి, ప్రతినిధులు చెట్టి శ్రీనివాస్, నాయిని సత్యనారాయణ, చిందం మల్లయ్య, చింతల లక్ష్మణ్, మాసం సుధాకర్, మారుతీశ్వర్, ఆరె శ్రీకాంత్, ర్యాకం మోహన్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలగందుల సర్పంచ్‌కు ‘ఉత్తమ హరిత సేవా పత్రం’


మంత్రుల చేతుల మీదుగా సేవా పత్రం తీసుకుంటున్న సర్పంచ్ షర్మిల

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల సర్పంచ్ ఎర్రండి షర్మిల ఉత్తమ హరిత సేవా పత్రం అందుకున్నారు. బృహత్ పల్లె ప్రకృతివనం, ఈత వనం, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టి మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ వహించినందుకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోలను ప్రశంసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పత్రాలు అందించింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం రాత్రి జరిగిన హరితోత్సవంలో రాష్ట్ర అటవీశాఖ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా సర్పంచ్ షర్మిల, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మీ, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డిలు ఉత్తమ సేవా పత్రాలు అందుకున్నారు.

‘ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ చేయాలి’



మాట్లాడుతున్న సంద గణేశ్

కరీంనగర్: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలను డీఈవో పర్యవేక్షణ చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలను డీఈవో సందర్శించి వాటి వసతులపై, ఫీజులపై పర్యవేక్షణ చేయాలన్నారు. అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యావ్యాపారం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఈవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రాకేశ్, అర్జున్, రాంసాయి, నవీన్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ నగరశాఖ ఆధ్వర్యంలో ఇందిరాచౌక్ వద్ద సోమవారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఖార్ఖానగడ్డ వృద్ధాశ్రమంలో దండి రవీందర్, మెరాజ్ ఆధ్వర్యంలో పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. ఖరీముల్లాషా దర్గా వద్ద జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజ్, మైనారిటీ సెల్ నగర అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హౌసింగ్ బోర్డులోని వృద్ధాశ్రమంలో నెల్లి నరేష్, లయక్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అంజన్‌కుమార్, శ్రవణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, చర్ల పద్మ, బోనాల శ్రీనివాస్, గడ్డం విలాస్‌రెడ్డి, షబానా మహమ్మద్, పోరండ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో సోమవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, నాయకులు రాజిరెడ్డి, హరీశ్‌గౌడ్, వీరేశం, వినయ్, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, నర్సయ్య, రాయమల్లు, శేఖర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరు మృతి


వసుధ (ఫైల్)

తిమ్మాపూర్: భర్తతో గొడవపడి భార్య మృతిచెందిన ఘటన తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంలో చోటుచేసుకుంది. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరుకు చెందిన వసుధ (35) మొగిలిపాలెంకు చెందిన మో రపల్లి కొండల్ రెడ్డితో 15ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 13ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల వడ్లు అమ్మగా వచ్చిన డబ్బులతో కొండల్‌రెడ్డి బైక్ కొంటానని భార్యతో చెప్పాడు. దీంతో ఆమె అభ్యంతరం తెలిపి తాను చెవికమ్మలు తీసుకుంటానని భర్తతో చెప్పింది. దీంతో మాటమాట పెరిగి భర్త చేయి చేసుకున్నాడు. మనస్తాపం చెందిన వసుధ సోమవారం ఉదయం 11 గంటలకు ఇంట్లో కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. స్థానికులు గమనించి ఆమెను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై ప్రమోద్ రెడ్డి తెలిపారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

సప్తగిరికాలనీ(కరీంనగర్): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు జరుగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ విద్యార్థి కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. నాయకులు రమేశ్, రామారావు వెంకటేష్ హేమంత్, సాగర్, సాయి, ప్రణయ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోగా జగత్‌సింగ్

కరీంనగర్ అర్బన్: కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా జగత్‌సింగ్‌ను నియమించారు. ఇటీవలే కరీంనగర్ అర్బన్ తహసీల్దార్‌గా బదిలీ కాగా మళ్లీ డిప్యూటేషన్‌పై ఏవోగా నియమించారు. రెండు రోజులు ఏవోగా వ్యవహరించిన గడ్డం సుధాకర్‌ను పూర్వ స్థానం కరీంనగర్ అర్బన్‌కు డిప్యూటేషన్‌పై పంపారు. రెండు రోజుల్లోనే తిరిగి యథాస్థానాల్లో విధులు నిర్వహించడం గమనార్హం.

వినియోగదారుడికి న్యాయం జరగాలి

కరీంనగర్‌టౌన్: ప్రతీ వినియోగదారుడికి ఉత్పత్తిదారుల నుంచి న్యాయం జరిగే వరకు అఖిల భారతీయ గ్రాహక్ పంచాయతీ పోరాటం చేస్తుందని గ్రాహక్ పంచాయతీ రాష్ట్ర అధ్యక్షుడు బండి నరేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ తెలిపారు. సోమవారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సమాజంలో వినియోగదారుడు దారుణంగా మోసపోతున్నారని, కొనుగోలు చేసిన వస్తువు నాణ్యత లేకుండా పలు వ్యాపార సంస్థలు మోసం చేస్తున్నాయన్నారు. మోసపోయిన వినియోగదారుడికి న్యాయం ఎక్కడ పొందాలో తెలియని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. వినియోదారుల హక్కుల కోసం గ్రాహక్ పంచాయతీ సంస్థ పనిచేస్తుందన్నారు. వినియోగదారులకు సరైన న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తూ మోసం చేసిన సంస్థలకు శిక్ష పడే విధంగా తగిన పోరాటం చేస్తుందని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులకు అనేక అవగాహన తరగతులు నిర్వహించి జాగృతం చేస్తున్నామని తెలిపారు. సమావేశం అనంతరం గ్రాహక్ పంచాయతీ జిల్లా కన్వీనర్‌గా భగవాన్‌రెడ్డి, కోకన్వీనర్‌గా నాగమల్ల సురేష్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్తు వినియోదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. వినియోగదారున్ని చైతన్యపరిచే కార్యక్రమాలతో ముందుకు సాగుతామని తెలిపారు.


విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ చౌర్యం కేసులో ఓదెల మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన పూసల సాగర్‌కు కరీంనగర్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి.హేమంత్ కుమార్ రూ.26,320 జరిమానా విధించారని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారని అన్నారు. ఆయన వివరాల ప్రకారం.. సాగర్ తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తూ అధికారులకు పట్టుబడ్డాడు. వారు మొదటి నేరంగా పరిగణించి, రూ.1,000 జరిమానా విధించి, వదిలేశారు. అయినా అతను రెండోసారి విద్యుత్ చౌర్యానికి పాల్పడటంతో కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. అతను నేరాన్ని జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎదుట ఒప్పుకున్నాడు. దీంతో ఆయన సాగర్‌కు జరిమానా చెల్లించాలని లేదంటే మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని సోమవారం తీర్పు వెల్లడించారు. ఎస్సైలు ఎ.నిరంజన్‌రెడ్డి, టి.నరేష్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా...

అవినాశ్ రెడ్డి బెయిలు రద్దుపై విచారణ వాయిదా

- 3కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు
- కౌంటర్ల దాఖలుకు అవినాశ్, సీబీఐకి నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిలు రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. సునీత తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య తదనంతర పరిణామాలు, సీబీఐ దర్యాప్తు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ కావడం వంటి అంశాలను న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఈ నెల 30 నాటికి దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. అప్పటికల్లా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన అవినాశ్ రెడ్డి, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి ఆదేశాలు తీసుకొని సీజేఐ ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌తో ఈ పిటిషన్‌ను కూడా జత చేసి జూలై 3న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని కోర్టు ఆదేశించింది.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని పలు పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారిలో బీడ్ జిల్లా బీజేపీ కార్యదర్శి మయూరి ఖేద్కర్, ఔరంగాబాద్ జిల్లా ఎన్సీపీ కార్యదర్శి సతీష్ బచాటే, పుణే విధానసభ మాన్సే అధ్యక్షుడు చంద్రకాంత్ సిమ్లా, పుణే మాన్సే యువక్ ఆఘాడీకి చెందిన కళ్యాణ్ కుమార్, చిరంజీవి రాంరావు, జై భగవాన్ మహాసంఘ యువ తాలూకా అధ్యక్షుడు పరమేశ్వర్ కేదార్, సర్పంచ్‌లు మహాదేవ్ జవహరే, శరద్ సిర్సాట్, సంజయ్ కేదార్, గణేష్ జయభాయే, భగవాన్ జయభయే, విష్ణు సనప్, సంతోష్ బడే, అర్బాజ్ షేక్ తదితరులున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు మాణిక్ కదమ్ తదితరులున్నారు.

నా‘నో’ యూరియా!



లిక్విడ్ యూరియా వాడకంపై ఆసక్తి చూపించని రైతులు

- అర లీటర్ నానో యూరియా 45 కేజీల సాధారణ యూరియాతో సమానం
- భూసార పరిరక్షణ.. ధర తక్కువ..పంటల దిగుబడి ఎక్కువ
- అవగాహన కార్యక్రమాలకు సిద్ధమవుతున్న వ్యవసాయ అధికారులు

భూసారం దెబ్బతినదు. ధర తక్కువ.. లాభాలు కూడా ఎక్కువ. ఇలాంటి ప్రయోజనాలెన్నో ఉన్నా, నానో యూరియా వినియోగంపై రైతులు ఆసక్తి చూపించడం లేదు. నానో యూరియా వ్యవసాయ రంగంలోనే కొత్త విప్లవానికి నాంది అని ప్రభుత్వం, వ్యవసాయశాఖ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం దానికి ఆశించినంతగా ఆదరణ లభించడం లేదు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ వర్గాలు విఫలం కావడమే ఈ పరిస్థితికి కారణమనే విమర్శలు విన్పిస్తున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

లాభాలు ఎక్కువంటున్న శాస్త్రవేత్తలు

కేవలం అర లీటర్ లిక్విడ్ యూరియా (నానో).. 45 కేజీల సాధారణ యూరియాతో సమానం. సాధారణ ఘన రూపంలోని యూరియా కంటే నానో లిక్విడ్ యూరియాతో లాభాలు ఎక్కువ ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే ప్రస్తుతం రైతులు వినియోగిస్తున్న యూరియాతో భూమికి హాని జరగడంతో పాటు భూసారం తగ్గుతోందని పలు నివేదికలు తెలుపుతున్నాయి. దీంతో పాటు 45 కిలోల బరువుండే యూరియా బస్తాను ఎరువుల దుకాణం నుంచి పొలం వరకు తీసుకెళ్లడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఈ నేపథ్యంలో యూరియా వాడకాన్ని తగ్గిస్తూ, భూసారాన్ని దెబ్బతీయకుండా ఉండడంతో పాటు ఘన యూరియాతో పోల్చితే లాభాలు అధికంగా వచ్చేలా నానో యూరియా రూపుదిద్దుకుంది. అయితే దీనిపై రైతులు గందరగోళంలో ఉన్నారు. సాధారణ యూరియాకు అలవాటు పడడం వల్ల కూడా రైతులు నానో యూరియాను వినియోగించడానికి అంతగా ఆసక్తి చూపించడంలేదని తెలుస్తోంది.

అవగాహన కల్పిస్తామంటున్న అధికారులు

నానో యూరియాపై రైతు వేదికల ద్వారా రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తక్కువ ధర, అధిక దిగుబడి లాంటి అంశాలను రైతుల్లో ముమ్మర ప్రచారం చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించామన్నారు. ముందుగా రాష్ట్ర స్థాయిలో పలువురు రైతులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, తర్వాత క్షేత్రస్థాయిలో పొలాలు, రైతు వేదికల వద్ద సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వానాకాలం వ్యవసాయ సీజన్‌లో 8 లక్షల బాటిళ్ల నానో యూరియాను రైతులకు అందజేయాలని వ్యవసాయ శాఖ ఎరువుల ప్రణాళికలో ప్రకటించింది.

రూ. 60 తక్కువ..

500 ఎంఎల్ నానో యూరియా బాటిల్‌లో 40 వేల పీపీఎంల నైట్రోజన్ ఉంటుంది. లిక్విడ్ యూరియాను నీటిలో కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది. ఈ యూరియాను పత్తి, మొక్కజొన్న తదితర 94 పంటల మీద పిచికారీ చేయొచ్చు. కాగా ప్రస్తుతం అందుబాటులో ఉన్న సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ ధరకు లభిస్తుంది. అంతే కాదు దీని వాడకం వల్ల పంట దిగుబడి సాధారణ యూరియా కంటే 8% పెరుగుతుందని అంచనా. సబ్సిడీలు పోనూ యూరియా బస్తా ధర రూ.266 ఉండగా... నానో యూరియా బాటిల్ రూ.204కే లభిస్తోంది. అర లీటర్ నానో యూరియాకు సుమారు 127 లీటర్ల నీటిని కలిపి చల్లొచ్చు. రవాణాకు, నిల్వకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయినా చాలావరకు రైతులు ఆసక్తి చూపించక పోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఫెర్టిలైజర్ షాపు యజమానులు 4 యూరియా బస్తాలు కొనుగోలు చేసిన రైతులకు నానో లిక్విడ్ యూరియాను బలవంతంగా అంటగడుతున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

‘ఉపా’ను రాష్ట్రంలో ప్రయోగించబోమని ప్రకటించాలి

- కేంద్రంలో కూడా ఎత్తేసేలా ప్రయత్నించాలి
- రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి: ప్రొ.హరగోపాల్



పంజగుట్ట: ఉపా చట్టాన్ని రాష్ట్రంలో ఉపయోగించబోమనీ, కేంద్రంలోనూ ఎత్తేసేలా ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని నిర్బంధ వ్యతిరేక వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ కోరారు. ఇక్కడి ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతకవచ్చు.. ఇది ప్రజాస్వామ్య తెలంగాణ అని నిరూపించుకోవాలి అని సూచించారు. ప్రజాసంఘాల స్వేచ్ఛను, మాట్లాడే హక్కును దూరం చేస్తున్న అన్యాయమైన ఉపా చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల ఉపా చట్టం కేసులను ఆరుగురిపై రాష్ట్ర ప్రభుత్వం ఎత్తేసిన సంగతి తెలిసిందే. ఆ ఆరుగురిలో నలుగురు ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజాషా, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ గుంట రవి సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ .. తమపై నమోదైన కేసులే మిగిలిన 146 మందిపై కూడా ఉన్నప్పుడు వారిపై కేసులు ఎందుకు ఎత్తివేయలేదని ప్రశ్నించారు.

21 నుంచి దశల వారీ ఆందోళన

తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 21 నుంచి 25 వరకు సీఎం, మంత్రులకు వినతిపత్రాలు ఇస్తామని, జూన్ 26 నుంచి జూలై 29 వరకు జిల్లాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తామని, జూలై 30న హైదరాబాద్‌లో ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో బహిరంగ సభ నిర్వహిస్తామని హరగోపాల్ తెలిపారు.

దేవేందర్‌ను విడుదల చేయాలి

సిద్దిపేటలో పరీక్ష రాస్తుండగా పోలీసులు అరెస్టు చేసి తీసుకువెళ్లిన దేవేందర్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దేవేందర్ గతంలో దేశభక్త ప్రజాతంత్రలో పనిచేసింది వాస్తవమే అయినా ఇప్పుడు దానికి దూరంగా ఉన్నాడని తెలిపారు. అరెస్టు చేసి 24 గంటలు అవుతున్నందున వెంటనే కోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

బంగాళాఖాతంలో కలిసేది బీఆర్ఎస్సే

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వస్తుందన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా సోమవారం రాత్రి నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి ప్రసంగించారు. రాష్ట్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఎందుకోసం నిర్వహిస్తున్నారని.. ప్యాలెస్ లాంటి ఫామ్‌హౌజ్‌లు కట్టుకున్నందుకా, వేల కోట్లు సంపాదించుకున్నందుకా అని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం లేకుండా చేస్తున్న బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడేందుకు, సమస్త తెలంగాణ ప్రజల కోసం తాను పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్నానని చెప్పారు. ధరణి వల్ల భూమిపై హక్కులు కోల్పోయిన వారికి చట్టబద్ధంగా హక్కులు కల్పిస్తామన్నారు.

కృష్ణా జలాలను నల్లగొండకు తరలించాలి

తనది గమ్యం లేని పాదయాత్ర అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అంటున్నారని.. కృష్ణా జలాలను నల్లగొండ జిల్లాకు తరలించాలనేదే తన ఆశయమన్న విషయం గుత్తా తెలుసుకోవాలని భట్టి సూచించారు. చెమట బిందువులను ఓట్లుగా మార్చి నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే.. ఆ ఎమ్మెల్యే ప్రలోభాలకు లోనై పార్టీ మారాడని విమర్శించారు. బ్రాహ్మణ వెల్లెంల, ఉదయ సముద్రం ప్రాజెక్టు గురించి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అప్పట్లోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తెచ్చారని.. అప్పట్లో కాంగ్రెస్ సర్కారు రూ.348 కోట్లను ప్రాజెక్టుకోసం ఖర్చుపెట్టిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో అసెంబ్లీ షెడ్యూల్!

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని వివరించాయి. ఈ మేరకు 74 మంది డిప్యూటీ కలెక్టర్లు (ఇటీవలే పదోన్నతి పొందిన వారితో కలిపి), 14 మంది డిప్యూటీ కమిషనర్లు, 31 మంది అదనపు కలెక్టర్లను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. ఇక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనికి వచ్చే అన్ని మండలాల తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిసింది.

ఏఆర్‌వోల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి ఏర్పాట్లు

నామినేషన్ల ప్రక్రియతోపాటు పోలింగ్ సామగ్రి సమకూర్చుకోవడం, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, ఈవీఎంలు, బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేయడం, పోలింగ్ స్టేషన్లలో కనీస సౌకర్యాల కల్పన వంటి ఏర్పాట్లన్నీ ఏఆర్‌వోల పర్యవేక్షణలో జరగనున్నాయి. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీలో భాగంగా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ (ఏఈఆర్‌వో) అధికారులుగా తహసీల్దార్లు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా ప్రచురణ ఉండటంతో, ఆ తర్వాతే షెడ్యూల్ వస్తుందని రెవెన్యూ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు మార్చి 5–15వ తేదీ మధ్య షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని చెప్తున్నాయి.

2018లో ముందస్తు ఎన్నికలతో..

గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు లోక్‌సభ ఎన్నికలతోపాటు 2019 ఏప్రిల్–మే నెలల్లో జరగాలి. కానీ రాష్ట్రంలో రాజకీయ కంగాళీ వాతావరణం ఏర్పడిందని.. తనను, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొంటూ.. సీఎం కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. 2018 సెప్టెంబర్ 6న ప్రభుత్వాన్ని రద్దు చేస్తూ కేబినెట్‌లో తీర్మానించి.. అప్పటి గవర్నర్‌ను నరసింహన్‌కు అందజేయడం, ఆయన వెంటనే ఆమోదించడం, అదే రోజున 105 మంది బీఆర్ఎస్ అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించడం చకచకా జరిగాయి. అప్పుడు దేశంలో మరో నాలుగు రాష్ట్రాలకూ ఎన్నికల సమయం కావడంతో.. వాటితో పాటు తెలంగాణనూ కలిపి అక్టోబర్ 6న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 12న నోటిఫికేషన్ జారీకాగా డిసెంబర్ 7న పోలింగ్, 11న ఓట్ల లెక్కింపు జరిగాయి. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజారిటీ సీట్లు గెల్చుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

ఈసారి అదే సమయంలో..!

ఈసారి కూడా ఆ నాలుగు రాష్ట్రాలతో కలిపి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. 2018లో జరిగిన 5 రాష్ట్రాల్లో ఎన్నికల్లో భాగంగా.. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 12, 20 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. మధ్యప్రదేశ్, మిజోరం రాష్ట్రాల్లో నవంబర్ 28న, రాజస్తాన్, తెలంగాణ రాష్ట్రాల్లో డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించారు. ఈసారి కూడా ఐదు రాష్ట్రాల పోలింగ్ ప్రక్రియ డిసెంబర్ 5–9 తేదీల మధ్య ముగిసే అవకాశాలు ఉన్నాయని.. ఇందుకు అనుగుణంగా అక్టోబర్ రెండో వారంలోనే షెడ్యూల్ రావొచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి.

మరికొందరు కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ?

సాక్షి, హైదరాబాద్: ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న మరికొంత మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపించనున్నారు. మే, జూన్ నెలల్లో ఇంటర్, పాలిటెక్నిక్ కళాశాల విద్యాబోధనలో ఉన్న 3,897 కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. ఇప్పుడు వారంతా రెగ్యులర్ ఉద్యోగులైపోయారు. అయితే సరైన అర్హతలు లేనికారణంగా కొంతమందిని క్రమబద్ధీకరించలేదు. కొంతమంది డిస్టెన్స్‌లో డిగ్రీ చదివినవాళ్లు, రాష్ట్రంలోని బయటి రాష్ట్రాల స్టడీ సెంటర్లలో చదివినవారూ ఉన్నారు. వీరేకాకుండా కొన్ని పోస్టుల మంజూరు లేకుండా లెక్చరర్లను నియమించారు. మరికొన్ని చోట్ల మంజూరైన పోస్టు సబ్జెక్టు ఒకటయితే.. మరో సబ్జెక్టు బోధించే అధ్యాపకులు పని చేస్తున్నారు. డిగ్రీ కాలేజీ అధ్యాపకులకు నెట్, సెట్, పీహెచ్‌డీ తప్పనిసరి కాగా, ఈ అర్హతలు లేని వారిని నియమించారు. అయితే తాజాగా ఈ అర్హతలను సాధించడంతో వీరందరి వివరాలను ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. ప్రభుత్వం ఆమోదిస్తే, వీరిని సైతం క్రమబద్ధీకరించే అవకాశాలున్నట్లుగా విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

ట్రిపుల్ ఐటీ సమస్యలు పట్టవా..?

- బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి
- ఆర్జీయూకేటీలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం
- అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు



బాసర ట్రిపుల్‌ఐటీ వద్ద పోలీసుల అదుపులో బీజేపీ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి ఆరోపించారు. బీజేపీ నాయకులతో కలిసి సోమవారం వర్సిటీలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. ప్రధాన ద్వారం వద్దే పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గీతామూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా ట్రిపుల్‌ఐటీలోకి ఎవరూ వెళ్లకుండా చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ట్రిపుల్‌ఐటీలో సమస్యలే లేవంటున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఒకసారి వచ్చి పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. ట్రిపుల్‌ఐటీలోకి ఎవరినీ అనుమతించకుండా రహస్యంగా ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి..

నిర్మల్‌చైన్‌గేట్: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని గీతామూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. విద్యార్థినుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. విద్యార్థులకు కౌన్సెలింగ్ అవసరం ఉన్నందున ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించి కౌన్సెలింగ్ చేయించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, సామరాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అలివేలు మంగ, జిల్లా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజినివైద్య, ఉపాధ్యక్షులు మేఘన, అనన్య, బాసర మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలి‘టీ’కల్..!



మన ఊరు–మన బడి కార్యక్రమంలో టీ తాగుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

తలమడుగు: ఆ ఇద్దరూ వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు. అయితే సోమవారం ఆ ఇద్దరు కలిసి గ్రామ అభివృద్ధి పనుల్లో పాలుపంచుకున్నారు. రోజంతా కలివిడిగా గడిపారు. కలిసి టీ తాగడంతోపాటు పక్కపక్కనే కూర్చొని భోజనం చేశారు. ఇందులో ఒకరు బీజేపీకి చెందిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ కాగా మరొకరు బీఆర్ఎస్‌కు చెందిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడిలో సోమవారం ఈ ఇద్దరూ కలిసి పలు అభివృద్ధి పనుల్లో పాలుపంచుకున్నారు. ఇందులో భాగంగా మన ఊరు– మన బడి కార్యక్రమంలో పక్కపక్కనే కూర్చొని టీ తాగుతూ కనిపించడం ఆసక్తి కలిగించింది.

ప్రభుత్వ బడిలో అడ్మిషన్లు క్లోజ్



పొనకల్ ప్రాథమిక పాఠశాల

జన్నారం: సంకల్పం, పట్టుదల ఉంటే అసాధ్యమైనా సుసాధ్యమే అవుతుందని మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొనకల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిరూపించారు. ప్రైవేటుకు దీటుగా బోధించి అడ్మిషన్ల సంఖ్య పెంచారు. ఈ విద్యాసంవత్సరం ఇప్పటికే 70 అడ్మిషన్లు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు జాజల శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల సామర్థ్యం ఒకటి నుంచి 5వ తరగతి వరకు 150 కాగా 200 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం పాఠశాల నుంచి 14 మంది గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. మన ఊరు– మన బడి పథకంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఈ పాఠశాల పనులు పూర్తి చేసుకుని అభివృద్ధి చెందింది. విద్యార్థులకు అన్ని సౌకార్యాలు కల్పించడం, నాణ్యమైన విద్య అందించడం వల్ల ప్రజల నుంచి స్పందన లభించింది. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు క్లోజ్ అని ఫ్లెక్సీ అతికించారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రశాంతంగా కొనసాగుతోందని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పోలీసు పరేడ్ మైదానంలో సర్టిఫికెట్లను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ అభ్యర్థులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. టెంట్లు, కుర్చీలు, తాగునీరు, జిరాక్స్ సదుపాయం కల్పించామన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో మాత్రమే రావాలన్నారు. అత్యవసర పరిస్థితులతో చేరుకోలేని వారు తమ కుటుంబీకులతో స్వీయ ధ్రువీకరణ పత్రంతో పరిశీలన ప్రక్రియకు హాజరుకావాలని సూచించారు. కాగా, సోమవారం 505 అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 470 అభ్యర్థులు హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొన్నారు. అదనపు ఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు, సమయ్‌జాన్‌రావు, ఏఆ యూనిస్ అలీ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే కేడీసీసీబీ లక్ష్యం

- సొసైటీలే బ్యాంకు కౌంటర్లుగా నిర్వహణ
- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

కరీంనగర్ అర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వ్యాపారులు, రైతు సమాజానికి ప్రయోజనం చేకూర్చేలా వ్యాపార కార్యకలాపాలను విస్తృతం చేయాలని టెస్కాబ్ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. ఆర్బీఐ ఆంక్షల వల్ల జిల్లాలో ఎక్కువ శాఖలను ఏర్పాటు చేయలేకపోతున్నామని, సొసైటీలను బ్యాంకు కౌంటర్లుగా మార్చి ఖాతాదారులకు బ్యాంకుతో సమానంగా అన్ని సేవలను అందించాలని సూచించారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన కేడీసీసీబీ 102వ జనరల్ బాడీ సమావేశానికి రవీందర్‌రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లను కామన్ సర్వీస్ సెంటర్లుగా (సీఎస్‌సీ) మార్చి 300 రకాల డిజిటల్ సేవలు అందజేస్తున్న తొలి సహకార బ్యాంకు తమదేనన్నారు. వివిధ వర్గాల ప్రజలు, రైతులు సీఎస్‌సీ సేవలు పొందాలని సూచించారు. ఆధార్, పాన్‌కార్డుల సవరణలు, జారీ చేయడం, ఎల్పీజీ సిలిండర్ బుకింగ్, బ్యాంకింగ్, బీమా తదితర సేవలు అందిస్తున్నామన్నారు. వ్యాపారాన్ని వైవిధ్యపర్చడంలో భాగంగా తక్కువ ధరలకు మందులు విక్రయించేందుకు జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని పీఏసీఎస్‌లకు సూచించారు. పీఏసీఎస్‌గా బహుళ సేవా కేంద్రంగా (ఎంఎస్‌సీ) డైవర్సిఫికేషన్ కోసం నాబార్డ్ సహాయం 2026 వరకు కొనసాగుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పలుతీర్మానాలు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు చనిపోయిన పీఏసీఎస్ చైర్‌పర్సన్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. అన్ని పీఏసీఎస్‌ల కంప్యూటర్ల వార్షిక నిర్వహణకు రూ.25.80 లక్షలతో ఆర్థిక సహాయం అందించాలని డీసీసీబీ నిర్ణయించింది. సభ్యుల అభ్యర్థన మేరకు పీఏసీఎస్ చైర్మన్‌లకు గ్రూప్ ఇన్సూరెన్స్ కవరేజీ కల్పించే అవకాశాలను పరిశీలిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలులో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 100 శాతం రికవరీ సాధించిన పీఏసీఎస్ చైర్మన్లు, కార్యదర్శులను అభినందించారు. చొప్పదండి, బీర్‌పూర్, జైన, పోరమళ్ల చైర్మన్లను సత్కరించారు. హుజూరాబాద్ బ్రాంచి, కోరుట్ల, ఎల్లారెడ్డిపేట బ్యాంకు మేనేజర్లు 100 శాతం రికవరీ సాధించి రూ.100 కోట్లకుపైగా వ్యాపారం చేశారని కొనియాడారు. కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగళి రమేశ్, బ్యాంకు సీఈవో ఎన్.సత్యనారాయణరావు, నాబార్డు డీడీఎం జయప్రకాశ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

‘ఆదర్శ’ రైల్వేస్టేషన్లకు ఆధునిక హంగులు

- ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం ఎంపిక
- ఒక్కో స్టేషన్ అభివృద్ధికి రూ.7.7 కోట్లు కేటాయింపు



రామగుండం రైల్వేస్టేషన్

రామగుండం: కేంద్రప్రభుత్వం ప్రకటించిన ఆదర్శ రైల్వేస్టేషన్‌లలో ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం ఉన్నాయి. అటల్ మిషన్ ఫర్ రిజువేనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (ఏఎంఆర్‌యూటీ) పథకంలో భాగంగా వీటిని ఎంపిక చేశారు. ఆదర్శ రైల్వేస్టేషన్లుగా గుర్తించిన వాటికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. ఒక్కో స్టేషన్‌కు రూ.7.7 కోట్లు కేటాయించినట్లు సమాచారం. ఈ నిధులతో వాహనాల పార్కింగ్‌కు విశాలమైన స్థలం, స్టేషన్ ప్రాంగణంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టింగ్ వాహనాలు, రిటైరింగ్ గదులు, వేయిటింగ్ హాల్స్, మహిళలకు ప్రత్యేక గదులు, వైఫై సౌకర్యం, కంప్యూటర్ ఆధారిత ప్రజా సమాచార వ్యవస్థ, సూచిక బోర్డులు, మరుగుదొడ్లు, ఎత్తైన ప్లాట్‌ఫామ్స్, ఫుట్ ఓవర్ వంతెనలు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక ర్యాంపుల నిర్మాణం వంటి అడ్వాన్స్ సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఆదాయం ఉన్న రైల్వేస్టేషన్లకు గుర్తింపు

కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్ల నుంచి గూడ్సు రవాణా ద్వారా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోనే సింహభాగం ఆదాయం సమకూరుతుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రామగుండం కేంద్రంగా బొగ్గు ఎగుమతి, పెద్దపల్లి, కరీంనగర్ కేంద్రాల నుంచి గ్రానైట్, ధాన్యం, సిమెంట్ రవాణా అవుతోంది. ఈ క్రమంలో సదరు స్టేషన్లకు మోడల్ గుర్తింపు ఇవ్వడంతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులో రానున్నాయి.



రాజన్న ఆలయంలో భక్తులు



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

ఆది దేవుడా అందుకో దండాలు

వేములవాడ: ఆషాఢమాసం ఆరంభమైనప్పటికీ రాజన్న దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

● పాస్ట్ అండ్ ప్రజెంట్

కార్తీక వీకే... ఎంతోమంది సాహిత్యాభిమానులకు సుపరిచితమైన పేరు.

'క్వీన్ ఆఫ్ ఇండియన్ పబ్లిషింగ్'గా కీర్తి అందుకున్న వెస్ట్‌ల్యాండ్ బుక్స్ (అమెజాన్ కంపెనీ) పబ్లిషర్‌గా ఎంతోమంది రచయితలను ప్రపంచానికి పరిచయం చేసింది. పాఠకుల నాడి పట్టుకుంది. మారుమూల పల్లె నుంచి హైటెక్ సిటీ వరకు ఏ చిన్న మెరుపు మెరిసినా ఆ మెరుపును అందుకోగలిగింది.

కారణాలపై స్పష్టత ఇవ్వకపోయినా అమెజాన్ కంపెనీ వెస్ట్‌ల్యాండ్ బుక్స్‌ను మూసి వేసింది.

ఆ తరువాత ఏమైంది?

కార్తీక 2.ఒ



'ప్రతిలిపి'తో సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టింది కార్తీక. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'ప్రతిలిపి' దేశంలోని పన్నెండు భాషలకు సంబంధించిన సృజనాత్మక రచనలకు, సాహిత్యాభిమానుల మధ్య చర్చలకు వేదిక అయింది.

బెంగళూరు కేంద్రంగా పని చేసే 'ప్రతిలిపి' వెస్ట్‌ల్యాండ్ పబ్లిషింగ్, ఎడిటోరియల్, మార్కెటింగ్, సేల్స్ టీమ్‌ను యథాతథంగా తీసుకొని కొత్త ప్రయాణం మొదలు పెట్టింది.

ఈ కొత్త వెంచర్‌ని 'వెస్ట్‌ల్యాండ్ 2.ఒ' అని పిలుస్తున్నారు.

దేశంలోని మోస్ట్ పవర్‌ఫుల్ ఎడిటర్‌లలో ఒకరిగా పేరుగాంచిన కార్తీకకు వెస్ట్‌ల్యాండ్‌లాగే 'ప్రతిలిపి'ని పాపులర్ చేయాల్సిన బాధ్యత ఉంది.

'ప్రతిలిపి పేపర్‌బ్యాక్స్' శీర్షికతో తమ యాప్‌లో పాపులర్ అయిన రచనలను కార్తీక నేతృత్వంలో పుస్తకాలుగా తీసుకు రానుంది ప్రతిలిపి.

'గతానికి ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పుడు పాపులర్ రచనలను పుస్తకాలుగా ప్రచురించేదాన్ని. ఇప్పుడు యాప్‌లో పాపులర్ అయిన రచనలను పుస్తకంగా ప్రచురించబోతున్నాను' అంటుంది కార్తీక.

'పుస్తకం అంటే కొన్ని పేజీల సముదాయం కాదు. అదొక ప్రపంచం' అని చెప్పే కార్తీకకు 'సంప్రదాయ పబ్లిషర్' అని పేరు ఉంది. అయితే ఇప్పుడు ఈ సంప్రదాయ పబ్లిషర్ ఆడియో బుక్, యాప్, పాడ్‌కాస్ట్... మొదలైన ఫార్మాట్‌లలో సాహిత్యాభిమానులకు చేరువ కావడానికి కొత్తదారిలో ప్రయాణం చేస్తుంది.

'కాలంతోపాటు నడవాలి. కొత్త ఫార్మాట్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇది సవాలు మాత్రమే కాదు ఎంతో ఉత్సాహం ఇచ్చే పని కూడా' అంటుంది కార్తీక.

కార్తీకతో కలిసి మరోసారి పనిచేయడానికి రచయితలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. ఆ ఉత్సాహమే ఆమె బలమని చెప్పాల్సి అవసరం లేదు కదా!

వైవిధ్యమే బలం

ప్రచురణ రంగానికి వైవిధ్యమే ప్రధాన బలం. అందుకే ఎప్పటికప్పుడు పాఠకుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుంటాను. పాఠకులకు ఎలా చేరువ కావాలనేదానిపై రకరకాలుగా ఆలోచిస్తాను. పాఠకులకు చేరువ కావాలనే లక్ష్యం కోసం వక్రమార్గాల్లో పయనించడం నా సిద్ధాంతం కాదు. సమాజానికి హాని చేసే కంటెంట్‌ను దగ్గరికి రానివ్వను. వ్యాపారానికి నైతికత అనేది ముఖ్యం. విలువలకు ప్రాధాన్యత ఇస్తాను. ఎంపికకు సంబంధించిన విషయంలో కూడా 'నాదే రైట్' అనే ధోరణితో కాకుండా ఇతరులతో విస్తృతంగా చర్చిస్తాను. సోకాల్డ్-మెయిన్ స్ట్రీమ్ ఆలోచనలకు పక్కకు జరిగితే ఎంతో అద్భుతమైన ప్రతిభను వెలుగులోకి తీసుకురావచ్చు. నా కెరీర్‌లో సంతోషకరమైన విషయం ఏమిటంటే యువతలో చదివే వారి సంఖ్య పెరగడం. 'కొత్త పాఠకులు ఎలాంటి కంటెంట్‌ను ఇష్టపడుతున్నారు?' అని తెలుసుకోవడం ముఖ్యం. శక్తిమంతమైన, సృజనాత్మకమైన ఆలోచనలు ఎక్కడో ఒకచోట ఉంటాయి. అవి ఎక్కడ ఉన్నాయో కనిపెట్టి వెలుగులోకి తీసుకురావడమే పబ్లిషర్ బలం.

- కార్తీక వీకే



● అదర్ సైడ్

'నీకు తెలియని వ్యాపారంలో పొరపాటున కూడా పెట్టుబడి పెట్టవద్దు'

'పెట్టుబడికి సంబంధించిన రెండు రూల్స్ ఏమిటంటే... ఒకటి నష్టం రాకుండా చూసుకోవడం. రెండోది మొదటి రూల్‌ను మరచిపోకపోవడం' అని పెద్దాయన వారెన్ బఫెట్(ప్రసిద్ధ ఇన్వెస్టర్, అపర కుబేరుడు) చెప్పిన మాటలను ఇష్టపడే బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్ ఇన్వెస్టర్‌గా కూడా 'రాణి'స్తోంది...

ఇన్వెస్టార్

తాజాగా క్రోమ్ ఆసియా హాస్పిటాలిటీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టింది భూమి పెడ్నేకర్. 'మంచి బ్రాండ్‌తో కలిసి ప్రయాణించడం ఆనందంగా ఉంది' అంటుంది భూమి. క్రోమ్ ఆసియా గ్రూప్ 'కయా' పేరుతో గోవాలో బోటిక్ హోటల్‌ను ప్రారంభించింది. భోజనప్రియురాలైన భూమికి ప్రయాణాలు అంటే ఇష్టం. అందుకే ఆ రంగాలకు సంబంధించిన కంపెనీలలో పెట్టుబడులు పెడుతుంది.

'పెట్టుబడి పెట్టే ముందు లాభాల కంటే ముందు ఆ కంపెనీకి ఉన్న విశ్వసనీయత గురించి ఆలోచిస్తాను' అంటుంది భూమి.

'యష్ రాజ్ ఫిల్మ్స్'లో ఆరు సంవత్సరాలు అసిస్టెంట్ కాస్టింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన భూమి 'దమ్ లగా కే హైసా' సినిమాతో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. తొలి సినిమాతో ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ తీసుకుంది. కమర్షియల్‌గా సక్సెస్ అయిన కామెడీ డ్రామా 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ'తో తన కెరీర్ ఊపందుకుంది.

ఫోర్బ్స్ ఇండియా-2018 '30 అండర్ 30' జాబితాలో చోటు సంపాదించింది.

మూడు సంవత్సరాల క్రితం 'క్లైమెట్ వారియర్' క్యాంపెయిన్ మొదలుపెట్టి పర్యావరణ సంరక్షణకు సంబంధించిన అంశాలపై పనిచేస్తోంది.

ముంబైలో జన్మించిన భూమికి మొదటి నుంచి కళలు, పర్యావరణం, వ్యాపారం అంటే ఆసక్తి.

సామాజిక, పర్యావరణ సంబంధిత అంశాలపై ఆసక్తి మాట ఎలా ఉన్నా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనేది ఆమె కలలలో ఒకటి.

అందులో ఒక అడుగు... వివిధ కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం. ఎవరో ఇచ్చిన సలహాల ఆధారంగా కాకుండా ఇన్వెస్ట్‌మెంట్‌పై భూమికి మంచి అవగాహన ఉంది.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు సంబంధించి నిర్మాణాత్మక ఆలోచనలు ఉన్నాయి. ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్(వెప్) సమావేశంలో మహిళా వ్యాపారవేత్తల గురించి చేసిన ప్రసంగం భూమి పెడ్నేకర్ ఆలోచనలకు అద్దం పడుతుంది.

సామాజిక, పర్యావరణ సంబంధిత అంశాలపై ఆసక్తి మాట ఎలా ఉన్నా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనేది ఆమె కలలలో ఒకటి. అందులో ఒక అడుగు... వివిధ కంపెనీలలో పెట్టుబడులు పెట్టడం. ఎవరో ఇచ్చిన సలహాల ఆధారంగా కాకుండా ఇన్వెస్ట్‌మెంట్‌పై భూమికి మంచి అవగాహన ఉంది.



● భూమి పెడ్నేకర్

ఇంటిప్స్



1. పొడి తయారు చేసుకుందాం
అరకిలో వెల్లుల్లి రెబ్బలను పొట్టు వొలిచి చిన్నచిన్న ముక్కలుగా తరగాలి. కప్పు బొంబాయి రవ్వను బాణలిలో వేసి, వేడెక్కిన తరువాత రవ్వలో వెల్లుల్లి ముక్కలను వేసి వేయించాలి. రవ్వ, వెల్లుల్లి ముక్కలు గోల్డెన్ బ్రౌన్ కలర్ లోకి మారేంత వరకు వేయించి దించేయాలి. వెల్లుల్లి ముక్కలను రవ్వ నుంచి వేరుచేసి మిక్సీజార్‌లో వేసి పొడిచేసుకోవాలి. ఈ పొడిని పిండి జల్లెడతో జల్లించుకుని గాలిచొరబడని డబ్బాలో నిల్వచేసుకుంటే ఆరు నెలలపాటు తాజాగా ఉంటుంది. ఇలా చేసుకుంటె మార్కెట్లో వెల్లుల్లి పొడి కొనే అవసరం ఉండదు. వెల్లుల్లి పేస్టుకు బదులు ఈ పొడిని కావాల్సిన కూరల్లో వేసుకోవచ్చు. ఈ పొడి ఉంటే తరచూ వెల్లుల్లి పొట్టు తీసి దంచే పని ఉండదు.

2. అన్నం మాడిపోతే ఒక ఉల్లిపాయను తీసుకుని నాలుగు ముక్కలుగా తరగాలి. మాడిన అన్నం గిన్నె మధ్యలో నాలుగు ముక్కలను నాలుగు చోట్ల పెట్టి పదిహేను నిమిషాలపాటు మూతపెట్టి ఉంచాలి. పావు గంట తరువాత మూత తీసి ఉల్లిపాయ ముక్కలను తీసేయాలి. ఇలా చేయడం వల్ల మాడు వాసన పోతుంది. అన్నం ఉల్లిపాయ వాసన కూడా రాకుండా చక్కగా ఉంటుంది.



3. ఇంట్లో అల్లం ఎక్కువగా ఉన్నప్పుడు... తొక్కతీసి కొద్దిగా నూనె వేసి పేస్టు చేసుకోవాలి. ఈ పేస్టుని ఐస్ ట్రేలో వేసుకుని ఫ్రీజర్‌లో నిల్వ చేసుకోవాలి. ఈ అల్లం క్యూబ్స్ ఎప్పుడంటే అప్పుడు సులభంగా వాడుకోవచ్చు.

4. సాల్ట్ డబ్బా అడుగు భాగంలో కొద్దిగా బియ్యం వేసి తరువాత సాల్ట్ పోసుకుంటే సాల్ట్‌లోని తేమను బియ్యం పీల్చుకుని సాల్ట్‌ను పొడిగా ఉంచుతుంది.

5. ప్లాస్టిక్ రోల్ అతుక్కుని త్వరగా రాదు. ఇటువంటప్పుడు అరగంటపాటు రోల్‌ని రిఫ్రిజిరేటర్‌లో పెట్టి తరువాత ఓపెన్ చేస్తే అతుక్కోకుండా సులభంగా వస్తుంది.



6. గాజుకప్పు లేదా గ్లాసులో వేడిపాలు, పాయసం వంటివి పోసే ముందు.. దానిలో ఒక స్టీల్ స్పూను పెట్టి, తరువాత పాలు లేదా పాయసం వేయాలి. ఇలా చేయడం వల్ల గాజు గ్లాసు పగలదు.

7. స్ప్రే బాటిల్‌లో టేబుల్ స్పూను బేకింగ్ సోడా, టేబుల్ స్పూను వెనిగర్, టీస్పూను డిష్‌వాష్ లిక్విడ్, రెండు గ్లాసులు నీళ్లు పోసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కిచెన్ ప్లాట్‌ఫాం మీద, స్టవ్ మీద చల్లుకుని తుడుచుకుంటే క్రిములు దరిచేరవు.



● 12.5 కోట్ల టన్నులు.. ప్రపంచవ్యాప్తంగా సేద్యంలో వాడుతున్న ప్లాస్టిక్ సామగ్రి	● 60 లక్షల టన్నులు.. ఆసియా దేశాల్లోని పొలాల్లో ప్లాస్టిక్ వినియోగం	● రూ. 1980 కోట్లు.. మన దేశంలో పంటలకు ఏటా కలుపు వల్ల నష్టం	● కిలో ప్లాస్టిక్ మల్చింగ్ షీట్‌తో 700 చ.అ.ల భూమి కలుషితం	● ఖరీదైన ప్రత్యామ్నాయంగా ముందుకొస్తున్న అటానమస్ వీడింగ్ రోబోలు

పొలాల్లో ప్లాస్టిక్ భూతం!

పంట పొలాల్లో ప్లాస్టిక్ భూతం తిష్టవేసుక్కూచుంది. వ్యవసాయంలో చాలా పనుల కోసం ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం గత 70 ఏళ్లుగా అనేక రెట్లు పెరిగింది. మల్చింగ్ షీట్లు, ఫామ్‌పాండ్ లైనింగ్, ప్లాస్టిక్ డ్రిప్ లేటరల్స్, పీవీసీ పైపులు, గ్రీన్‌హౌస్‌ల పైకప్పులు, సైలేజీ గడ్డి బేల్స్ కోసం ఫిల్మ్‌ల తదితర పనుల కోసం వ్యవసాయంలో ప్లాస్టిక్ వాడకం అంతకంతకూ పెరుగుతోంది.

వీటిల్లో ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ ముఖ్యమైనది. ఒక పంట కాలంలో చిరిగిపోయే పల్చటి షీట్ ఇది. కలుపును నివారించడం ద్వారా కలుపు తీత శ్రమతో పాటు ఖర్చును లేదా రసాయనిక కలుపు మందుల ముప్పును/ వాటి కొనుగోలు ఖర్చును తగ్గించడం.. మట్టిలో నుంచి నీటి తేమ ఆరిపోకుండా చూడటం ద్వారా నీటిని ఆదా చేయటం ద్వారా దిగుబడి పెరుగుదలకు ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లు ఉపయోగపడుతున్నాయి.




● ప్లాస్టిక్ ఫిల్మ్‌ను ఆచ్ఛాదన (మల్చింగ్)గా వేసిన లెట్యూస్ పొలం

1.25 కోట్ల టన్నుల 'ప్లాస్టిక్ సేద్యం'

2019వ సంవత్సర కాలంలో ప్రపంచవ్యాప్తంగా వంటల సాగు, ఆక్వా సాగు, చేపల వేట దగ్గరి నుంచి ఆయా ఆహారోత్పత్తులను వినియోగదారులకు చేర్చే వరకు ఉన్న దశలన్నిటిలో కలిపి సుమారు కోటి 25 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను వినియోగించినట్లు ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) అంచనా వేసింది.


ప్రపంచవ్యాప్తంగా పంటలు/ఉద్యాన తోటల సాగులో, పశువుల పెంపకంలో ఏడాదికి కోటి టన్నుల ప్లాస్టిక్ వాడుతుండగా.. ఇందులో మల్చింగ్ ఫిల్మ్ వాటా 34 లక్షల టన్నులు. చేపల వేట, ఆక్వా సాగులో 21 లక్షల టన్నులు, అటవీ ఉత్పత్తులకు సంబంధించి మరో 2 లక్షల టన్నుల ప్లాస్టిక్ సామగ్రి వాడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వాడుతున్న ప్లాస్టిక్‌లో సింహభాగం అంటే 60 లక్షల టన్నుల(ప్రపంచ వినియోగంలో సగం)ను ఆసియా రైతులే వాడుతున్నారని ఎఫ్.ఎ.ఓ. చెబుతోంది.



ప్లాస్టిక్ అవశేషాలతో ముప్పేమిటి?

పంట భూముల్లో మిగిలిపోయే ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ అవశేషాల వల్ల ఆయా భూములు కాలుష్యం బారిన పడినందున సూక్ష్మజీవరాశి నశించి పంట దిగుబడులు తగ్గిపోతున్నట్లు ఎఫ్.ఎ.ఓ. పేర్కొంది. ఇలా భూమిలో కలిసిన ప్లాస్టిక్ (ముఖ్యంగా మల్చింగ్ ఫిల్మ్ అవశేషాల) ద్వారా వెలువడే మైక్రోప్లాస్టిక్స్ (సూక్ష్మప్లాస్టిక్ కణాలు) ఆహారోత్పత్తులు, నీటి ద్వారా తిరిగి మనుషులకు చేరి వారికి అనారోగ్యం కలిగించడం కూడా జరుగుతోందని ఎఫ్.ఎ.ఓ. ఆందోళన వ్యక్తం చేసింది. కొన్ని ప్లాస్టిక్ కణాలలో ఉండే థాలేట్స్, బిస్ఫినాల్స్ వంటి విషతుల్య పదార్థాలు మనుషుల హార్మోన్ వ్యవస్థను అస్తవ్యస్థం చేసి ఆనారోగ్యాల బారిన పడేస్తాయి.

ఒక వైపు ఆహారోత్పత్తి పెరుగుదలకు దోహదపడుతున్న ఈ ప్లాస్టిక్ మరో ఆహారభద్రతపై, ఆహార నాణ్యత, పౌష్టికాహార శోషణపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. అదేవిధంగా, సాంఘిక, ఆర్థిక పరంగా నష్టాలకు కారణభూతమవుతోంది.



ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయంలో ప్లాస్టిక్ ఫిల్మ్స్ వినియోగం (2018)

భూమి కలుషితం

పంట పూర్తయిన తర్వాత చీలికలు పేలికలయ్యే మల్చింగ్ ప్లాస్టిక్ షీట్ ముక్కలను ఏరివేయటం పెద్ద సమస్యగా మారింది. ఆసియా పొలాల్లో నుంచి 10 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను మాత్రమే సేకరించి, తిరిగి వాడగలుగుతున్నారు. 90% ప్లాస్టిక్ ముక్కలు భూమిలో అలాగే ఉండిపోతున్నాయి. మట్టిలో కలిసే సూక్ష్మ ప్లాస్టిక్ కణాలు మట్టిలోని సూక్ష్మజీవరాశిని నాశనం చేస్తున్నాయి. దీంతో భూసారం దెబ్బతింటున్నది. ఒక కిలో పల్చటి ప్లాస్టిక్ షీట్ 700 చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యవసాయ భూమిని కలుషితం చేస్తోందని అంచనా.

నిప్పుపెట్టిన ప్లాస్టిక్ నుంచి పాలీక్లోరినేటెడ్ డిబెన్‌జో-పి-డయాక్సిన్లు, ఫ్యూరాన్లు వంటి విషతుల్య వాయువులు వెలువడుతున్నాయి. అందువల్ల, వ్యవసాయంలో ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని గాడిన పెట్టి, ప్రత్యామ్నాయాలపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉందంటూ ఎఫ్.ఎ.ఓ. ఓ నివేదికలో శాస్త్రవేత్తలకు, పారిశ్రామికవేత్తలకు, పాలకులకు సూచించింది.

ప్రత్యామ్నాయాలున్నప్పటికీ..!

రసాయనిక కలుపు మందులు వాడకుండా, కలుపు మొలవకుండా చూసేందుకు వ్యవసాయంలో వాడుతున్న ప్లాస్టిక్ మల్చింగ్ ఫిల్మ్‌కు ప్రత్యామ్నాయాలు అనేకం. పంటల మార్పిడి పాటించడం, పంట పొలంలో ఖాళీ లేకుండా అంతర పంటలు వేయటం(సజీవ ఆచ్ఛాదన) లేదా ఎండుగడ్డి వంటి పంట వ్యర్థాలను మల్చింగ్‌గా వాడటం వంటి మార్గాలున్నాయి.

త్వరగా చివికి భూమిలో కలిసిపోయే పర్యావరణహితమైన (బయోడీగ్రేడబుల్) మల్చింగ్ ఫిల్మ్‌లను సంపన్న దేశాల్లో వాడుతున్నారు. అదే విధంగా, మన కాయిర్ బోర్డు రూపొందిస్తున్న కొబ్బరి పీచుతో తయారు చేసే 'భూవస్త్రాలు' కూడా పంటల మధ్య ఆచ్ఛాదనకు ఉపయోగపడతాయి. కొద్ది నెలల్లో మట్టిలో కలిసిపోతాయి.

అయితే, వీటితో వచ్చిన చిక్కేమిటంటే.. ప్లాస్టిక్ మల్చింగ్ ఫిల్మ్ కన్నా వీటి ధర 2-3 రెట్లు ఎక్కువగా ఉండటమే. ఈ ప్రతిబంధకాలను అధిగమించేందుకు ముఖ్యంగా ఆసియా దేశాలు పరిశోధనలకు ఊతమివ్వాలి.

శాస్త్ర సాంకేతిక పరిశోధనలు ఫలించి, ధర అందుబాటులోకి వస్తే బయోడీగ్రేడబుల్ మల్చింగ్ ఫిల్మ్‌లు మన దేశంలోనూ రైతులకు అందుబాటులోకి వస్తాయని ఆశించవచ్చు.

కలుపు తీసే రోబోలొస్తున్నాయ్!

మన దేశంలో పంట పొలాల్లో కలుపు వల్ల రైతులకు ఏటా జరుగుతున్న ఆర్థిక నష్టం రూ. 1980 కోట్లని నాలుగేళ్ల క్రితం నాటి అంచనా. పురుగులు, తెగుళ్ల నష్టాలకన్నా కలుపు నష్టమే ఎక్కువని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి లెక్క తేల్చింది. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా స్వతంత్రంగా పనిచేస్తూ కలుపు మొక్కల్ని మాత్రమే నిర్మూలించే రోబోలు (అటానమస్ రొబోటిక్ వీడ్ కంట్రోల్ సిస్టమ్స్) వస్తున్నాయి. కృత్రిమ మేధ, జీపీఎస్, జిఐఎస్ వంటి అత్యాధునిక సాంకేతికతలతో రూపొందిన 'రోబో కూలీలు' ఇవి. వీటిల్లో అనేక రకాలున్నాయి. కలుపు తీసే రోబో తనను తానే నడుపుకుంటూ పంట సాళ్లలో వెళ్తూ సాళ్ల మధ్యన, వరుసల్లో మొక్కలు/చెట్ల మధ్యన ఉండే నిర్దేశించిన కలుపు మొక్కల్ని మాత్రమే గుర్తించి నాశనం చేస్తాయి.

నాశనం చేసే పద్ధతులు అనేకం. గాలి, మంట (ఫ్లేమ్), చలి గాలి, మైక్రోవేవ్స్, లేజర్ కిరణాలు, వాటర్ జెట్‌ను ప్రయోగించటం ద్వారా (పంట మొక్కలకు హాని జరగకుండా) కేవలం కలుపు మొక్కల్ని నిర్మూలించటం ఈ రోబోల ప్రత్యేకత. వీటి ఖరీదెక్కువ. కూలీల సమస్యను అధిగమించే క్రమంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా డ్రోన్ల మాదిరిగా వీటిని మన దేశంలోనూ వినియోగించే అవకాశాలు ఉన్నాయి.



● కలుపు మొక్కల్ని మాత్రమే నిర్మూలించే అటానమస్ రొబో

సాగుబడి

మృగశిర కార్తె : జూన్ 21 వరకు
ఆరుద్ర కార్తె : జూన్ 22 నుంచి

చిరుధాన్యాలతో భరోసా

వర్షం ఎప్పుడొస్తుందో.. ఎంత కురుస్తుందో.. మధ్యలో ఎన్ని రోజులు మొహం చాటేస్తుందో అంతుపట్టనంతగా వాతావరణం మారిపోయింది. ఈ అనిశ్చిత వాతావరణ పరిస్థితుల్లో నీటి ఎద్దడిని తట్టుకునే భరోసా పంటలైన చిరుధాన్య పంటల వైపు దృష్టి మరల్చడం శ్రేయస్కరమని నిపుణులు అంటున్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని జరుపుకుంటున్న నేపథ్యంలో దేశీయంగా చిరుధాన్యాల వినియోగంతోపాటు ఎగుమతి అవకాశాలు కూడా పెరిగాయి. దీంతో.. జొన్న, సజ్జ, రాగి, కొర్ర, ఊద, సామ, అరికెలు, ఒరిగెల, అండుకొర్రలకు కూడా గిరాకీ బాగానే ఉంటుందని చెప్పొచ్చు.



భరోసా పంటలంటే?

నీటి వనరులు అందుబాటులో లేని, సారం పెద్దగా లేని తేలిక నేలలు వరి, పత్తి వంటి 'సి-3' పంటల సాగుకు అనుకూలం కావు. తక్కువ వర్షం తోనే, అంతగా సారం లేని తేలిక, ఎర్ర నేలల్లోనూ ఖచ్చితమైన దిగుబడులనిచ్చేవి చిరుధాన్య పంటలు. వీటిని 'సి-4' పంటలు అంటారు. ఇవే రైతులకు భరోసా ఇచ్చే పంటలు. పౌష్టికాహార భద్రతతోపాటు రైతులకు కనీస ఆదాయ భద్రతను ఇవ్వడంతోపాటు.. వరి గడ్డి కన్నా అధిక పోషక విలువలున్న పశుగ్రాసాన్ని కూడా చిరుధాన్యాలు అందిస్తాయని నిపుణులు చెబుతున్నారు. భూతాపాన్ని పెంచే కర్బన ఉద్గారాలను విడుదల చేయటంలో చిరుధాన్యాలతో పోల్చితే వరి పంట 20 రెట్లు ఎక్కువగా విడుదల చేస్తుందని అంచనా.

అందుకే చిరుధాన్యాలు రైతులకు ధీమా ఇవ్వగలిగిన పంటలంటున్నారు. చెరకు సాగుకు 2,100 ఎం.ఎం, వరికి 1,250 ఎం.ఎం., పత్తికి 600 ఎం.ఎం. నీరు అవసరం. అయితే, జొన్నలకు 400 ఎం,ఎం., సజ్జ, రాగి, కొర్ర తదితర స్మాల్ మిల్లెట్లకు 350 ఎం.ఎం. నీరు సరిపోతుంది. వేరుశనగకు 450 ఎం.ఎం., పప్పుధాన్యాలకు 300 ఎం.ఎం., మొక్కజొన్నకు 500 ఎం.ఎం. నీరు అవసరమవుతుంది. తేలిక భూముల్లో, ఎర్ర నేలల్లో మొక్కజొన్న, పత్తి సాగు చేస్తే.. వర్షాలు సక్రమంగా పడకపోతే ఈ పంటలు రైతులను తీవ్ర నష్టాల పాలు జేయడానికి అవకాశాలెక్కువ. సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తే చీడపీడల బెడద కూడా పెద్దగా ఉండదని చెబుతున్నారు.

అరికె మొలిస్తే చాలు..


ఖరీఫ్‌లో మాత్రమే సాగయ్యే చిరుధాన్య పంట అరిక. ఇది 160-170 రోజుల పంట. దాదాపు 6 నెలల పంట. అరికలు విత్తుకోవడానికి ఆరుద్ర కార్తె (జూన్ 22 నుంచి జూలై 5 వరకు) అత్యంత అనువైన కాలం. కొర్ర, సామ, ఊద, అండుకొర్ర పంటలు 90 -100 రోజుల్లో పూర్తయ్యేవే.



● కె.విజయకుమార్ రైతు శాస్త్రవేత్త

మొలిచిన తర్వాత 40-50 రోజులు వర్షం లేకపోయినా ఆరిక పంట నిలుస్తుందని చిరుధాన్యాల సేంద్రియ సాగుదారుడు, రైతు శాస్త్రవేత్త విజయకుమార్ తెలిపారు. 8 సాళ్ల అరికలు విత్తుకొని, 1 సాలు కందులు, మళ్లీ 8 సాళ్ల ఆరికలు, ఒక సాలు ఆముదాలు విత్తుకోవచ్చని ఆయన వివరించారు. అరికలు ఎకరానికి 6-8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని విజయకుమార్ (98 496 48498) తెలిపారు. ఏపీ రైతులు ఉ. 6-9 గం. మధ్యలో, తెలంగాణ రైతులు సా. 6-9 గం. మధ్య సంప్రదించవచ్చు.

ఎద్దు గానుగల నిర్వహణపై 2 రోజుల శిక్షణ



ఆరోగ్యదాయకమైన వంట నూనెలను పట్టణాలు, పల్లెల్లో స్థానికంగానే ఉత్పత్తి చేసుకునే లక్ష్యంతో ఎద్దు గానుగ నిర్వహణపై 'ఆరోగ్యదాయని' సంస్థ ఉచిత శిక్షణ ఇవ్వనుంది. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం జక్లపల్లి గ్రామంలో ఎద్దు గానుగలను నిర్వహిస్తున్న 'ఆరోగ్యదాయని' సంస్థ ఈ నెల 24,25 తేదీల్లో శిక్షణ ఇవ్వనుంది. నూనె గింజ పంటలను స్థానికంగానే పండించుకొని, ఆ గింజలతో ఎద్దు గానుగ ద్వారా నూనెలను ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందటంతో పాటు ఆరోగ్యదాయకమైన వంట నూనెలను ప్రజలకు అందుబాటులోకి తేవచ్చని ఆరోగ్యదాయని వ్యవస్థాపకుడు, ప్రకృతి వ్యవసాయదారుడు బసవరాజ్ తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ ఉచితం. రెండు రోజుల పాటు బస, భోజన ఏర్పాట్ల కోసం రూ. 800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు.. 93466 94156, 93984 27007.



మహిళల జట్టు సెలక్టర్‌గా శ్యామ షా

భారత సీనియర్ మహిళల జట్టు సెలక్షన్ కమిటీలోకి బీసీసీఐ కొత్త సభ్యురాలిని ఎంపిక చేసింది. మాజీ క్రికెటర్, బెంగాల్‌కు చెందిన శ్యామ షా కొత్త సెలక్టర్‌గా ఎంపికైంది. ఇప్పటి వరకు సెలక్టర్‌గా ఉన్న మిథు ముఖర్జీ పదవీకాలం ముగియడంతో ఆమె స్థానంలో శ్యామకు అవకాశం కల్పించారు. శ్యామ భారత్‌కు 3 టెస్టులు, 5 వన్డేల్లో ప్రాతినిధ్యం వహించింది. మరో వైపు భారత జూనియర్ సెలక్షన్ కమిటీలోకి కర్నాటక మాజీ వికెట్ కీపర్ వీఎస్ తిలక్ నాయుడును ఎంపిక చేశారు.

సెమీస్ నేటికి వాయిదా

హాంకాంగ్‌లో జరుగుతున్న ఆసియా కప్ మహిళల ఎమర్జింగ్ టోర్నీని వాన వీడటం లేదు. తాజాగా సోమవారం కూడా భారీ వర్షం దెబ్బ కొట్టింది. టోర్నీలో భాగంగా రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా, వానతో ఆట సాధ్యం కాలేదు. భారత్ 'ఎ', శ్రీలంక 'ఎ' మధ్య తొలి సెమీ ఫైనల్... పాకిస్తాన్ 'ఎ', బంగ్లాదేశ్ 'ఎ' మధ్య రెండో సెమీఫైనల్ నేటికి వాయిదా పడ్డాయి. టోర్నీ నిబంధనల ప్రకారం సెమీస్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే ఉంది.



రష్మీ, భవానిలకు కాంస్యాలు

- ఏపీ అమ్మాయిల ఘనత
- తజీందర్ 'ఆసియా' రికార్డు
- జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్

భువనేశ్వర్: ఆంధ్రప్రదేశ్ అమ్మాయిలు రష్మీ, భవాని యాదవ్ జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలతో మెరిశారు. ఒడిశాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఇద్దరు కాంస్య పతకాలు సాధించారు. జాతీయ అంతర్ రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల జావెలిన్ త్రో ఈవెంట్‌లో రష్మీ ఈటెను 50.95 మీటర్ల దూరం విసిరి మూడో స్థానంలో నిలిచింది. నాలుగో ప్రయత్నంలో ఈ మెరుగైన ప్రదర్శన ద్వారా ఆమె కాంస్య పతకం నెగ్గింది. ఇందులో అన్ను రాణి (ఉత్తరప్రదేశ్; 58.22 మీ.)


తజీందర్

స్వర్ణం, ప్రియాంక (హరియాణా; 51.94 మీ.) రజతం గెలుపొందారు. అంతకుముందు జరిగిన లాంగ్‌జంప్ పోటీలో భవాని 6.44 మీటర్ల దూరం దూకి కాంస్యంతో తృప్తిపడింది. అన్సీ సోజన్ (కేరళ; 6.51 మీ.), శైలీసింగ్ (ఉత్తరప్రదేశ్; 6.49 మీ.) వరుసగా పసిడి, రజత పతకాలు సాధించారు. భారత స్టార్ అథ్లెట్, షాట్‌పుటర్ తజీందర్ పాల్ తూర్ తన రికార్డును తానే సవరించి కొత్త 'ఆసియా' రికార్డు నెలకొల్పాడు. అతను గుండును 21.77 మీటర్ల దూరం విసిరాడు. దీంతో 28 ఏళ్ల పంజాబ్ అథ్లెట్ తజీందర్ 2021లో 21.49 మీటర్లతో నెలకొల్పిన రికార్డును అధిగమించాడు. అతను విసిరిన దూరం ఈ సీజన్‌లో ప్రపంచంలోనే తొమ్మిదో మెరుగైన ప్రదర్శనగా నిలిచింది. 21.40 మీటర్ల క్వాలిఫయింగ్ మార్క్‌ను దాటడంతో ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలకూ తజీందర్ పాల్ అర్హత సంపాదించాడు.

సోమవారం ముగిసిన ఈ పోటీల్లో ఏపీ అమ్మాయి యెర్రా జ్యోతి ఉత్తమ మహిళా అథ్లెట్‌గా ఎంపికైంది. తమిళనాడు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది.

భవానీదేవికి కాంస్యం

ఆసియా ఫెన్సింగ్ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: భారత ఫెన్సర్ భవానీదేవి ఆసియా ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో చరిత్ర సృష్టించింది. చైనాలోని వూగ్జీలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆమె కాంస్యం సాధించడం ద్వారా ఈ పోటీల్లో పతకం గెలిచిన తొలి భారత ఫెన్సర్‌గా ఘనతకెక్కింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో (సబ్రే ఈవెంట్) 29 ఏళ్ల భవాని 14–15తో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జీనబ్ దేబెకొవా చేతిలో తుదికంటా పోరాడి ఓడింది. ఫలితం నిరాశపరిచినా ఆమె శ్రమకు కాంస్య పతకం లభించింది. ఈ టోర్నీలో భారత ఫెన్సర్ సంచలన విజయాలతో సెమీస్‌లోకి దూసుకొచ్చింది. క్వార్టర్ ఫైనల్లో భవాని 15–10తో ప్రపంచ చాంపియన్ ఫెన్సర్ మిసాకి ఎమురా (జపాన్)ను కంగుతినిపించింది. మిసాకి గతేడాది కైరోలో జరిగిన ప్రపంచ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించింది. ఈ మేటి ప్రత్యర్థితో గతంలో తలపడిన ప్రతీసారి ఓటమి పాలైన భవానీ ఈ ఈవెంట్‌లో అద్భుత విజయం సాధించింది. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి భారత ఫెన్సర్ కూడా అయిన భవాని ప్రిక్వార్టర్స్‌లోనూ తనకన్నా మెరుగైన మూడో సీడ్ ప్రత్యర్థి ఒజాకి సెరి (జపాన్)ని 15–11తో ఓడించింది.

174 పరుగులు...7 వికెట్లు!

- రసపట్టులో 'యాషెస్' తొలి టెస్టు
- ఆసీస్ లక్ష్యం 281, ప్రస్తుతం 107/3

బర్మింగ్‌హామ్: 'బజ్‌బాల్' పని చేసిందా లేక ప్రత్యర్థి సాంప్రదాయ ఆట ముందు తలవంచిందా...మొదటి రోజు చేసిన డిక్లరేషన్ సాహసం విజయాన్నందించిందా లేక వ్యూహం ఎదురుతన్నిందా! టెస్టు క్రికెట్‌లో వీటన్నింటికి సమాధానం నేడు లభించనుంది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య ఉత్కంఠభరితంగా సాగుతూ వచ్చిన 'యాషెస్' సిరీస్ తొలి టెస్టులో చివరి రోజు ఆసక్తికర ఘట్టానికి తెర లేచింది. సోమవారం ఆస్ట్రేలియా ముందు ఇంగ్లండ్ 281 పరుగుల


స్టోక్స్ వికెట్ తీసిన కమిన్స్

ఊరించే విజయలక్ష్యాన్ని ఉంచింది. ఆసీస్ కూడా ఆత్మవిశ్వాసంతో దూకుడుగానే ఛేదనను ప్రారంభించింది. అయితే ఇంగ్లండ్ బౌలర్లు చెలరేగి కంగారూలను కట్టి పడేశారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. వార్నర్ (36), లబుషేన్ (13), స్మిత్ (6) పెవిలియన్ చేరగా...ఉస్మాన్ ఖ్వాజా (34 నాటౌట్), నైట్ వాచ్‌మన్ బోలండ్ (13 నాటౌట్) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. చివరి రోజు ఆసీస్ మరో 174 పరుగులు చేయాల్సి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 28/2తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 273 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే కాస్త జోరు తగ్గినా... 66.2 ఓవర్లలోనే 4.11 రన్‌రేట్‌తో వేగంగానే ఈ పరుగులు సాధించింది. బ్రూక్ (46), రూట్ (46), స్టోక్స్ (43) జట్టు స్కోరులో కీలక పాత్ర పోషించారు. ఆసీస్ బౌలర్లలో లయన్, కమిన్స్ చెరో 4 వికెట్లు పడగొట్టారు.

విజేత వెర్‌స్టాపెన్

ఎఫ్1 – కెనడియన్ గ్రాండ్‌ప్రి



మాంట్రియల్: ఫార్ములా వన్ సీజన్‌లో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ జోరు కొనసాగుతోంది. ఆదివారం జరిగిన సీజన్ ఎనిమిదో రేసు కెనడియన్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 1 గంటా 33 నిమిషాల 58.348 సెకన్లలో అతను రేసు పూర్తి చేశాడు. వెర్‌స్టాపెన్‌కంటే 9.570 సెకన్లు ఆలస్యంగా ముగించిన ఫెర్నాండో అలోన్సో (ఆస్టన్ మార్టిన్) రెండో స్థానంలో నిలవగా, 14.168 సెకన్లు ఆలస్యంగా లక్ష్యం చేరిన లూయిస్ హామిల్టన్ (మెర్సిడెజ్) మూడో స్థానంతో ముగించాడు. నెదర్లాండ్స్‌కు చెందిన వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో ఆరు రేస్‌లను గెలుచుకోవడం విశేషం. ఓవరాల్‌గా అతనికి ఇది 41వ విజయం. దాంతో అతను అత్యధిక ఫార్ములా వన్ రేస్ విజయాల జాబితాలో ఒకప్పటి దిగ్గజం ఐర్టన్ సెనా (బ్రెజిల్ – 41)ను సమం చేశాడు. టీమ్ రెడ్‌బుల్‌కు ఇది 100వ విజయం కావడం కూడా మరో విశేషం. చాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న పెరెజ్ (126 పాయింట్లు) కంటే వెర్‌స్టాపెన్ 69 పాయింట్లు ముందంజలో (195 పాయింట్లు) ఉన్నాడు.

హసరంగ 6/24

యూఏఈపై లంక ఘనవిజయం


జీషాన్


హసరంగ

బులవాయో: ఐసీసీ వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయర్‌లో శ్రీలంక శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో లంక 175 పరుగుల భారీ తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ని చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 355 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (63 బంతుల్లో 78; 10 ఫోర్లు), సదీరా సమరవిక్రమ (64 బంతుల్లో 73; 9 ఫోర్లు), పతుమ్ నిసాంకా (76 బంతుల్లో 57; 5 ఫోర్లు), దిముత్ కరుణరత్నే (54 బంతుల్లో 52; 7 ఫోర్లు) అర్ధసెంచరీలు సాధించగా, చరిత్ అసలంక (23 బంతుల్లో 48 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడు ప్రదర్శించాడు. అనంతరం యూఏఈ 39 ఓవర్లలో 180 పరుగులకే కుప్పకూలింది. వసీమ్ (39), అరవింద్ (39), నసీర్ (34) ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వనిందు హసరంగ (6/24) ఆరు వికెట్ల ప్రదర్శనతో ప్రత్యర్థిని పడగొట్టాడు.

ఐర్లాండ్‌ను చిత్తు చేసిన ఒమన్...

వరల్డ్ కప్ క్వాలిఫయర్‌లో పెద్ద సంచలనం నమోదైంది. టెస్టు హోదా ఉన్న ఐర్లాండ్‌పై 5 వికెట్లతో విజయం సాధించి ఒమన్ కొత్త చరిత్ర సృష్టించింది. ముందుగా ఐర్లాండ్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. జార్జ్ డాక్‌రెల్ (89 బంతుల్లో 91 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడగా, హ్యారీ టెక్టర్ (82 బంతుల్లో 52; 5 ఫోర్లు) రాణించాడు. అనంతరం ఒమన్ 48.1 ఓవర్లలో 5 వికెట్లకు 285 పరుగులు చేసింది. కశ్యప్ ప్రజాపతి (74 బంతుల్లో 72; 6 ఫోర్లు, 1 సిక్స్), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', కెప్టెన్ జీషాన్ మఖ్సూద్ (67 బంతుల్లో 59; 4 ఫోర్లు, 1 సిక్స్), ఆఖిబ్ ఇల్యాస్ (49 బంతుల్లో 52; 8 ఫోర్లు), మొహమ్మద్ నదీమ్ (53 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు) విజయంలో ప్రధాన పాత్ర పోషించారు.

అశ్విని జోడీకి టైటిల్



నాంటెస్ (ఫ్రాన్స్): భారత సీనియర్ షట్లర్ అశ్విని పొన్నప్ప నాంటెస్ అంతర్జాతీయ చాలెంజ్ టోర్నీ మహిళల డబుల్స్‌లో విజేతగా నిలిచింది. అశ్విని-తనీషా క్రాస్టో జంట ఫైనల్లో 21-15, 21-14తో హంగ్ ఎన్ జు-లిన్ యు పే (చైనీస్ తైపీ) జోడీపై అలవోక విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభంలో భారత ద్వయం 0-4తో వెనుకబడింది. తర్వాత అశ్విని-తనీషా ద్వయం వరుసగా పాయింట్లు సాధించి 10-10 వద్ద తొలి గేమ్‌ను సమం చేసి ఆ తర్వాత అదే జోరుతో గేమ్‌ను గెలుచుకుంది. అనంతరం రెండో గేమ్‌లో 3-3 వద్ద ఉండగా... భారత జోడీ వరుసగా 7 పాయింట్లు గెలిచి ఆధిపత్యాన్ని కొనసాగించింది. చివరకు 31 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా-సాయి ప్రతీక్ జంటకు అదృష్టం కలిసిరాలేదు. క్వాలిఫయర్స్‌గా బరిలోకి దిగి ఫైనల్ చేరిన ఈ జంట పరాజయాన్ని ఎదుర్కొంది. ఫైనల్లో తనీషా-సాయిప్రతీక్ జోడీ 21-14, 14-21, 17-21తో మాడ్స్ వెస్టెర్‌గార్డ్-క్రిస్టిన్ బస్చ్ (డెన్మార్క్) జంట చేతిలో ఓడిపోయింది.

భారత ఫుట్‌బాల్ జట్టుకు ఒడిశా సీఎం నజరానా

భువనేశ్వర్: భారత హాకీకి వెన్నుదన్నుగా నిలుస్తున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తాజాగా భారత ఫుట్‌బాల్ జట్టుకు ప్రోత్సాహక బహుమతి ప్రకటించారు. ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో సునీల్ ఛెత్రి సారథ్యంలోని భారత ఫుట్‌బాల్ జట్టు టైటిల్ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో జట్టు విజయానికి ప్రోత్సాహకంగా ఒడిశా సీఎం రూ. కోటి నగదు నజరానా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక్కడి కళింగ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్లో భారత్ 2-0తో లెబనాన్‌పై విజయం సాధించింది.

సినిమా

జోడీ రిపీట్?


● రవితేజ, శ్రీలీల

'ధమాకా' చిత్రంతో హిట్ జోడీ అనిపించుకున్న రవితేజ, శ్రీలీల మరోసారి కలిసి నటించనున్నట్లు తెలుస్తోంది. నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో రవితేజ, శ్రీలీల హీరో హీరోయిన్లుగా నటించిన తొలి చిత్రం 'ధమాకా'. గత ఏడాది డిసెంబరులో విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మూవీలో రవితేజ, శ్రీలీల మాస్ ఎనర్జీ ఆడియన్స్‌ను బాగా అలరించింది. అయితే ఇప్పుడు ఈ హిట్ జోడీ రిపీట్ కానుందని ఫిల్మ్‌నగర్ టాక్. 'డాన్‌శీను', 'బలుపు', 'క్రాక్' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాను మైత్రీమూవీ మేకర్స్ నిర్మించనున్నారట. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకు శ్రీలీలను తీసుకోవాలని చిత్ర యూనిట్ భావిస్తోందని సమాచారం. ఈ సినిమాను ఈ ఏడాదే సెట్స్‌పైకి తీసుకువెళ్లాలని రవితేజ, గోపీచంద్ మలినేని అండ్ కో సన్నాహాలు చేస్తున్నారట. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

పుట్టినరోజు కానుకగా...

అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్' చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు బాలీవుడ్ హీరోయిన్ సాక్షీ వైద్య. ఆమె నటిస్తున్న మరో తెలుగు చిత్రం 'గాండీవధారి అర్జున'. వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తున్నారు. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 25న విడుదల కానుంది. కాగా సోమవారం (జూన్ 19) సాక్షీ వైద్య పుట్టినరోజు. ఈ సందర్భంగా 'గాండీవధారి అర్జున' చిత్రం నుంచి వరుణ్, సాక్షిల స్టిల్‌ను రిలీజ్ చేసి, సాక్షికి బర్త్ డే శుభాకాంక్షలు తెలిపింది చిత్రయూనిట్. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ అర్జున పాత్రలో కనిపిస్తారని టాక్. ఈ సినిమాకు మిక్కీ జె.మేయర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... సాయిధరమ్ తేజ్ హీరోగా నటించనున్న కొత్త సినిమాలో సాక్షీ వైద్య హీరోయిన్‌గా ఎంపికయ్యారని వార్తలు వస్తున్నాయి.


● సాక్షీవైద్య, వరుణ్ తేజ్

మాయ నాలో జరిగెనే!

'అందరిలోనూ ఒక్కడు కాను... నేను వేరే తీరులే, కలిసే తాను.. వెలిగే మేను.. మాయ నాలో జరిగెనే...' అంటూ మొదలవుతుంది 'కల కంటూ ఉంటే..' అనే పాట. నాగశౌర్య, యుక్తితరేజ జంటగా నటించిన 'రంగ బలి' చిత్రంలోని పాట ఇది. పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం జూలై 7న విడుదల కానుంది. పవన్ సీహెచ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'కల కంటూ ఉంటే..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ పాటను సార్థక్ కల్యాణి, వైష్ ఆలపించారు. సత్య, సప్తగిరి కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాకు కెమెరా: దివాకర్ మణి.


● నాగశౌర్య, యుక్తితరేజ

లండన్‌లో ఇండియన్ ఆఫీసర్


● జాన్వీ కపూర్

ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ ఆఫీసర్‌గా లండన్‌లో చార్జ్ తీసుకున్నారు హీరోయిన్ జాన్వీ కపూర్. అయితే ఇది రియల్ లైఫ్‌లో కాదు.. రీల్ లైఫ్‌లో అన్నమాట. జాతీయ అవార్డు గ్రహీత సుధాన్షు సరియా దర్శకత్వం వహిస్తున్న 'ఉలజ్' చిత్రంలో జాన్వీ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. గుల్షన్ దేవయ్య, రోషన్ మాథ్యూ ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని జంగ్లీ పిక్చర్స్ నిర్మిస్తోంది. దేశభక్తి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు జాన్వీకపూర్. ఈ సినిమా షూటింగ్ తాజాగా లండన్‌లో ప్రారంభమైంది. జాన్వీకపూర్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు చిత్రయూనిట్. ఈ షెడ్యూల్ దాదాపు రెండు వారాలు సాగుతుందని టాక్. కాగా జాన్వీకపూర్ నటించిన మరో హిందీ చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర' చిత్రంతో జాన్వీ తెలుగుకి పరిచయమవుతున్న సంగతి తెలిసిందే.

ఓటీటీలో బవాల్.. వరుణ్‌ధావన్, జాన్వీకపూర్ జంటగా నితీష్ తివారి దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ లవ్‌స్టోరీ 'బవాల్'. షాజిద్ నదియాద్‌వాలా ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా జూలైలో డైరెక్ట్‌గా అమేజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

ఆ ప్రయత్నంలో విజయం సాధించాం

- వివేక్ కూచిభొట్ల



● రామజోగయ్య, విక్రమ్ రెడ్డి, వివేక్, శశిధర్

''ఆదిపురుష్' చిత్రాన్ని ఆదివారం వరకు ప్రపంచ వ్యాప్తంగా కోటి మంది ప్రేక్షకులు చూశారు. అందుకే ఈ ప్రెస్ మీట్‌ని రామ కోటి ఉత్సవం అని పిలిచాం. రామ నామాన్ని ప్రతి గడపకు చేర్చాలన్నదే యూనిట్ ఆలోచన. ఆ ప్రయత్నంలో విజయం సాధించడం సంతోషంగా ఉంది'' అని సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల అన్నారు. ప్రభాస్ శ్రీరాముడిగా, కృతీసనన్ సీత పాత్రలో నటించిన చిత్రం 'ఆదిపురుష్'. ఓం రౌత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 16న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైంది. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలుగులో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో 'రామ జయం, రఘు రామ జయం' పేరుతో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ– ''ఆదిపురుష్' చిత్రాన్ని నైజాంలో దాదాపు 500 స్క్రీన్స్‌కి పైగా రిలీజ్ చేశాం. తొలి రోజు నైజాంలో 13.65 కోట్లు, రెండో రోజు దాదాపు 8 కోట్లు వసూళ్లు వచ్చాయి'' అన్నారు. ఈ కార్యక్రమంలో పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి, మాటల రచయిత భీమ్ శ్రీనివాస్ మాట్లాడారు.

నా కల నెరవేరింది

- అవికా గోర్



''నేను హారర్ సినిమాలను భయపడుతూ చూస్తాను. 'రాజు గారి గది 3' హారర్ కామెడీ. కానీ '1920' సినిమా సీరియస్ హారర్ ఫిల్మ్. ఇలాంటి సినిమా చేయడం నాకు ఇదే తొలిసారి.. చాలా కొత్త అనుభూతి ఇది. ఈ సినిమా తర్వాత మరిన్ని హారర్ కథల కోసం దర్శక-నిర్మాతలు నన్ను సంప్రదిస్తారని భావిస్తున్నాను'' అని హీరోయిన్ అవికా గోర్ అన్నారు. ప్రముఖ దర్శక-నిర్మాత మహేష్ భట్ రచన, సమర్పణలో రూపొందిన చిత్రం '1920: హారర్స్ ఆఫ్ ది హార్ట్'. కృష్ణ భట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అవికా గోర్ లీడ్ రోల్‌లో నటించారు. విక్రమ్ భట్ ప్రొడక్షన్స్‌పై రాకేష్ జునేజా, శ్వేతాంబరీ భట్, డా.రాజ్‌కిషోర్ ఖవ్రే నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న హిందీ, తెలుగు భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా అవికా గోర్ మాట్లాడుతూ– ''మహేష్ భట్, విక్రమ్ భట్‌లాంటి లెజెండరీ ఫిల్మ్ మేకర్స్‌తో పని చేయడం నా కల. '1920' చిత్రంతో అది ఇంత త్వరగా నెరవేరడం నా అదృష్టం. ఇది నాపై మరింత బాధ్యత పెంచింది. మహేష్ భట్, విక్రమ్ భట్ గార్లతో మాట్లాడుతునప్పుడు సొంత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నట్లే ఉంటుంది. నాగార్జునగారిలో కూడా ఆ క్వాలిటీ చూశాను. '1920' కథ, కాన్సెప్ట్ కొత్తగా ఉంటాయి. ఇందులో కేవలం హారర్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ డ్రామా, ఎమోషన్ కూడా ఉంది. ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా షూటింగ్ నాకు కొత్త అనుభవం ఇచ్చింది. కొత్త టెక్నాలజీ (అన్ రియల్ ఇంజిన్ ఎల్‌ఈడీ స్క్రీన్) వాడాం.. దాని కోసం చాలా హార్డ్ వర్క్ చేశాను. నేను నటించిన 'ఇందు'అనే వెబ్ సిరీస్ త్వరలోనే వస్తుంది. ఆది సాయికుమార్‌కి జోడీగా నటించనున్న 'అమరన్' చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం అవుతుంది'' అన్నారు.

ఇంపాజిబుల్ లవ్‌స్టోరీ


● షాహిద్ కపూర్

షాహిద్‌కపూర్, కృతీసనన్ జంటగా హిందీలో ఓ రొమాంటిక్ ఫిల్మ్ రూపొందుతోంది. ఈ చిత్రానికి అమిత్ జోషి, ఆరాధన షా కలిసి దర్శకత్వం వహిస్తున్నారు. జియో స్టూడియోస్, దినేష్ విజన్, జ్యోతిదేశ్ పాండే, లక్ష్మణ్ ఉటేకర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతోందని బాలీవుడ్ సమాచారం. కాగా ఈ సినిమాను తొలుత అక్టోబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ తాజాగా ఈ సినిమాను డిసెంబరు 7న రిలీజ్ చేస్తున్నట్లు చిత్రయూనిట్ సోమవారం ప్రకటించింది. ఈ సినిమా టైటిల్ ఇంకా ఖరారు కాలేదు కానీ, 'యాన్ ఇంపాజిబుల్ లవ్‌స్టోరీ' అనేది ట్యాగ్‌లైన్.

హద్దులు దాటె చూడు!

'ఎదురుగా ఇంతందంగా కనిపిస్తుంటే నీ చిరునవ్వూ.. ఎదసడే హద్దులు దాటి చూడు చూడు చూడు...' అంటూ మొదలవుతుంది 'బేబీ' చిత్రంలోని 'రిబపప్పా రిబప ప్పాప..' సాంగ్. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ 'బేబీ'. సాయిరాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'రిబపప్పా రిబపప్పాప..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చిత్రయూనిట్ సోమవారం విడుదల చేసింది. సురేశ్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటను సాయి కృష్ణ పాడారు. ఈ సినిమాకు సహ నిర్మాత: ధీరజ్ మొగిలినేని.


● ఆనంద్, వైష్ణవి, విరాజ్

పల్లెటూరి ప్రేమకథ


● లావణ్య, చైతన్య

చైతన్య రావ్, లావణ్య జంటగా చెందు ముద్దు దర్శకత్వం వహించిన చిత్రం 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. బిగ్ బెన్ సినిమాస్ పతాకంపై యష్ రంగినేని నిర్మించిన ఈ చిత్రాన్ని జూలై 21న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ సోమవారం ప్రకటించింది. ఈ సందర్భంగా యష్ రంగినేని మాట్లాడుతూ– ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమ కథా చిత్రమిది. చెందు ముద్దు ఈ చిత్రాన్ని ఆసక్తికరంగా రూపొందించారు. 80 దశకం నేపథ్యంతో పీరియాడిక్ సినిమాగా సాగుతుంది. మా సంస్థకు మంచి పేరు తెచ్చే చిత్రమవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు. మిహిరా, ఉత్తర, వైవా రాఘవ, లలిత్ ఆదిత్య ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ప్రిన్స్ హెన్రీ, కెమెరా: పంకజ్ తొట్టాడ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	216	63,168
నిఫ్టీ ▽	71	18,755

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.00 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,369	▽	93
డోజోన్స్	34,299	▽	109
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,588	▽	58
డాక్స్	16,201	▽	156
షాంఘై	3,256	▽	18
నికాయ్	33,370	▽	336

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,227
బంగారం (99.5 స్వచ్ఛత)	58,990
వెండి (కిలో)	72,359

ఇండిగో రికార్డ్ ఆర్డర్



- ఎయిర్‌బస్ నుంచి 500 విమానాల కొనుగోలు
- 2030–35 మధ్య డెలివరీ

ముంబై: దేశీ విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించే దిశగా పెద్ద ఎత్తున విమానాలను కొనుగోలు చేస్తున్నాయి. చౌక చార్జీల విమానయాన సంస్థ ఇండిగో తాజాగా మరో 500 ఎయిర్‌క్రాఫ్ట్‌ల కోసం ఫ్రెంచ్ విమానాల తయారీ దిగ్గజం ఎయిర్‌బస్‌కు భారీ ఆర్డరు ఇచ్చింది. ఎయిర్‌బస్‌కు ఏ ఎయిర్‌లైన్ నుంచైనా ఇంత స్థాయి ఆర్డరు లభించడం ఇదే ప్రథమం. ప్యారిస్ ఎయిర్ షో 2023 సందర్భంగా విమానాల కొనుగోలు ఒప్పందంపై ఇరు సంస్థలు సంతకాలు చేశాయి. ఈ డీల్ విలువ ఎంత అనేది వెల్లడి కాలేదు. 2030–35 మధ్య కాలంలో డెలివరీలు ఉంటాయని ఇండిగో ఒక ప్రకటనలో తెలిపింది. వీటిలో ఏ320నియో, ఏ321నియో, ఏ321ఎక్స్‌ఎల్‌ఆర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉంటాయని వివరించింది.

ఇండిగో గతంలోనే 480 విమానాల కోసం ఆర్డరు ఇచ్చింది. వాటి డెలివరీలను ఇంకా అందుకోవాల్సి ఉంది. తాజా ఒప్పందంతో ఇండిగో మొత్తం దాదాపు 1,000 ఎయిర్‌క్రాఫ్ట్‌లను కొనుగోలు చేసినట్లవుతుంది. వచ్చే దశాబ్దకాలంలో ఇండిగో వీటిని అందుకోనుంది. దేశీ రూట్లలోనూ, అంతర్జాతీయంగాను భారత్‌లో విమాన సేవల నెట్‌వర్క్ మరింతగా విస్తరించి, ఎయిర్ కనెక్టివిటీ మెరుగుపడేందుకు తమ వంతు తోడ్పాటు అందించగలమని ఆశిస్తున్నట్లు ఎయిర్‌బస్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ క్రిస్టియన్ షెరర్ తెలిపారు. దేశ ఆర్థిక వృద్ధికి, దేశీయంగా ప్రయాణాలకు ఊతమివ్వాలన్న తమ లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు ఈ విమానాల కొనుగోలు సహాయకరంగా ఉండగలదని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. కొన్నాళ్ల క్రితమే టాటా గ్రూప్ దిగ్గజం ఎయిరిండియా కూడా 470 విమానాల కోసం ఎయిర్‌బస్, బోయింగ్‌లకు ఆర్డరు ఇవ్వడం తెలిసిందే.

> **దేశీ ఏవియేషన్‌లో చరిత్రాత్మకం..**
> భారతీయ ఏవియేషన్ రంగంలో ఇదొక చరిత్రాత్మక ఘట్టం. భారతదేశం, ఇండిగో ఉజ్వల భవిష్యత్తు గురించి ఇది చాటి చెబుతుంది. ప్రస్తుతం అంతర్జాతీయ విమానయాన రంగంలో భారత్ కీలకంగా మారింది.
> – ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్

ఇప్పటివరకు 1,300 పైచిలుకు ఎయిర్‌క్రాఫ్ట్..


కొత్త కొనుగోళ్లతో ఇండిగో 2006లో కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి ఎయిర్‌బస్‌కు ఇప్పటిదాకా మొత్తం 1,330 విమానాలను ఆర్డరు ఇచ్చినట్లయింది. ప్రస్తుతం ఇండిగో 300 పైచిలుకు విమానాలను నడుపుతోంది.

5 నెలల్లో 1,000 విమానాలు..

తాజా ఆర్డరుతో భారతీయ విమానయాన సంస్థలు ఇండిగో, ఎయిరిండియా గత అయిదు నెలల్లో మొత్తం 970 విమానాలను కొనుగోలు చేసినట్లవుతుంది. కొత్తగా ఆకాశ ఎయిర్ కూడా ఈ ఏడాది ఆఖరు నాటికి మూడంకెల స్థాయిలో ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డరు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది ఆగస్టులో కార్యకలాపాలు ప్రారంభించిన ఆకాశ ఎయిర్‌కి ప్రస్తుతం 19 ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉండగా, జులైలో 20వ విమానం డెలివరీ కానుంది. ప్రస్తుతం దేశీయంగా 700 పైచిలుకు కమర్షియల్ విమానాలు నడుస్తున్నాయి. వచ్చే ఏడాది, రెండేళ్లలో భారతీయ విమానయాన సంస్థలు 1,500 నుంచి 1,700 పైచిలుకు ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డరు ఇచ్చే అవకాశం ఉందని ఏవియేషన్ కన్సల్టెన్సీ సంస్థ సీఏపీఏ ఫిబ్రవరిలో అంచనా వేసింది. దానికి అనుగుణంగా వచ్చే కొన్నేళ్లలో భారతీయ ఎయిర్‌లైన్స్ 1,100 పైచిలుకు విమానాల డెలివరీలను అందుకోనున్నాయి. ఇండిగో 500, గో ఫస్ట్ 72, ఆకాశ ఎయిర్ 56, విస్తార 17 ఎయిర్‌క్రాఫ్ట్‌ల డెలివరీలు పొందాల్సి ఉంది. అయితే, ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గో ఫస్ట్.. మే నెల నుంచి ఫ్లయిట్ సేవలు నిలిపివేసింది.

ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిల నుంచి వెనక్కి

- ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- సెన్సెక్స్ నష్టం 216 పాయింట్లు
- 18,800 దిగువకు నిఫ్టీ




ముంబై: రికార్డు స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 216 పాయింట్లు పతనమై 63,168 వద్ద, నిఫ్టీ 71 పాయింట్లను కోల్పోయి 18,755 వద్ద ముగిశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ బ్యాంక్ షేర్ల క్షీణత కూడా సూచీల లాభాల్ని హరించివేశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బేరిష్ ట్రెండ్ సైతం సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. ఫలితంగా సూచీలు కొత్త జీవితకాల గరిష్ట స్థాయిలను అందుకోవడంలో విఫలమయ్యాయి. నష్టాల మార్కెట్లోనూ ప్రభుత్వరంగ బ్యాంక్స్, ఐటీ, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఉదయం సెన్సెక్స్ 89 పాయింట్ల స్వల్ప లాభంతో 63,474 వద్ద, నిఫ్టీ 46 పాయింట్లు పెరిగి 18,873 వద్ద మొదలయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న బలహీన సంకేతాలతో సూచీలు ఆరంభంలోనే నష్టాల్లోకి మళ్లాయి. మిడ్‌సెషన్ నుంచి ఇన్వెస్టర్లు ప్రైవేట్ రంగ బ్యాంక్స్, ఆటో, టెలికాం, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడటంతో నష్టాలు మరింత పెరిగాయి. రోజంతా సెన్సెక్స్ 526 పాయింట్ల పరిధిలో, నిఫ్టీ 162 పాయింట్ల శ్రేణిలో ట్రేడయ్యాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు చైనా కేంద్ర బ్యాంకు ఎలాంటి ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించకపోవడంతో ఆసియా మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ టెస్టిమోనీ ప్రసంగం(రేపు) నేపథ్యంలో యూరప్, అమెరికా ఫ్యూచర్లు 1 శాతం వరకు పతనమయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ప్రభుత్వరంగ బ్యాంకు షేర్లలో ర్యాలీ భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా షేరు మూడు శాతం పెరిగి రూ.194 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4% ఎగసి రూ.195 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఈ క్రమంలో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) రూ.లక్షల కోట్లపైన రూ.1,00,169 కోట్లుగా నమోదైంది. తద్వారా మార్కెట్ క్యాప్ రూ.లక్ష కోట్లు దాటిన రెండో ప్రభుత్వరంగ బ్యాంక్‌గా నిలిచింది. కాగా తొలి స్థానంలో ఎస్‌బీఐ (రూ.5 లక్షల కోట్లు) ఉంది.
- గత శుక్రవారం లిస్టింగ్‌లో అదరగొట్టిన ఐకియో లైటింగ్ షేరు ర్యాలీ కొనసాగింది. బీఎస్‌ఈలో 10% పైగా ర్యాలీ చేసి రూ.445.25 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 11% ఎగిసి రూ.455 వద్ద కొత్త జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది.
- భారీ బ్లాక్ డీల్ తర్వాత శ్రీరామ్ ఫైనాన్స్ షేరు ఐదు శాతం లాభపడి రూ.1470 వద్ద స్థిరపడింది. ప్రతి షేరు రూ.1,401 చొప్పున మొత్తం 99.2 లక్షలు ఈక్విటీ షేర్లు(2.65% వాటాకు సమానం) చేతులు మారినట్లు ఎక్స్ఛేంజీ డేటాలో వెల్లడైంది. ఈ డీల్ విలువ రూ.1,390 కోట్లుగా ఉంది.

అదానీ ట్రాన్స్‌మిషన్ నిధుల సమీకరణ

రూ. 8,500 కోట్లకు వాటాదారులు సై



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ అదానీ ట్రాన్స్‌మిషన్ ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ. 8,500 కోట్లు సమకూర్చుకోనుంది. ఇందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వాటాదారుల నుంచి అనుమతి పొందినట్లు కంపెనీ వెల్లడించింది. సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(ప్లేస్‌మెంట్) ద్వారా పెట్టుబడులు సమీకరించనున్నట్లు పేర్కొంది. 2023 మే 15కల్లా ఈక్విటీ షేర్లు లేదా ఏ ఇతర అర్హతగల సెక్యూరిటీల జారీని చేపట్టనున్నట్లు తెలియజేసింది. గత నెల(మే) 13న నిధుల సమీకరణ ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేయగా.. వాటాదారుల నుంచి తాజాగా గ్రీన్‌సిగ్నల్‌ను పొందినట్లు కంపెనీ వివరించింది.

లూబ్రిజోల్ దేశీ పెట్టుబడులు

- రూ. 1,230 కోట్లకు రెడీ
- గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌తో జత



ముంబై: స్పెషాలిటీ కెమికల్స్ తయారీ యూఎస్ కంపెనీ లూబ్రిజోల్ కార్పొరేషన్ దేశీయంగా 15 కోట్ల డాలర్లు(సుమారు రూ. 1,230 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులపై తాజా పెట్టుబడులను వెచ్చించనున్నట్లు బెర్క్‌షైర్ హాథవే ప్రమోట్ చేసిన కంపెనీ తెలియజేసింది. ప్రణాళికల్లో భాగంగా గుజరాత్‌లోని విలాయత్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద సీపీవీసీ రెజిన్ ప్లాంటును నిర్మించనున్నట్లు పేర్కొంది. డైవర్సిఫైడ్ దిగ్గజం గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌తో భాగస్వామ్యం ద్వారా నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలియజేసింది. దహేజ్ ప్లాంటులో సీపీవీసీ సామర్థ్యాన్ని రెట్టింపునకు పెంచడం ద్వారా 1.4 లక్షల టన్నులకు చేర్చనున్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా నవీముంబైలో రెండో గ్రీజ్ ల్యాబ్‌ను ప్రారంభించనున్నట్లు తెలియజేసింది.

1928లో..: రవాణా, పారిశ్రామిక, కన్స్యూమర్ మార్కెట్లకు అవసరమయ్యే స్పెషాలిటీ కెమికల్స్‌ను రూపొందిస్తున్న లూబ్రిజోల్ కార్పొరేషన్ 1928లో ఏర్పాటైంది. ఇంజిన్ ఆయిల్స్, డీజిల్, ఇండస్ట్రియల్ లూబ్రికెంట్స్, రవాణా సంబంధ ఫ్లూయిడ్స్‌కు ఎడిటివ్స్‌ను సైతం తయారు చేస్తోంది. 1966 నుంచీ దేశీయంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం గ్రాసిమ్‌తో భాగస్వామ్యం ద్వారా తొలి దశలో లక్ష టన్నుల సీపీవీసీ రెజిన్ ప్లాంటుకు శంకుస్థాపన చేయనున్నట్లు లూబ్రిజోల్ పేర్కొంది. విలాయత్‌లో గ్రాసిమ్‌కుగల స్థలంలో ప్లాంటును నెలకొల్పనున్నట్లు వెల్లడించింది. ఉత్తర అమెరికా తదుపరి రెండో ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని సైతం నెలకొల్పనున్నట్లు తెలియజేసింది.

మారుతీ ఇన్విక్టో బుకింగ్స్ షురూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మారుతీ సుజుకీ సరికొత్త యుటిలిటీ వెహికిల్ ఇన్విక్టో బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి. వినియోగదార్లు రూ.25,000 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. జూలై 5న ఈ కారు భారత్‌లో ఎంట్రీ ఇవ్వనుంది. ధర రూ.20 లక్షలకుపైగా ఉండనుంది. ఇన్విక్టో రాకతో మూడు వరుసల్లో లభించే ప్రీమియం వెహికిల్స్ విభాగంలోకి ప్రవేశించినట్టు అవుతుందని మారుతీ సుజుకీ తెలిపింది. స్పోర్ట్ యుటిలిటీ/మల్టీపర్పస్ వెహికిల్ లక్షణాలతో కూడిన ప్రీమియం మూడు–వరుసల వాహనాన్ని కోరుకునే వినియోగదారులను కంపెనీ లక్ష్యంగా చేసుకుంది. దేశవ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో మూడు వరుసలున్న స్పోర్ట్ యుటిలిటీ/మల్టీపర్పస్ వెహికిల్స్ 2.58 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇందులో రూ.20 లక్షలకుపైగా ఖరీదు చేసేవి 1.2–1.25 లక్షల యూనిట్లు ఉంటాయని కంపెనీ తెలిపింది. టయోటా ఇన్నోవా హైక్రాస్ ఎంపీవీ ఆధారంగా ఇన్విక్టో రూపుదిద్దుకుంది.



భారత్‌లో రెట్టింపు రేడియో థెరపీ మెషీన్లు అవసరం

ఎలెక్టా ఇండియా ఎండీ మణికందన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌లో ఏటా క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. 2020లో కొత్తగా 13.25 లక్షల కొత్త కేసులు రాగా 8.5 లక్షల మంది క్యాన్సర్ సంబంధ సమస్యలతో మరణించారు. ఈ నేపథ్యంలో దేశీయంగా సకాలంలో సరైన చికిత్స అందించేందుకు రేడియో థెరపీ మెషీన్ల సంఖ్య రెట్టింపు స్థాయికి పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎలెక్టా ఇండియా ఎండీ మణికందన్ బాలా సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో 650 పైచిలుకు మెషీన్లు ఉండగా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకారం జనాభారీత్యా 1,400 వరకు అవసరమని ఆయన చెప్పారు. నివేదికల ప్రకారం తెలంగాణలో 2025 నాటికి కొత్త క్యాన్సర్ కేసుల సంఖ్య 53,000 పైచిలుకు ఉండనుందన్నారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు, చికిత్స వ్యయాలను తగ్గించి .. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు తమ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వాలు, ప్రైవేట్ ఆస్పత్రులతో చర్చలు జరుపుతున్నామని బాలా చెప్పారు. ఎంఆర్–లినాక్ వంటి అధునాతన మెషీన్లను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. క్యాన్సర్ చికిత్సకు సంబంధించి దేశీయంగా తమ మెషీన్లు 500 పైచిలుకు ఉన్నట్లు వివరించారు. ఎలెక్టాకు అమెరికా, బ్రిటన్, చైనా తదితర దేశాల్లో తయారీ ప్లాంట్లు ఉన్నాయి.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

మెడికల్ ప్రాక్టీస్‌కు ఎఫ్‌ఎంజీఈ

ఎఫ్‌ఎంజీఈ 2023

ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్.. సంక్షిప్తంగా ఎఫ్‌ఎంజీఈ. ఇది విదేశాల్లో వైద్య విద్యను పూర్తిచేసుకున్న అభ్యర్థులు స్వదేశంలో ప్రాక్టీస్ చేయడానికి అవకాశం కల్పించే పరీక్ష. ఇందులో అర్హత సాధిస్తే.. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ)లో శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్).. ఏటా రెండుసార్లు ఎఫ్‌ఎంజీఈ స్క్రీనింగ్ టెస్టును నిర్వహిస్తుంది. ప్రస్తుతం ఎఫ్‌ఎంజీఈ–2023 జూన్ ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఎఫ్‌ఎంజీఈకి అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ తదితర వివరాలు..

అర్హతలు

- ఎఫ్‌ఎంజీఈ స్క్రీనింగ్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు భారతీయులు లేదా విదేశాల్లో స్థిరపడిన భారత సంతతికి చెందిన వారై ఉండాలి. వీరు విదేశాల్లో ఎంబీబీఎస్ లేదా తత్సమాన విద్య ఉత్తీర్ణులవ్వాలి.
- ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, యూకే, యూఎస్‌లో అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి.. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సీటు సంపాదించిన వారు లేదా ఆయా దేశాల్లో ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతి లభించిన అభ్యర్థులకు ఈ స్క్రీనింగ్ టెస్ట్ నుంచి మినహాయింపు ఉంది. వారు నేరుగా ఎంసీఐ/ఎస్ఎంసీలో సభ్యత్వం కోసం నమోదు చేసుకోవచ్చు.
- పాకిస్తాన్‌లో మెడిసిన్ పూర్తి చేసిన వారు కేంద్ర హోంశాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం

- ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో రెండు పార్ట్‌లుగా నిర్వహిస్తారు.
- మొత్తం 300 ప్రశ్నలు–300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి పార్ట్‌లో 150 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నలన్నీ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో అడుగుతారు.
- ఒక్కో పార్ట్‌కు రెండున్నర గంటల సమయం కేటాయిస్తారు. రెండు పార్ట్‌లకు కలిపి మొత్తం పరీక్ష సమయం 300 నిమిషాలు. రుణాత్మక మార్కులు లేవు.
- ఈ పరీక్షల్లో అర్హత సాధించాలంటే.. మొత్తం 300 మార్కులకు గాను కనీసం 150 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 20.06.2023
- అడ్మిట్ కార్డుల జారీ: 25.07.2023
- పరీక్ష తేదీ: 30.07.2023
- వెబ్‌సైట్: https://natboard.edu.in

గ్రామీణ బ్యాంకుల్లో.. ఘనమైన కొలువులు

- ఐబీపీఎస్ ఆర్‌ఆర్‌బీ నోటిఫికేషన్ విడుదల
- 43 బ్యాంకుల్లో 9,053 పోస్టులకు ఎంపిక ప్రక్రియ
- ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్–1,2,3 ఉద్యోగాలు

ఉద్యోగార్థులకు శుభవార్త! బ్యాంకు కొలువుల కోసం ప్రయత్నిస్తున్న అభ్యర్థులకు చక్కటి అవకాశం!! ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. గ్రామీణ బ్యాంకుల్లో మొత్తం 9,053 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా డిగ్రీతోనే ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్–1, 2, 3 ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఐబీపీఎస్.. సీఆర్‌పీ ఆర్‌ఆర్‌బీ పోస్టులు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

ఎస్‌బీఐ మినహా దేశంలోని అన్ని జాతీయ బ్యాంకుల్లో క్లర్క్స్ నుంచి ఆఫీసర్స్ వరకు.. వివిధ ఉద్యోగాల భర్తీకి నియామక ప్రక్రియ చేపట్టే సంస్థ.. ఐబీపీఎస్. ఇది తాజాగా దేశంలోని ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు(ఆర్‌ఆర్‌బీ)ల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

43 బ్యాంకులు.. 9053 పోస్టులు

ఐబీపీఎస్ ఇటీవల విడుదల చేసిన సీఆర్‌పీ ఆర్‌ఆర్‌బీ ద్వారా దాదాపు అన్ని రాష్ట్రాల్లోని గ్రామీణ బ్యాంకుల్లో 9053 పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్) 5650; ఆఫీసర్ స్కేల్–1: 2563; ఆఫీసర్ స్కేల్–2 (అగ్రికల్చర్ ఆఫీసర్):118; ఆఫీసర్ స్కేల్–2(మార్కెటింగ్ ఆఫీసర్): 38; ఆఫీసర్ స్కేల్–2(ట్రెజరీ మేనేజర్): 16; ఆఫీసర్ స్కేల్–2(లా): 56; ఆఫీసర్ స్కేల్–2(సీఏ): 63; ఆఫీసర్ స్కేల్–2(ఐటీ): 106; ఆఫీసర్ స్కేల్–2 (జనరల్ బ్యాంకింగ్): 367; ఆఫీసర్ స్కేల్–3: 76 పోస్టులు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 916 ఖాళీలు భర్తీ చేయనున్నారు.

పోస్టులు.. అర్హతలు

- **ఆఫీస్ అసిస్టెంట్(మల్టీ పర్పస్):** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. స్థానిక భాషతోపాటు కంప్యూటర్‌పై అవగాహన ఉండాలి. **వయసు:** జూన్ 1, 2023 నాటికి 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఆఫీసర్ స్కేల్1(అసిస్టెంట్ మేనేజర్):** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పిసికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెట్, లా, ఎకనామిక్స్, అకౌంటెన్సీలో డిగ్రీ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది. స్థానిక భాషపై అవగాహన తప్పనిసరి. దాంతోపాటు కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి. **వయసు:** జూన్ 1, 2023 నాటికి 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఆఫీసర్ స్కేల్–2(జనరల్ బ్యాంకింగ్):** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పిసికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెట్, లా, ఎకనామిక్స్, అకౌంటెన్సీలో డిగ్రీ పాసైన వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఏదైనా బ్యాంకు లేదా ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌లో ఆఫీసర్‌గా రెండేళ్ల అనుభవం ఉండాలి.
- **ఆఫీసర్ స్కేల్ 2(స్పెషలిస్ట్ ఆఫీసర్): ఐటీ ఆఫీసర్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్/కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **చార్టర్డ్ అకౌంటెంట్:** ఐసీఏఐ నుంచి సీఏ ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం తప్పనిసరి.
- **లా ఆఫీసర్:** బ్యాచిలర్ ఆఫ్ లా కోర్సు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల్లో అడ్వకేట్‌గా రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- **ట్రెజరీ మేనేజర్:** సీఏ లేదా ఎంబీఏ ఫైనాన్స్ ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో ఏడాది పని అనుభవం ఉండాలి.
- **మార్కెటింగ్ ఆఫీసర్:** ఎంబీఏ మార్కెటింగ్ స్పెషలైజేషన్ ఉత్తీర్ణత ఉండాలి. ఏడాది పని అనుభవం తప్పనిసరి.
- **అగ్రికల్చరల్ ఆఫీసర్:** అగ్రికల్చర్/హార్టికల్చర్/డెయిరీ/యానిమల్ హస్బెండరీ /ఫారెస్ట్రీ/వెటర్నరీ సైన్స్/అగ్రికల్చర్ ఇంజనీరింగ్/పిసీ కల్చర్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. దీంతోపాటు రెండేళ్ల పని అనుభవం తప్పనిసరి.
- **వయసు:** ఆఫీసర్ స్కేల్–2 అన్ని పోస్టులకు జూన్ 1, 2023 నాటికి 21 ఏళ్ల నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఆఫీసర్ స్కేల్–3:** కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ, యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ సైన్స్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పిసికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెట్, లా, ఎకనామిక్స్, అకౌంటెన్సీలో డిగ్రీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. అయిదేళ్ల పని అనుభవం కూడా ఉండాలి. **వయసు:** జూన్ 1, 2023 నాటికి 21 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
- రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది. ఎస్సీ/ఎస్టీలు ఐదేళ్లు, ఓబీసీలు మూడేళ్లు వయో సడలింపు పొందొచ్చు.



- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. వీరు జూన్ 21 నాటికి ఉత్తీర్ణత సాధించాల్సిన ఉంటుంది.

ఎంపిక విధానం

- ఆర్‌ఆర్‌బీ కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో భాగంగా ఆయా పోస్టులను అనుసరించి వేర్వేరు విధానాల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- ఆఫీస్ అసిస్టెంట్, ఆఫీసర్ స్కేల్–1 పోస్టులకు రెండు దశల రాత పరీక్ష(ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్), ఇంటర్వ్యూ.. ఇలా మొత్తం మూడు దశల్లో నియామక ప్రక్రియ ఉంటుంది.
- ఆఫీసర్ స్కేల్–2, స్కేల్ –3లకు మాత్రం రాత పరీక్షతోపాటు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

ఆఫీస్ అసిస్టెంట్ (మల్టీపర్పస్)

- ఆఫీస్ అసిస్టెంట్(మల్టీ పర్పస్) ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–40 మార్కులు.. ఇలా మొత్తం 80 ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 45 నిమిషాలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తేనే మెయిన్ రాసేందుకు అనుమతి లభిస్తుంది.
- ప్రిలిమ్స్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్ కూడా ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మొత్తం 200 ప్రశ్నలతో 200 మార్కులకు జరుగుతుంది. రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- మెయిన్స్‌లో ప్రతిభ ఆధారంగా 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఆఫీసర్ స్కేల్-1

- ఆఫీసర్ స్కేల్–1 ప్రిలిమినరీ పరీక్ష.. ఆబ్జెక్టివ్ తరహాలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులు చొప్పున మొత్తం 80 ప్రశ్నలతో 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 45 నిమిషాలు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధిస్తేనే మెయిన్‌కు అనుమతిస్తారు.
- **మెయిన్ ఎగ్జామినేషన్:** మెయిన్‌లో రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–50 మార్కులు.. ఇలా వివిధ విభాగాల్లో మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్, హిందీ లాంగ్వేజ్‌లకు సంబంధించి ఏదో ఒక లాంగ్వేజ్‌నే ఎంచుకోవాలి. అభ్యర్థులు ఎంచుకున్న లాంగ్వేజ్ నుంచే ఆ విభాగం ప్రశ్నలు అడుగుతారు.
- మెయిన్ ఎగ్జామ్‌లో ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున తుది దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఆఫీసర్ స్కేల్- 2,3.. ఒకే రాత పరీక్ష

- ఆఫీసర్ స్కేల్–2(జనరలిస్ట్,స్పెషలిస్ట్), ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు ఒకే రాత పరీక్ష నిర్వహిస్తారు.
- ఆఫీసర్(జనరల్ బ్యాంకింగ్)పోస్టులకు రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు– 40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్/హిందీ లాంగ్వేజ్ 40ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40ప్రశ్నలు–50 మార్కులు.. ఇలా మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- ఆఫీసర్ స్కేల్–2(స్పెషలిస్ట్ కేటగిరీ) పోస్టులకు ప్రొఫెషనల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు–40 మార్కులు.. ఇలా మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
- ఆఫీసర్ స్కేల్–3 పోస్టులకు రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–20 మార్కులు, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్/హిందీ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 40 ప్రశ్నలు–50 మార్కులు..ఇలా వివిధ విభాగాల్లో 200 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- అన్ని పోస్టులకు సంబంధించి పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలోనే జరుగుతాయి.
- రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా 1:3 నిష్పత్తిలో (ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున) చివరి దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ప్రాక్టీస్‌తోపాటు వేగం

- **రీజనింగ్:** కోడింగ్, డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, పజిల్స్, ఇన్–ఈక్వాలిటీస్, ఆల్ఫాబెటికల్ సీక్వెన్సెస్, సిలాజిజమ్స్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్స్, స్టేట్‌మెంట్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్స్, ఇన్‌పుట్ అవుట్‌పుట్స్ తదితర అంశాలపై దృష్టిపెట్టాలి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్:** ఇందులో రాణించాలంటే.. గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్, సెంటెన్స్ కరెక్షన్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, యాంటానిమ్స్,సినానిమ్స్‌పై పట్టు సాధించాలి.
- **జనరల్ అవేర్‌నెస్:** కరెంట్ అఫైర్స్, దేశ ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ రంగంలో పరిణామాలు, మానిటరీ పాలసీ, రుణాలు, వడ్డీ రేట్లు, ఫైనాన్స్ రంగ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దాంతోపాటు జాతీయ,అంతర్జాయ పరిణామాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు,ముఖ్యమైన ఘటనలు, తేదీలు, వ్యక్తుల గురించి తెలుసుకోవాలి.
- **క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్:** అర్థమెటిక్ అంశాలు, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్ అంశాలను అధ్యయనం చేయాలి.
- **ప్రొఫెషనల్ నాలెడ్జ్:** ఆఫీసర్ స్కేల్–2 పోస్టులకు ఉండే ఈ విభాగంలో రాణించాలంటే..అభ్యర్థులు తమ అకడమిక్ అర్హతలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి.
- **కంప్యూటర్ నాలెడ్జ్:** కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్(కీ బోర్డ్ షార్ట్ కట్స్, ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ ఎక్సెల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తదితర అంశాల)పై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 21.06.2023
- ప్రిలిమ్స్: ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉంది.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ibps.in

క్లుప్తంగా...

29న బక్రీద్ పండుగ

నెలవంక నిర్ధారణ కమిటీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 29న దేశవ్యాప్తంగా బక్రీద్ (ఈద్–ఉజ్–జుహా) పండుగ జరుపుకోవాలని రుహియ్యతే హిలాల్ (నెలవంక నిర్ధారణ కమిటీ) ప్రతినిధి ముఫ్తీ సయ్యద్ ఖలీల్ అహ్మద్ ఒక ప్రకటనలో కోరారు. సోమవారం మొజంజాహీ మార్కెట్‌లోని సంస్థ కార్యాలయంలో కమిటీ సభ్యులు సమావేశమయ్యారని తెలిపారు. నెలవంక కనబడిందని.. ఈ నేపథ్యంలో నెలవంక కనిపించిన పదోరోజు బక్రీద్ పండుగ జరుపుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 28వ తేదీన అరఫాత్ రోజు అని, ఆ రోజు ఉపవాసం పాటించాలని ఆదేశించారు. కాగా, బక్రీద్ పండుగ సందర్భంగా వివిధ జంతువులను ఖుర్బానీ ఇవ్వడం ఇస్లాం ధర్మంలో సంప్రదాయంగా వస్తోందన్నారు. జంతువుల కొనుగోలు విషయంలో ప్రవక్త ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. 29వ తేదీ నుంచి మూడు రోజులు.. అంటే జూన్ 1వ తేదీ వరకు జంతువుల ఖుర్బానీ ఇవ్వవచ్చని తెలిపారు. ఖుర్బానీ సందర్భంగా పరిసరాలు శుభ్రంగా ఉండే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యా దినోత్సవం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈరోజు(మంగళవారం) రాష్ట్ర విద్యా శాఖ విద్యాదినోత్సవం నిర్వహించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు, గురుకుల పాఠశాలలు, వైద్య, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఫారెస్ట్, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, ఫిషరీస్ విద్యాసంస్థల్లో విద్యాదినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సాధించిన విజయాలను సెలబ్రేట్ చేసుకోవడంతోపాటు 'మన ఊరు–మన బడి'కార్యక్రమంలో భాగంగా నిర్మించిన పాఠశాల భవనాలను, ఇప్పటికే సిద్ధంగా ఉన్న పది వేల గ్రంథాలయాలను, 1,600 డిజిటల్ క్లాస్ రూమ్‌లను కూడా ప్రారంభిస్తారు.

మాల్దీవులతో 'టీ హబ్' వ్యూహాత్మక భాగస్వామ్యం

సాక్షి, హైదరాబాద్: మాల్దీవులకు చెందిన పట్టణాభివృద్ధి సంస్థ 'అర్బన్ కో'తో భారత్‌లో ఆవిష్కరణల వాతావరణానికి దిక్సూచిగా ఉన్న 'టీ హబ్' సోమవారం వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని 'టీ హబ్' సీఈఓ మహంకాళి శ్రీనివాస్‌రావు తెలిపారు. మాల్దీవుల్లో స్మార్ట్, స్థిరమైన నగరాల అభివృద్ధి కోసం అవసరమైన ఆవిష్కరణల్లో టీ హబ్ ఊతం అందిస్తుందని, మాల్దీవుల్లో ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని టీ హబ్‌తో అనుసంధానమై పనిచేస్తున్న స్టార్టప్‌ల ద్వారా వినూత్న పరిష్కారాల కోసం కృషి జరుగుతుందన్నారు. మరోవైపు భారత్, మాల్దీవుల నడుమ అంతర్జాతీయ బంధం బలోపేతమయ్యేందుకు అర్బన్‌కో, టీహబ్ భాగస్వామ్యం తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్‌కో ఎండీ అహ్మద్ అలీఫ్ మాల్దీవుల తరఫున ఒప్పందంపై సంతకాలు చేశారు.

ట్రిపుల్‌ఐటీ ప్రవేశ దరఖాస్తుల గడువు పొడిగింపు

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీ ప్రవేశ దరఖాస్తుల గడువు తేదీని పొడిగించినట్లు డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 19తో దరఖాస్తుల గడువు ముగిసిందన్నారు. వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ సూచన మేరకు గడువును 22 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక కోటాలో ఈ నెల 27వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. జూలై 3న మెరిట్ విద్యార్థుల జాబితాను విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు.

టీఎస్ ఐసెట్ ఫైనల్ కీ, ఫలితాలు వాయిదా

కేయూ క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు గత నెల 26, 27 తేదీల్లో నిర్వహించిన టీఎస్‌ఐసెట్ ఫైనల్ కీ, ఫలితాలు వాయిదా పడ్డాయి. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20న విడుదల చేయాల్సిండగా పలు కారణాలతో వాయిదా వేసినట్లు సెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మి తెలిపారు. ఫైనల్ కీ, ఫలితాల షెడ్యూల్‌ను మళ్లీ ఎప్పుడు వెల్లడిస్తామనేది త్వరలో ప్రకటిస్తామన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎఫ్ఐఐటీజేఈఈ (ఫిట్జీ) విద్యార్థులు విజయ పరంపరను కొనసాగించారు. తమ విద్యార్థులు రిషి కాల్రా ఆలిండియా 3వ ర్యాంక్, మలయ్ కేడియా ఆలిండియా 8వ ర్యాంకు, మోహన శ్రీధర 30వ ర్యాంక్, అభినీత్ మాజేటీ 50వ ర్యాంకు సాధించారని ఫిట్జీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ ఆనంద రామన్ తెలిపారు. ఫిట్జీ ఉపాధ్యాయుల ప్రోత్సాహం, శిక్షణ తమ విజయానికి కారణమయ్యాయని, తాము ఐఐటీ–బాంబేలో కంప్యూటర్ సైన్స్ చదవాలనుకుంటున్నట్లు ర్యాంకులు సాధించిన విద్యార్థులు వెల్లడించారు.

నీట్ మెడికల్ పీజీ స్టేట్ ర్యాంక్‌లు విడుదల

ఫలితాలు విడుదలైన మూడు నెలల తర్వాత ఎన్‌ఎంసీ ప్రకటన

- పీజీ నీట్‌లో 5,690.. నీట్ ఎండీఎస్‌లో 602 మంది అర్హత
- వచ్చే నెలలో కౌన్సెలింగ్ ఉండే అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా 2,722 పీజీ మెడికల్ సీట్లు



సాక్షి, హైదరాబాద్: నీట్ పీజీ మెడికల్, నీట్ ఎండీఎస్ రాష్ట్రస్థాయి ర్యాంకులు విడుదలయ్యాయి. ఫలితాలు విడుదలైన మూడు నెలల తర్వాత రాష్ట్రస్థాయి డేటాను జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) విడుదల చేసింది. ఎన్‌ఎంసీ నుంచి రాష్ట్ర స్థాయి ర్యాంకుల వివరాలు అందినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు వెల్లడించాయి. నీట్ పీజీలో రాష్ట్రం నుంచి దాదాపు 12 వేల మంది పరీక్ష రాయగా 5,690 మంది అర్హత పొందారు. నీట్ ఎండీఎస్‌లో 602 మంది అర్హత సాధించినట్లు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. పీజీ మెడికల్ పరీక్ష మార్చి 5వ తేదీన జరిగింది. ఆ తర్వాత పది రోజులకు ఫలితాలు వచ్చాయి. వచ్చిన మార్కులు, జాతీయ స్థాయి ర్యాంకులను బట్టి విద్యార్థుల క్రమ సంఖ్య ఆధారంగా స్టేట్ ర్యాంకులు నిర్ధారించినట్లు అధికారులు వెల్లడించారు. ఇది కేవలం జాతీయస్థాయి ర్యాంకుల ఆధారంగా తయారు చేసిందేనని, మెరిట్ జాబితా కాదని కాళోజీ వర్సిటీ తెలిపింది. నీట్ పీజీ మెడికల్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి పది స్థానాల్లో వి.వి.కౌశిక్ అల్వార్, వేణు మాధవ్ పిన్నింటి, నంబూరి కృష్ణశ్రీ, జి.పవిత్ర, జీశన్ అహ్మద్ జాలీలి, రెగోటి అశ్రిత, తంగెడ కౌశిక్, కనుమిల్లి ప్రదీప్, బైరోజు శివ సాయితేజ, గడ్డం నిఖిత ఉన్నారు. నీట్ ఎండీఎస్ మొదటి పది స్థానాల్లో వర్ణిక పారుపల్లి, దుంప తేజస్వి, జె.కుసుమ, రుంజాల సుసన్ డైసీ క్రిస్, ముత్యాల శ్రీసాయి సుఖేష్, రొంపికుంట్ల శాలిని, మనీష కుమారి, సోమ చాణక్య, చర్క సామేశ్వరి, అక్షయ్ కులకర్ణి ఉన్నారు.

2,300కు పైగా క్లినికల్ సీట్లు..

రాష్ట్రవ్యాప్తంగా 32 ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 2,722 పీజీ మెడికల్ సీట్లున్నాయి. అందులో దాదాపు 400 నాన్ క్లినికల్ సీట్లు పోగా, మిగిలినవి క్లినికల్ సీట్లు ఉంటాయని వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ కాలేజీల్లోని 15% సీట్లను జాతీయ స్థాయి కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. మిగిలిన వాటిని రాష్ట్ర కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. అయితే ఈసారి దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి ఏకీకృత కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశముంది. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కాళోజీ వర్గాలు తెలిపాయి. కాగా వచ్చే నెలలో పీజీ మెడికల్ కౌన్సెలింగ్ జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎంబీబీఎస్ ఇంటర్న్‌షిప్ పూర్తి కాకపోవడం వల్ల ఈ ఆలస్యం జరుగుతోంది. కాగా పీజీ మెడికల్ క్లినికల్ సీట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. అందుకే కోట్లు ఖర్చు చేసి మరీ ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని ఆ సీట్లలో చేరుతుంటారు. ఒక్క సీటు కూడా మిగలదు. సీట్లు పొందిన వారు స్పెషలిస్టు వైద్యులుగా తమ కెరీర్‌ను మలుచుకుంటారు. ఇక నాన్ క్లినికల్ పీజీ సీట్లను పట్టించుకునే వారే ఉండరు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉండే కన్వీనర్ కోటా సీట్లలోనూ విద్యార్థులు చేరడం లేదంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. క్లినికల్ విభాగంలో మొత్తం 14 సబ్జెక్టులుండగా..నాన్ క్లినికల్‌లో 9 సబ్జెక్టులు ఉన్నాయి.

నీట్ పీజీలో ఎస్సీ, ఓబీసీ కటాఫ్ మార్కులు ఎన్ని?

ఎన్‌ఎంసీకి హైకోర్టు ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: నీట్ పీజీ–2023 అడ్మిషన్లలో ఎస్సీ, ఓబీసీ వర్గాలకు చెందిన.. చివరిగా అడ్మిట్ అయిన అభ్యర్థి సాధించిన మార్కులు, ర్యాంక్ వివరాలు తెలియజేయాలని నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ)ను హైకోర్టును ఆదేశించింది. తదుపరి విచారణ నేటికి వాయిదా వేసింది. ట్రాన్స్ జెండర్లకు రిజర్వేషన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో సూచించినా.. జాతీయ మెడికల్ కమిషన్ జారీ చేసిన నీట్ పీజీ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌లో ఎక్కడా ఆ అంశాన్ని పేర్కొనలేదని హైదరాబాద్‌కు చెందిన కొయ్యల రూత్ జాన్ పాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. నీట్ పీజీ అడ్మిషన్లలో అర్హత సాధించిన చివరి అభ్యర్థి ర్యాంకులు, మార్కులను తెలుసుకుని రావాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణానికి సీఎంకు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణానికి హాజరుకావాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. సెక్రటేరియట్‌లో కేసీఆర్‌ను దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ సాయి బాబా గౌడ్, ఈవో అన్నపూర్ణ కలిసి కళ్యాణ ఆహ్వాన పత్రికను అందజేశారు.

సింగరేణితో ఎన్టీపీసీ బొగ్గు సరఫరా ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: రామగుండం, కుడ్గి, సోలాపూర్ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరా కోసం సింగరేణి సంస్థతో ఎన్టీపీసీ దక్షిణాది విభాగం సోమవారం అదనపు ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్టీపీసీ తరఫున దక్షిణాది ప్రాంతీయ ఈడీ దేబాశిష్ చటోపాధ్యాయ, సింగరేణి తరఫున జీఎం కె.సూర్యనారాయణ ఒప్పందంపై సంతకాలు చేశారు.

అత్యంత కీలక పోస్టులూ భర్తీ చేయరా?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడిని ఎప్పుడు నియమిస్తారో చెప్పాలని, అత్యంత కీలక పోస్టులూ భర్తీ చేయకుంటే ఎలా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంలో కమిషన్ ముఖ్య పాత్ర పోషించడంతో పాటు వేగంగా ఉత్తర్వులు జారీ చేస్తుందని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ నాటికి వివరణ ఇవ్వాలని ఆదేశించింది. విచారణను జూలై 25కు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం.. కమిషన్ అధ్యక్షుడిని వెంటనే నియమించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది, వినియోగదారుల రక్షణ చట్టం పుస్తక సహ రచయిత బాగ్లేకర్ ఆకాశ్ కుమార్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

నాలుగు నెలలకుపైగా ఆ పోస్టు ఖాళీ

న్యాయవాది ఆకాశ్ వాదనలు వినిపిస్తూ.. 2023, ఫిబ్రవరి 4న మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్‌కే జైస్వాల్ కమిషన్ అధ్యక్షుడిగా పదవీ విరమణ పొందారన్నారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉందని చెప్పారు. పదవీ విరమణకు ముందు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల కోసం 2022లో నోటిఫికేషన్ జారీ చేసినా.. ఇప్పటికీ ఎవరినీ నియమించలేదని పేర్కొన్నారు. వస్తు కొనుగోలు, సేవలకు సంబంధించి రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు ఈ కమిషన్ విచారణ చేపడుతుందన్నారు. అలాగే జిల్లా కమిషన్లు ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీల్‌లను కూడా విచారణకు స్వీకరిస్తుందని వెల్లడించారు. వాదనలు విన్న ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

జూన్ వేతనాలు జూలైలో చెల్లింపు..

- బొగ్గు గని కార్మికులకు పెరిగిన జీతాలు
- ఒప్పందంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి సంతకం
- ఒక్కో కార్మికుడికి రూ.9వేల నుంచి రూ.20వేల వరకు పెంపు

గోదావరిఖని, సింగరేణి: దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని కార్మికుల వేతనాలు పెరగనున్నాయి. ఈ నెల నుంచే పెంపు అమలు కానుండగా.. జూలై వేతనాలతో చెల్లించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 4లక్షల మందికి ఈ వేతనాల పెంపు అమలుకానుంది. ఈ మేరకు సంబంధిత ఫైల్‌పై సోమవారం కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి సంతకం చేశారు. ఫలితంగా ఒక్కో కార్మికుడికి రూ.9వేల నుంచి రూ.20వేల వరకు జీతం పెరగనుంది. ఈ లెక్కన సింగరేణిలో 39వేల మంది కార్మికులకు మేలు జరగనుంది. ఈమేరకు ఈ నెల 21న కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయనుంది. కార్మికుల కనీస పెరుగుదల 10వ వేజ్‌బోర్డు ఒప్పందంలోని బేసిక్, డీఏ, వీడీఏ, ఎస్‌డీఏ 19శాతం ఉండనుంది. అలాగే అలవెన్స్‌లపై గతంలో ఉన్న దానిపై 25శాతం, స్పెషల్ అలవెన్స్ ఐదు శాతం, పదో వేతన ఒప్పందం పూర్తయిన 23 నెలల వేతన వ్యత్యాస ఎరియర్స్ కూడా చెల్లించనున్నారు. అయితే దీనికి ఇంకా తేదీ ప్రకటించలేదు. కాగా కార్మికులకు పెరిగిన వేతనాలు జూలై నుంచి చెల్లించనున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, వేజ్‌బోర్డు సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు.

వేజ్‌బోర్డు ఎరియర్స్‌పై సింగరేణి నిర్ణయం

పదో వేతన ఒప్పందం 2021 జూలైతో పూర్తయ్యింది. 11వ వేతన ఒప్పందం ఖరారు కోసం 23నెలల సమయం పట్టింది. 23నెలల వేతనాల ఎరియర్స్‌పై సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల యాజమాన్యాలు వీలును బట్టి చెల్లించనున్నాయి. నూతన వేజ్‌బోర్డు అమలు అయిన తర్వాత ఎరియర్స్ చెల్లింపుపై దృష్టి సారించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు.

రైలుపై తెగిపడిన బ్రాకెట్ ఇన్సులేటర్లు

పెద్ద శబ్దం.. బోగీలపై వ్యాపించిన మంటలు

- మధిర సమీపంలో నిలిచిన శాతవాహన ఎక్స్‌ప్రెస్
- తీవ్ర భయాందోళనకు గురైన ప్రయాణికులు
- హాహాకారాలు చేస్తూ రైలు దిగి పరుగులు



రైలు నిలిచిపోవడంతో ప్రయాణికుల అవస్థలు

మధిర/ఖమ్మం మామిళ్లగూడెం: సికింద్రాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న శాతవాహన (12714) ఎక్స్‌ప్రెస్ రైలుపై మధిర రైల్వే స్టేషన్ సమీపాన బ్రాకెట్ ఇన్సులేటర్లు తెగిపడ్డాయి. దీంతో పెద్ద శబ్దం రావడమే కాక మంటలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనలకు గురై హాహాకారాలు చేశారు. మధిర రైల్వేస్టేషన్‌కు పది అడుగుల దూరాన రైలు నిలిచిపోగానే ప్రయాణికులు కిందకు దిగి పరుగులు తీశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సాయంత్రం 4:30 గంటలకు బయలుదేరిన శాతవాహన ఎక్స్‌ప్రెస్.. రాత్రి 9.30 గంటలకు కిలోమీటర్ నంబర్ 528/26 వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. ట్రాక్ పక్కన ఉండే స్తంభాల నుంచి రైళ్ల నడిచేలా ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలకు అనుసంధానంగా బ్రాకెట్ ఇన్సులేటర్లు ఉంటాయి. ప్రమాదవశాత్తు ఈ ఇన్సులేటర్లు తెగిపడటంతో బోగీలపై మంటలు వచ్చినట్లు చెబుతున్నారు. విద్యుత్ తీగలు కూడా తెగిపోయినా రైలుకు పక్కన పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వెంటనే రైలు ఆగింది. ఒకవేళ విద్యుత్ తీగలు తెగి బోగీలపై పడి ఉంటే, విద్యుత్ సరఫరా ఉన్నందున పెనుప్రమాదం జరిగేదని చెబుతున్నారు. ఈ క్రమంలో వచ్చిన భారీ శబ్దాలతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రైలు ఆగగానే లగేజీ, పిల్లలతో కలిసి కిందకు దిగి పరుగులు పెడుతూ మధిర స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ విషయమై టీవీల్లో స్క్రోలింగ్ మొదలుకావడంతో వారికి బంధువులు ఫోన్ చేసి క్షేమ సమాచారాలను ఆరా తీయడం కనిపించింది.

నిలిచిన రైళ్లు : శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఇంజన్ ఓవర్ హెడ్ ఎలక్ట్రికల్ (ఓహెచ్‌ఈ) వైర్లలో సాంకేతిక లోపం తలెత్తినట్లు అధికారులు గుర్తించారు. ఓ పక్క సరఫరా నిలిచిపోయి శాతవాహన మధిరలో ఆగగా, మిగతా రైళ్లను కూడా ముందు జాగ్రత్తలో భాగంగా అటూ, ఇటు స్టేషన్లలో ఆపేశారు. ఖమ్మం రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్ – తిరుపతి ప్రత్యేక రైలు, మధిర సమీపాన జీటీ, గోదావరి రైళ్లు, డోర్నకల్, పాపటపల్లి స్టేషన్లలో పద్మావతి, చార్మినార్ రైళ్లను అధికారులు నిలిపివేశారు. రైల్వే ఉద్యోగులు మధిర వెళ్లి శాతవాహన ఎక్స్‌ప్రెస్ ఓహెచ్‌ఈకి రెండుగంటల పాటు శ్రమించి మరమ్మతులు చేశారు. 11.30 గంటల తర్వాత నిలిచిపోయిన రైళ్లన్నీ ఒక్కొక్కటిగా ముందుకు కదిలాయి.

పెద్ద శబ్దం వచ్చింది



సికింద్రాబాద్ నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు బయలుదేరా. మధిర స్టేషన్ సమీపిస్తున్న సమయంలో పెద్ద శబ్దం వచ్చింది. ఆ తర్వాత బోగీలపైన మంటలు వస్తున్నాయని ప్రయాణికులు కేకలు వేశారు. దీంతో నేను కూడా భయపడ్డా. దేవుడి దయ వల్ల పెద్ద ప్రమాదం జరగలేదు. – ప్రశాంత్ కుమార్, ప్రయాణికుడు

ప్రాణం పోయిందనుకున్నా..



అప్పుడే నిద్ర పోతున్నా. బోగీలపై ఏదో రాడ్డు దూసుకుపోతున్న శబ్దం వచ్చింది. ఆ శబ్దానికి ఉలిక్కిపడి లేచా. ఆ తర్వాత బోగీలపై మంటలు కూడా వచ్చాయి. ప్రాణం పోయిందనే అనుకున్నా. రైలు ఆగగానే అందరం కిందకు దిగి పరుగులు తీశాం. – వి.శ్రీనివాస్, ప్రయాణికుడు

హత్యకు గురైన ఎఫ్ఆర్ఓ భార్యకు డీటీగా ఉద్యోగం



ఖమ్మంమయూరి సెంటర్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎఫ్ఆర్ఓ చలమల శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మికి ప్రభుత్వం డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) గా ఉద్యోగం ఇచ్చింది. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన హరితోత్సవం సందర్భంగా ఆమెకు సీఎం కేసీఆర్ నియామక ఉత్తర్వులు అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎఫ్ఆర్ఓగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావును చంద్రుగొండు రేంజ్‌లో గుత్తికోయలు హత్య చేసిన విషయం విదితమే. దీంతో ప్రభుత్వం ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఖమ్మంలో 500 గజాల స్థలాన్ని కేటాయించింది. ఇప్పుడు శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మికి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇచ్చింది. ఈ సందర్భంగా ఐఎఫ్ఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ – తెలంగాణ చాప్టర్, అటవీ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం, అటవీ క్షేత్రాధికారుల సంఘం, రాష్ట్ర అటవీ అధికారుల సంఘం, భారత అటవీ అధికారుల సంఘం ప్రతినిధులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఎఫ్ఆర్ఓ చలమల శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు ఆయన భార్యకు డీటీగా ఉద్యోగం ఇవ్వడంపై మంత్రి పువ్వాడ అజయ్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యేక శ్రద్ధతో హరితహారం: ఇంద్రకరణ్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): హరితహారం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తోందని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం రవీంద్రభారతిలో అటవీశాఖ ఆధ్వర్యంలో హరితోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమం దేశానికే దిక్సూచి అని, ఈ కార్యక్రమానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడమే అందుకు నిదర్శనమని అన్నారు. హరితహారంతో మన అడవులకు పూర్వ వైభవం వచ్చిందని, తెలంగాణ అంతటా పచ్చదనం నిండుకుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు.

రెండు రోజులు వానలు

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు



ప్రాంతం	జిల్లా	ఉష్ణోగ్రత
నేలకొండపల్లి	ఖమ్మం	44.7
మునగాల	సూర్యాపేట్	44.2
పాలకుర్తి	పెద్దపల్లి	44.2
ముత్తారం	పెద్దపల్లి	43.8
మణుగూరు	కొత్తగూడెం	43.8

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండు రోజులపాటు తేలికపాటి వానలు కురిసే అవకాశంఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని భాగాలకు విస్తరించిన నైరుతి రుతుపవనాలు.. రానున్న రెండు, మూడు రోజుల్లో దక్షిణ భారత రాష్ట్రాలకు పూర్తిగా విస్తరించే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మంగళవారం వడగాలులు వీచే అవకాశముందని హెచ్చరించింది. సోమవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో 44.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం
ఖమ్మం	42.2
రామగుండం	41.3
భద్రాచలం	41.2
నల్లగొండ	41.0
ఆదిలాబాద్	40.3
నిజామాబాద్	39.9
మెదక్	39.6
హనుమకొండ	39.5
మహబూబ్‌నగర్	38.2
హైదరాబాద్	37.8
దుండిగల్	37.0
హకీంపేట్	36.8

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.